ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

బుధవారం 18.11.2026 | సంపుటి:13 సంచిక:118 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



సమ్మక్క సాగర్ ఎన్ఓసీకి ఛత్తీస్‌గఢ్ సీఎం

సానుకూలం

ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటి

- ప్రాజెక్టుకు ఎన్‌వోసీ ఇవ్వాలని నీటి నిల్వకు, ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతులకూ సహకరించాలని విజ్ఞప్తి
- హాజరైన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

జార్ఖండ్(జనంసాక్షి):సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాల వేగం పెంచింది. రెండు రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోదీతోనూ చర్చించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ దిల్లీ నుంచి నేరుగా రాయ్‌పూర్ వెళ్లి ఛత్తీస్‌గడ్ సీఎం విష్ణుదేవ్‌సాయితో భేటీ అయ్యారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణానికి నిరభ్యంతర పత్రం ఇవ్వాలని ఛత్తీస్‌గడ్ సీఎంను రేవంత్ రెడ్డి కోరారు. ఎల్‌నినో పరిస్థితుల వల్ల తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని సీఎం వివరించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతులకూ సహకరించాలని కోరారు.ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ఎన్వోసీ కీలకం ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ఎన్వోసీ ప్రక్రియను త్వరగా పూర్తి

మిగతా 2లో..



సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతుల కోసం ఛత్తీస్‌గడ్ సీఎం విష్ణుదేవ్‌సాయికి వినతిపత్రం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో తెలంగాణ నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా

- ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు..
- సిద్ధిపేట బహిరంగ సభలో 19న దరఖాస్తు విడుదల
- రాష్ట్రంలోని అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా అందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ శాఖల్లో అమలవుతున్న బీమా పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సీఎం సూచించారు. ఇందుకోసం ఈ నెల 19న సిద్ధిపేట బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా దరఖాస్తును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందిరమ్మ బీమా, ఇందిరమ్మ చీరల పంపిణీపై జూబ్లీహిల్స్ నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు

మిగతా 2లో..

కోపం.. ద్వేషం.. భయం.. ఆర్ఎస్ఎస్ చుట్టూ

అల్లుకుపోయాయి

ప్రేమను చూడకుండా.. వ్యక్తపరచకుండా ఆ వల వారిని అడ్డుకుంటోంది

దాని నుంచి వారందరినీ విడిపించడమే నా కర్తవ్యం:కాంగ్రెస్ అగ్రనేత రాహుల్



న్యూఢిల్లీ(జనంసాక్షి):తమ ఇంట్లో భోజనం చేసే సమయంలో ప్రేమతో అమ్మ.. నాన్న ఒడిలో కూర్చునేవారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెల్లడించారు. ఆ వ్యాఖ్యలపై భాజపా, ఆర్ఎస్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. వాటిపై రాహుల్ స్పందిస్తూ..కీలక వ్యాఖ్యలు చేశారు. భయం, కోపం, ద్వేషం అనేవి భాజపా, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల చుట్టూ ఒక వలలా అల్లుకుపోయాయని అన్నారు. ప్రేమను చూడకుండా.. వ్యక్తపరచకుండా ఆ వల వారిని అడ్డుకుంటోందన్నారు. దాని నుంచి వారందరినీ విడిపించి ప్రేమ, అనుబంధంలోని ఆనందాన్ని పొందేలా చేయడం తన కర్తవ్యమని పేర్కొన్నారు. తన పోస్టులో రాహుల్ శివ పార్వతుల పురాతన ఆలయ శిల్పాన్ని షేర్ చేశారు. రాజీవ్-సోనియా గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై అస్సాం సీఎం, భాజపా నేత హిమంత బిశ్వ శర్మ స్పందిస్తూ.. రాహుల్‌ను విమర్శించారు. సోనియా గాంధీని ఉద్దేశిస్తూ.. 'క్షమించండి మేడమ్. మీ కుమారుడు మీ వ్యక్తిగత విషయాలను కూడా బహిరంగంగా ప్రస్తావిస్తూ..మీకు ఇబ్బంది కలిగిస్తున్నారు. మీ జీవితంలో ఇంతటి ప్రత్యేకమైన రోజున కూడా ఆయన తన వ్యాఖ్యలతో ఇబ్బంది పెట్టారు. ఈ విషయాన్ని దేశం ఎప్పుడో గ్రహించింది. ఇప్పుడు మీరు కూడా గ్రహిస్తారని ఆశిస్తున్నా' అని సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

గర్ల్‌ఫ్రెండ్‌తో రాహుల్ డేట్..

ఆసక్తికర విషయాలు వెల్లడించిన కాంగ్రెస్ అగ్రనేత

2లో..

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు

7 బిలియన్ డాలర్లు



భారత్‌లో అమెజాన్ భారీ పెట్టుబడులు


న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెజాన్ సంస్థ భారీ పెట్టుబడి ప్రకటించింది. 2030 నాటికి భారత్‌లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల్లో 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. భారత కరెన్సీలో సుమారు రూ.65 వేల కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. దీనిద్వారా తన పునరుత్పాదక ఇంధన పోర్ట్‌ఫోలియోను గణనీయంగా విస్తరించడంతో పాటు,

మిగతా 2లో..

భారత్, ఆసియాన్ దేశాలు

కలిసి పనిచేయాలి

పోటీ కంటే సహకారానికే ప్రాధాన్యం ఇవ్వాలి



- శాంతి, స్థిరత్వానికి దోహదం చేయాలి
- మనిలాలో జరిగిన భారత్-ఆసియాన్ సదస్సులో భారత ప్రధాని మోదీ కీలక ప్రతిపాదనలు

మనీలా(జనంసాక్షి):భారత్, ఆసియాన్ దేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పోటీ కంటే సహకారానికే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.ప్రపంచంలో ప్రస్తుతం ఒకదాని తర్వాత మరొకటి సంక్షోభాలు ఎదురవుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో దేశాల మధ్య పోటీ కంటే పరస్పర సహకారం ఎంతో అవసరమని భారత ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. శాంతి, స్థిరత్వం, స్పష్టమైన విధానాలతోనే భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. భారత్, ఆసియాన్ దేశాలు ఈ దిశగా కలిసి పనిచేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనిలాలో జరిగిన 23వ భారత్-ఆసియాన్ సదస్సులో ఆయన మాట్లాడారు.భారత్, ఆసియాన్ దేశాలు కలిసి ప్రపంచ జనాభాలో

మిగతా 2లో..

క్వాడ్‌తో ఇండో-పసిఫిక్‌కు భరోసా

తదుపరి దశకు స్పష్టమైన లక్ష్యాలు..
క్వాడ్ సమావేశంలో మోదీ కీలక వ్యాఖ్యలు

2లో..

మోదీ గొప్పనాయకుడు

అవసరమైన సందర్భాల్లో కలిసి పనిచేస్తాం: ట్రంప్

2లో..

రాష్ట్రం కరువులో ఉంటే

మూసీ సుందరీకరణ ఎందుకు ?

సోనియాగాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదు?: కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి):మూసీలో పది టీఎంసీల నీరు పోస్తామని సీఎం అంటున్నారు... ఆ నీరు హైదరాబాద్ ప్రజలకు ఇవ్వొచ్చు కదా. కరవులో మూసీ సుందరీకరణ అవసరమా? మేనిఫెస్టోలో ఏం చెప్పారో కాంగ్రెస్ నేతలకు గుర్తు ఉందో... లేదో.. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు, తగిన సమయంలో బుద్ధి చెబుతారు. చివరి వంద రోజుల్లో మాయ చేస్తే సరిపోతుందన్న అహంకారంతో వ్యవహరిస్తున్నారు.. అలాంటి వారికి ప్రజలు గతంలో ఎలా బుద్ధి చెప్పారో చూశాం. డీపీఆర్‌లు వెనక్కు రావడం కాంగ్రెస్ ప్రభుత్వ సామర్థ్యానికి నిదర్శనం.కేసీఆర్ మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేస్తే... కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో మహారాష్ట్ర సీఎం అపాయింట్మెంట్ సాధించింది. అసెంబ్లీలో నాపై సీఎం ఆరోపణలు చేసి రెండు నెలలు గడిచిపోయింది. 8వేల ఎకరాల వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేశాను.. సీఎం మాటలకు ఇంకా ఏం విలువ ఉంటుంది? ఎర్రవల్లి ఫామ్ హౌజ్

మిగతా 2లో..



కాంగ్రెస్ నయవంచనకు

మూడేళ్లు పూర్తైంది

ఈ విషయాన్ని ప్రజలు గుర్తించారు: హరీశ్

హైదరాబాద్(జనంసాక్షి): కాంగ్రెస్ మ్యానిఫెస్టో, ఆ పార్టీ నయవంచనకు మూడేళ్లు పూర్తయిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మూడేళ్ల గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలకు దిక్కులేదని.. అమలు ఊసేలేదని ఆక్షేపించారు. అభయ హస్తం, శూన్య హస్తం అయిందన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. గాంధీభవన్ సాక్షిగా ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. దీనికి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "తొలి క్యాబినెట్ భేటీలోనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ నీటిమూటగానే మిగిలింది. ఇప్పటివరకు 38 క్యాబినెట్ సమావేశాలు జరిగినా.. ఆరు గ్యారంటీలకు

మిగతా 2లో..



'అక్వాన్' దూసుకొస్తోంది

- మంగళవారం రాత్రికి తీవ్ర తుపానుగా
- మారే అవకాశం
- గురు, శుక్రవారాల్లో అత్యంత భారీ వర్షాలు

అమరావతి(జనంసాక్షి): దక్షిణ, పశ్చిమ మధ్య బంగా ళాఖాతంలో 'అక్వాన్' తుపాను కేంద్రీకృతమైంది. ప్రస్తుతానికి ఇది చెన్నైకి 590 కి.మీ., మచిలీపట్నానికి 650 కి.మీ., విశాఖపట్నానికి 660 కి.మీ., ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 780 కి.మీ దూరంలో ఉంది. గడిచిన 6 గంటల్లో గంటకు 3 కి.మీ వేగంతో కదలిన

మిగతా 2లో..

ఆ నిబంధన చెల్లదు

ట్రంప్‌నకు ఫెడరల్ కోర్టు షాక్
విదేశీ విద్యార్థులకు కోర్టు ఊరట..!



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులు, జర్నలిస్టులకు భారీ ఊరటనిస్తూ అక్కడి ఫెడరల్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. విదేశీ విద్యార్థులు, జర్నలిస్టుల నివాస గడువు పరిమితికి సంబంధించి ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చిన సరికొత్త నిబంధనను యూఎస్ ఫెడరల్ జడ్జి కొట్టివేశారు. ఎఫ్-1, జె-1, ఐ వీసాలు ఉన్నవారికి నివాస కాలపరిమితిని భారీగా కుదిస్తూ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం 2026లో నిబంధనలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వాస్తవానికి దీనిపై సెప్టెంబర్ 14నే కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్ జారీ చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా, సహేతుకత లోపం, అధికార దుర్వినియోగంతో ఉందని జడ్జి ఎఫ్ డెన్నిస్ స్లేయర్ వ్యాఖ్యానించారు. విదేశీ విద్యార్థులకు అవకాశాలు కల్పించడం అనేది కాంగ్రెస్ పని అని న్యాయమూర్తి వెల్లడించారు. దానిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం ల్యాండ్ సెక్యూరిటీ అడ్డుకోవడానికి యత్నిస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ వీసాలున్న విదేశీ విద్యార్థులు, ఏ వీసాలున్న విదేశీ పరిశోధకులు, ప్రొఫెసర్లు, ఎ వీసాలున్న విదేశీ జర్నలిస్టులకు ఈ తీర్పుతో ఊరట లభించినట్లైంది. పాత నిబంధనల ప్రకారం ఎఫ్, జే వీసాలపై వచ్చే వారు తమ

మిగతా 2లో..

వాషింగ్టన్‌పై

డర్టీబాంబ్..





ట్రంప్ కార్యవర్గ సభ్యులే లక్ష్యంగా రసాయనిక ఆయుధాన్ని పేల్చేందుకు ఇరాన్ ప్రణాళికలు !

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ట్రంప్ కార్యవర్గ సభ్యులే లక్ష్యంగా దర్టీ బాంబ్ లేదా రసాయనిక ఆయుధాన్ని పేల్చేందుకు ఇరాన్ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. ఇప్పటికే అమెరికాలో భద్రతా వర్గాలు ఇలాంటి దాడులను ఎదుర్కోవడానికి సన్నాహాలు చేస్తున్నాయి.మరోవైపు శ్వేతసౌధం ప్రతినిధి లారెన్ బిన్ ఈ వార్తలపై స్పందిస్తూ అమెరికాకు పొంచి ఉన్న ముప్పులను జాగ్రత్తగా గమనిస్తున్నామని వెల్లడించారు. అయితే.. ఇప్పటికిప్పుడు ప్రమాదం ఉన్నట్లు ఎటువంటి సమాచారం లేదని పేర్కొన్నారు. మరోవైపు అమెరికా అధికారులు మాత్రం దాడులు, ఆర్థిక కట్టడితో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఇరాన్ ఈ రకమైన దాడికి యత్నించే అవకాశాలు ఉన్నట్లే భావిస్తున్నారు. అమెరికా ప్రధాన భూభాగాన్నే లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అమెరికా ఆర్థిక యుద్ధానికి

మిగతా 2లో..

కర్రెగుట్టల్లో మావోయిస్టుల

భారీ డంప్ గుర్తింపు



ఎప్‌స్టీన్‌ది ఆత్మహత్య కాదు

హత్యే..

ఫోరెన్సిక్ నిపుణుడి సంచలన ప్రకటన

నకిలీ సిల్వర్ ఫాయిల్ తయారీ ముఠాల

గుట్టురట్టు

పలుప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

వివరాలు 2వ పేజీలో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
18.11.2026

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు 7 బిలియన్ డాలర్లు

సుస్థిరమైన ఇంధన భద్రతవైపు భారత్ వేస్తున్న అడుగులకు తోడ్పాటు అందించనున్నామని అమెజాన్ వెల్లడించింది. ఇప్పటికే భారత్‌లో ప్రకటించిన 4 బిలియన్ డాలర్ల పెట్టుబడికి ఈ మొత్తం అదనమని పేర్కొంది.ఈ పెట్టుబడుల ప్రణాళికలో భాగంగా అమెజాన్ మొత్తం 934 మెగావాట్ల (ఓచి) సామర్థ్యం కలిగిన నాలుగు కొత్త పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టనుంది. వీటిలో కర్ణాటకలో 234 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు (ఆసియాలో అమెజాన్ అతిపెద్ద ప్రాజెక్టు), కర్ణాటకలోనే 200 మెగావాట్ల సామర్థ్యం గల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టు, మధ్యప్రదేశ్‌లో 300 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు, రాజస్థాన్‌లో 200 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టనుంది. అమెజాన్ ప్రాజెక్టులు పూర్తయితే దాదాపు 35 లక్షల గృహాలకు సరిపడే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని అమెజాన్ ఓ ప్రకటనలో పేర్కొంది. 2040 నాటికి నెట్-జీరో కార్బన్ లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. విద్యుత్ వినియోగం ద్వారా వచ్చే కర్బన ఉద్గారాలను 2030 నాటికి 65 శాతం తగ్గించాలనే కొత్త ప్రపంచ లక్ష్యాన్ని ఈ సందర్భంగా అమెజాన్ ప్రకటించింది.

నకిలీ సిల్వర్ ఫాయిల్ తయారీ ముఠాల గుట్టురట్టు

పలుప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌లో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ సిల్వర్ ఫాయిల్ తయారీ ముఠాల గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. స్వీట్లు, పాన్‌లు, బేకరీ ఉత్పత్తులపై ఆకర్షణీయంగా కనిపించే వెండి పూత వెనుక అసలైన వెండి కాకుండా ప్రమాదకరమైన అల్యూమినియం వాడుతున్నట్లు గుర్తించారు. చార్మినార్, ఫలక్‌నుమా పరిసర ప్రాంతాల్లో ఏకంగా నాలుగు అక్రమ తయారీ కేంద్రాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు.కాజు బర్ఫీ మొదలుకొని చమ్ చమ్, స్వీట్ పాన్, కేకుల వరకు నకిలీ సిల్వర్ ఫాయిల్ వినియోగిస్తున్నట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. ఉత్తరప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాల నుంచి అల్యూమినియం ముడిసరుకు తెప్పించి తెలంగాణవ్యాప్తంగా స్వీట్ షాపులు, బేకరీలు, పాన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో భారీగా నకిలీ ఫాయిల్స్, అల్యూమినియం ఫ్లేక్స్‌తో పాటు తయారీకి ఉపయోగించే యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ దందాపై నాలుగు కేసులు నమోదు చేసినట్లు హైదరాబాద్ సీపీ మహేశ్ భగవత్ వెల్లడించారు. అల్యూమినియం వినియోగం వల్ల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాలు పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్వీట్లు, పాన్ ఉత్పత్తుల కొనుగోలులో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎప్‌స్టీన్‌ది ఆత్మహత్య కాదు హత్యే..

ఫోరెన్సిక్ నిపుణుడి సంచలన ప్రకటన

వాషింగ్టన్(జనంసాక్షి): ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారి ఎప్‌స్టీన్ 2019 ఆగస్టు 10వ తేదీన జైల్లో ఆత్మహత్య చేసుకున్నట్లు అధికారులు అప్పట్లో వెల్లడించారు. అయితే.. అతడిని హత్య చేశారని అమెరికాకు చెందిన ఫోరెన్సిక్ నిపుణుడు ప్రొఫెసర్ మైఖేల్ ఫ్రీమాన్ తాజాగా సంచలన ప్రకటన చేశారు. అతడి మరణంపై వివరాలు సేకరించానని.. అందులో గొంతు నులమడం, మెడకు తాడు బిగించడం వల్ల మరణించినట్లు తేలిందని స్థానిక మీడియా వర్గాలకు వెల్లడించారు. అతడి ఎడమ భుజంలో తీవ్ర రక్తస్రావం, ముఖంపై పలు గాయాలు ఉన్నట్లు తెలిపారు. ప్లాన్ ప్రకారం చేసిన హత్య (ఓబీతీటవతీ)ను కొందరు ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. ఈ విషయంపై దర్యాప్తు చేపట్టాలని అధికారులను కోరారు. ఎప్‌స్టీన్ మరణించి ఏడేళ్లయినా.. ఆత్మహత్యకు సంబంధించి పలు ప్రశ్నలు వినిపిస్తూనే ఉన్నాయి. అతడు ప్రాణాలు కోల్పోవడానికి ముందు సీసీటీవీ ఫుటేజీలో మూడు నిమిషాల పాటు అంతరాయం ఏర్పడడం, సెల్ బయట ఉన్న రెండు కెమెరాలు పనిచేయకపోవడం వంటి కారణాలపై పలువురు అనుమానాలు లేవనెత్తారు. ఫోరెన్సిక్ నిపుణుడి తాజా ప్రకటనతో ఈ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది.ఎప్‌స్టీన్ 2019 ఆగస్టు 10వ తేదీన అనుమానాస్పద స్థితిలో మన్‌హట్టన్ జైల్లో మృతి చెందాడు. జైలు గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని అప్పట్లో అధికారులు ధ్రువీకరించారు.

మోదీ గొప్పనాయకుడు

అవసరమైన సందర్భాల్లో కఠినంగా వ్యవహరిస్తారు:ట్రంప్

మనీలా(జనంసాక్షి):ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. మోదీ గొప్పనాయకుడని, అవసరమైన సందర్భాల్లో కఠినంగా వ్యవహరిస్తారని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఆయన్ను ఎంతగానో గౌరవిస్తారని చెప్పారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరుగుతున్న క్వాడ్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ట్రంప్ ఈ విధంగా క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్, జపాన్ ప్రధాని సనాయే తకాయిచిలు పాల్గొన్నారు. నలుగురు నేతలు గ్రూప్ ఫొటో దిగిన అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. “ఈ కూటమి దేశాలు, ప్రజలతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయి. ముగ్గురు దేశాధినేతలతో సుదీర్ఘకాలంగా నాకు అనుబంధం ఉంది. వాళ్లు మంచి స్నేహితులు. ఇక మోదీ విషయానికొస్తే.. ఆయన గొప్ప వ్యక్తి. అవసరమైతే చాలా కఠినంగా వ్యవహరిస్తారు” అని ట్రంప్ పేర్కొన్నారు. జపాన్ ప్రధాని సనాయే తకాయిచి మరింత కఠినమైన వ్యక్తి అని వ్యాఖ్యానించారు. ఆస్ట్రేలియా ప్రధాని వైపు చూస్తూ.. తామిద్దరం ఫర్వాలేదు అంటూ నవ్వుతూ చెప్పారు.క్వాడ్ దేశాల మధ్య స్నేహ, సహకార సంబంధాలు మరింత బలపడ్డాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఈ స్నేహం కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కూటమిలోని దేశాలు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశాల జాబితాలో ఉన్నాయని అన్నారు. క్వాడ్ కూటమిలో ఆస్ట్రేలియా, భారత్, జపాన్, అమెరికాలు భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.



శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానము, ధర్మపురి పట్టణం-జగిత్యాల జిల్లా

ఆర్.పి.నెం.బి/325/2026 తేది:17-11-2026

టెండర్ ప్రకటన-3

క్ర.సం	అంశము	కాలపరిమితి	సెక్యూరిటీ డిపాజిట్ (ది.డి/ఆన్‌లైన్)	ఈఎండీ డిపాజిట్ (ది.డి/ఆన్‌లైన్)	షెడ్యుల్ ధర (ది.డి. మాత్రమే)
1	దేవాలయ ఆవరణలో భక్తులు సమర్పించిన అన్ని రకముల వస్త్రములు ప్రాగచేసుకొని అమ్ముకోను లైసెన్సు హక్కు	18.01.2027 నుండి 17.01.2029 వరకు రెండు(02) సం॥ములు	5,00,000/-	50,000/-	1000/-

పైన పేర్కొన్న అంశముకు ఆసక్తి & అర్హత గల వారు https://tender.telangana.gov.inను సందర్శించగలరు. 2)ఆన్‌లైన్ టెండర్ దాఖలు చేయువారు తేది: 18.11.2026 ఉదయం 10.30 నుండి తేది: 27.11.2026 మ॥ 12.00 వరకు ఆన్‌లైన్ నందు టెండర్ దాఖలు చేయవచ్చును.3) సీల్డు కొటేషన్ టెండర్ దాఖలు చేయువారు. తేది:18.11.2026 ఉదయం 11.30 నుండి తేది: 27.11.2026 ఉ॥ 11.30 వరకు సీల్డు కొటేషన్ పొంది అదే రోజున మ॥12.30 గంటలకు సీల్డు కొటేషన్ బాక్స్ నందు టెండర్ దాఖలు చేయవచ్చును.4)తేది:27.11.2026 మ॥12.30గంటలకు ఆన్‌లైన్ టెండర్ టెక్నికల్ బిడ్ ఓపెన్‌చేసి అదేరోజున మ॥ 1.00 గం॥లకు ప్రైజ్‌బిడ్ ఓపెన్ చేయబడును. 5)పైన తెల్పిన అంశముకు తేది:27.11.2026న మ॥2.00గం॥లకు బహిరం గవేలంపాట నిర్వహించబడును. 6)మిగతా పూర్తి వివరములకు కార్యాలయపని వేళలలో 9849259289 నెంబరులో సంప్రదించగలరు.

సం/-కార్యనిర్వహణాధికారి

సమ్మక్క సాగర్ ఎన్ఓసీకి ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూలం

ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం

సమ్మక్క సాగర్ ప్రాజెక్టును మొదట కాంతనపల్లి వద్ద ప్రతిపాదించినప్పుడు ఆ ప్రాంతంలో 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. భద్రతా మౌలిక సదుపాయాలతో పాటు 17 ఆదివాసీ గ్రామాలపై ప్రభావం పడుతుందని గుర్తించడంతో ముంపును తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం పూర్తి స్థాయి నీటి మట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురి కానుంది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం వంద ఎకరాలకు మించదు. ఐఐటీ ఖరగ్‌పూర్ తన నివేదికను జులై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ.9 కోట్ల 88లక్షలను తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే చెల్లించింది. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. పూర్తి స్థాయి నీటి మట్టం వద్ద దీని నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు. కరవు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వినియోగించుకుని ఎస్సారెస్పీ రెండో దశ కింద సుమారు నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రామప్ప-పాకాల లింక్ కెనాల్ ద్వారా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక రూపొందించారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్ఓసీ పొందితే సమ్మక్క సాగర్ నుంచి అనేక ప్రయోజనాలు పొందవచ్చని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.

చేసేందుకు హామి ఇచ్చినట్లు తెలంగాణ సీఎంవో తెలిపింది. ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రిని కలిసిన బృందంలో రేవంత్ రెడ్డితో పాటు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు ఉన్నారు. గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావాలంటే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్ఓసీ కీలకంగా మారింది. ప్రాజెక్టులో నీటిని పూర్తి స్థాయిలో నిల్వ చేసినప్పుడు బ్యాక్ వాటర్ కారణంగా ఛత్తీస్ గఢ్ పరిధిలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలున్నాయన్నది ఆ రాష్ట్ర అభ్యంతరం. గతంలోనూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కలిసి ప్రాజెక్టు వివరాలను వివరించి ఎన్ఓసీ కోరారు.

కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా

ఇంది రమ్మ బీమా పథకం అమలు కావాలని, దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బీమా పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల జీవిత బీమా అందనుంది. ఈ బీమా వల్ల ఉపాధి హామీ కూలీలతో పాటు లక్షలాది మంది పేదలు లబ్ధి పొందుతారని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఇప్పటికే అమలవుతున్న వివిధ రకాల బీమా పథకాల్లో జీవిత బీమా కింద రెండు లక్షలు, ప్రమాద బీమా కింద పది లక్షల రూపాయల వరకు అందిస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ శాఖల్లో అమలవుతున్న అన్ని బీమా పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, వారికి లభిస్తున్న ప్రమాద బీమాను యథాతథంగా అందేలా చూడాలన్నారు. కొన్ని శాఖల్లో ప్రస్తుతం ఉన్న రెండు లక్షల రూపాయల జీవిత బీమాను ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకువచ్చి ఐదు లక్షల రూపాయలకు పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి బీమా భద్రత అందుకుంటున్న వారిలో ఏ ఒక్కరినీ కూడా తప్పించడానికి వీల్లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు.మరోవైపు సిద్ధిపేట బహిరంగ సభలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందాలని సీఎం ఆదేశించారు. చీరలను తక్షణమే అన్ని జిల్లాలకు తరలించాలని సీఎం సూచించారు. ఇందిరమ్మ బీమా, ఇందిరమ్మ చీరల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఇందిరమ్మ చీరల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.ఇందిరమ్మ బీమా పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బీమా దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.సమీక్ష సమావేశంలో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీఎంవో కార్యదర్శి మానిక్ రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

గర్ల్‌ఫ్రెండ్‌తో రాహుల్‌గాంధీ డేట్..

ఆసక్తికర విషయాలు వెల్లడించి కాంగ్రెస్ అగ్రనేత

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తన తల్లిదండ్రులు సోనియాగాంధీ, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ తొలిసారి కలుసుకున్న కేంబ్రిడ్జ్‌లోని ఓ రెస్టారెంట్‌కు గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి వెళ్లినట్లు చెప్పారు. అయితే అక్కడి ఆహారం మాత్రం తనను తీవ్రంగా నిరాశపరిచిందని సరదాగా వ్యాఖ్యానించారు. సోమవారం దిల్లీలో సోనియాగాంధీ ఆత్మకథ “బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్” అధికారిక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రాహుల్ ఈ విషయాలు పంచుకున్నారు. “చాలా సంవత్సరాల తర్వాత నేను కేంబ్రిడ్జ్‌కు వెళ్లాను. అప్పుడు నా గర్ల్‌ఫ్రెండ్‌తో ‘మనమిద్దరం వర్సిటీ రెస్టారెంట్‌కు వెళ్దాం’ అని చెప్పాను. అక్కడికి ఎందుకు తీసుకెళ్తున్నానో ఆమెకు తెలియదు. నా తల్లిదండ్రులు ఎక్కడ కలుసుకున్నారో చూడాలనేది నా ఉద్దేశం. లోపలికి వెళ్లిన తర్వాత నా తల్లిదండ్రులు (నానీనితిజీ ఉజీనిటష్టతి) ఈ రెస్టారెంట్‌లోనే కలుసుకున్నారని అక్కడి వ్యక్తికి చెప్పాను. వెంటనే అతను ‘ఓహ్.. వాళ్లా! నాకు తెలుసు’ అన్నాడు” అని రాహుల్ వెల్లడించారు.“మీరు ప్రేమలో పడాలనుకుంటే మాత్రం వర్సిటీ రెస్టారెంట్‌కు వెళ్లండి. కానీ అక్కడి చికెన్ వంటకం మాత్రం ఎప్పుడూ తినకండి. మా తల్లిదండ్రులకు అక్కడి ఆహారం అద్భుతంగా అనిపించింది. చాలా బాగుందని వారు గుర్తు చేసుకున్నారు. కానీ నాకు మాత్రం అక్కడి భోజనం అస్సలు నచ్చలేదు” అని నవ్వులు పూయించారు. కార్యక్రమం అనంతరం విలేకరులు రాహుల్.. మీ ప్రియురాలు ఎక్కడున్నారని ప్రశ్నించగా.. “ఆమె నా స్నేహితురాలు” అని సమాధానమిచ్చారు.సోనియాగాంధీ ఆత్మకథ విడుదలై వారం కూడా గడవకముందే 2 లక్షలకుపైగా కాపీలు అమ్ముడుపోయాయని ప్రచురణ సంస్థ హార్పర్‌కాలిన్స్ భారత శాఖ సీఈఓ అనంత్ పద్మనాభన్ వెల్లడించారు. ఈ పుస్తకం స్వతంత్ర భారతంలో విడుదలైన అతి పెద్ద ఆత్మకథగా ఖ్యాతి గడించిందన్నారు. ఇక పుస్తకాన్ని కొన్నవాళ్లు.. ఆర్డర్ చేసిన పుస్తకం ఎదురుచూస్తున్నవారు, పుస్తకం చదివినప్పటికీ ఆ విషయాన్ని బయటకు చెప్పనివాళ్లు.. అంటూ పద్మనాభన్ చమత్కరించారు. ఆయన వ్యాఖ్యలతో సభలో పెద్ద ఎత్తున నవ్వులు, చప్పట్లు వినిపించాయి. ముందు వరుసలో కూర్చున్న సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సైతం నవ్వుకున్నారు.

రాష్ట్రం కరువులో ఉంటే మూసీ సుందరీకరణ ఎందుకు ?

వెయ్యి ఎకరాలు అని చెబుతూ వచ్చారు.. చివరకు 67 ఎకరాలు మాత్రమే అని సీఎం అంగీకరించారు. తెలంగాణకు ప్రథమ విలన్, శత్రువు కాంగ్రెస్ పార్టీయే” అని కేటీఆర్ విమర్శించారు.సోనియాగాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... “సోనియాగాంధీ ఆత్మలో తెలంగాణ లేదు.. గుండెల్లోనూ లేదు. తెలంగాణ రాష్ట్రం సోనియాగాంధీ భిక్ష కాదు.. ప్రజల పోరాటం ఫలితం. ఉద్యమ ఉప్పెనలో కొట్టుకుపోతామన్న భయంతోనే తెలంగాణ ఇచ్చారు. తెలంగాణ ఆకాంక్షలను కాంగ్రెస్ ఎప్పుడూ రాజకీయ కోణంలోనే చూసింది. ఉద్యమ చరిత్రను కాంగ్రెస్ ఎప్పటికీ చెరిపివేయలేదు.

కాంగ్రెస్ నయవంచనకు మూడేళ్లు పూర్తయింది

చట్టబద్ధత ఎందుకు కల్పించలేదు? మ్యానిఫెస్టో పేరుతో మాయమాటలు చెప్పి.. అధికారంలోకి వచ్చాక హామీల అమలును గాలికొదిలేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క హామీకి తూట్లు పొడిచారు. కాంగ్రెస్ నయవంచనను తెలంగాణ ప్రజలు ఇప్పటికే గుర్తించారు. ఇక మిగిలింది తగిన గుణపాఠం చెప్పడమే” అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

వాషింగ్టన్‌పై డర్టీబాంబ్..

సారథ్యం వహిస్తున్న మంత్రి స్కాట్ బెసెంట్ నివాసాన్ని సీక్రెట్ సర్వీస్ సిబ్బంది గత వారం మిలిటరీ స్థావరానికి మార్చారు.
ఇరాన్‌కు ఈ దాడి తేలికా..?
డర్టీ బాంబు తయారీకి వాడే రేడియో యాక్టివ్ మెటీరియల్‌ను తరలించడం చాలా తేలిక. దీనికోసం శిక్షణ పొందిన ఆపరేటివ్‌లను అమెరికాలోకి కొత్తగా పంపాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఆ దేశంలో ఉంటున్న ఇరానీయులను ఈ కుట్రలోకి లాగితే చాలు. ఇక బాంబు తయారీకి అవసరమైన సామగ్రి కూడా అమెరికాలోకి చేరి ఉండొచ్చని కొన్ని చాటింగ్‌ల ద్వారా ఇంటెలిజెన్స్ వర్గాలు అంచనాకు వచ్చాయి.

అక్వాన్ దూసుకోస్తోంది

‘అక్వాన్’.. ఇవాళ రాత్రికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ తెలిపారు. పశ్చిమ-వాయవ్య దిశలో ప్రయాణిస్తూ ఎల్లుండి ఉదయానికి అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందన్నారు.శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు – విశాఖ మధ్య తీరం దాటే అవకాశముందని పేర్కొన్నారు. తపాను ప్రభావంతో కోస్తా జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

హసీనా రాక వేళ.. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు ఉద్రిక్తం

ఢాకా ఎయిర్‌పోర్టు సమీపంలో పేలుళ్లు

ఢాకా(జనంసాక్షి):మాజీ ప్రధాని షేక్ హసీనా వచ్చే నెలలో స్వదేశానికి తిరిగి వెళ్లనున్న నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయి. మరోసారి హింస చెలరేగే ప్రమాదం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో దేశవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ తరుణంలో తాజాగా ఢాకా అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో రెండు చోట్ల నాటు బాంబు పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో ముగ్గురు పాదచారులు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. అయితే, ఈ పేలుళ్లకు, హసీనా రాకకు సంబంధ ముందా? అనే విషయంపై స్పష్టత రాలేదు.ఆగస్టు 2024 నుంచి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా.. డిసెంబర్‌లో స్వదేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని హసీనా ప్రకటించినప్పటి నుంచి బంగ్లాలో ఆమె మద్దతుదారులు, వ్యతిరేకుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. బ్యాంకులు, బస్సులు తగలబెట్టడం సహా అనేక హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. గడిచిన కొన్ని వారాల్లోనే 50 నాటు బాంబు పేలుళ్ల ఘటనలు నమోదైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. వీటన్నింటికీ అవామీ లీగ్ ఆ పార్టీ అనుబంధ సంస్థలే కారణమని పోలీసులు ఆరోపిస్తున్నారు. తాజా పరిణామాలతో అప్రమత్తమైన ఢాకా పోలీసులు విధ్వంసక చర్యలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆ పార్టీకి కంచుకోటలుగా భావించే ఢాకా, గోపాల్‌గంజ్‌తోపాటు తదితర జిల్లాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. డిసెంబర్ మొత్తం అదనపు బలగాలను మోహరించాలని నిర్ణయించారు.బంగ్లాదేశ్ ప్రవాసులు తూర్పు లండన్‌లోని రామ్‌ఫోర్డ్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో హసీనా ప్రభుత్వం కుప్పకూలడంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి నేత నహీద్ ఇస్లాం పాల్గొన్నారు. ప్రస్తుతం ఆయన నేషనల్ సిటిజన్ పార్టీ చీఫ్‌గా ఉన్నారు. ఈ పర్యటనను వ్యతిరేకించిన హసీనా మద్దతుదారులు.. సమావేశ ప్రాంగణం బయట నిరసన చేపట్టారు. అక్కడకి వచ్చిన అతిథులపై గుడ్లు, నీళ్ల బాటిళ్లు విసిరినట్లు సమాచారం. దీంతో ఇరు పక్షాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు తెలిసింది.

కర్రెగుట్టల్లో మావోయిస్టుల భారీ డంప్ గుర్తింపు

చర్ల(జనంసాక్షి):

ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో మావోయిస్టులకు సంబంధించిన భారీ డంప్ లభ్యమైంది. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ వద్ద కర్రెగుట్టల్లో తెలంగాణ పోలీసులు దీనిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల నుంచి గ్రేహౌండ్స్ బలగాలతో పోలీసులు అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. స్వాధీనం చేసుకున్న డంప్‌లో 300కు పైగా బ్యారెల్ గ్రనేడ్ లాంచర్లు (బీజీఎల్) ఉన్నాయి. చర్ల పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడారు. తెలంగాణ పోలీసులు ఇంత పెద్ద ఎత్తున బీజీఎల్స్ స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారన్నారు. మీడియా సమావేశంలో డీఎస్పీ అరుణ్‌కుమార్, సీఐ రాజువర్మ, సీఆర్పీఎఫ్ 141 ఏసీ విక్రమ్ రంజన్, ఎస్సై నర్సిరెడ్డి పాల్గొన్నారు.

భారత్, ఆసియాన్ దేశాలు కలిసి పనిచేయాలి

దాదా పు నాలుగో వంతు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని మోదీ గుర్తుచేశారు. ఇంతటి ప్రజాబలం ఉన్న ప్రాంతానికి ప్రపంచంలో ప్రత్యేక స్థానం ఉం దన్నారు. ఆ ప్రాంతాన్ని శాంతి, స్థిరత్వానికి నిల యంగా మార్చే సామర్థ్యం భారత్, ఆసియాన్ దేశాలకు ఉందని చెప్పారు. ఇందుకు అవస రమైన సంకల్పం కూడా ఉభయ పక్షాలకు ఉం దని పేర్కొన్నారు.ఈ ఏడాది ఆసియాన్ సదస్సు థీమ్ 'నావిగేటింగ్ అవర్ ఫ్యూచర్ టుగెదర్' (మన భవిష్యత్తును కలిసి నిర్మించుకోవడం) ఎంతో ప్రాధాన్యం కలిగినదని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటున్న సమయంలో ఆ థీమ్ మరింత అవసరమని చెప్పారు. దేశాల మధ్య పరస్పర నమ్మకం, సహకారం పెరిగితేనే భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోగలమని ఆయన అభిప్రాయపడ్డారు.

యాక్ట్ ఈస్ట్ పాలసీతో కొత్త ఊపు

భారత్, ఆసియాన్ దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో యాక్ట్ ఈస్ట్ పాలసీ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని తెలిపారు. గత కొన్నేళ్లుగా ఆ విధానం వల్ల ఇరు పక్షాల మధ్య సంబంధాలకు కొత్త ఊపు వచ్చిందన్నారు. గతంలో ఉమ్మడి సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వానికి మాత్రమే పరిమితమైన భాగస్వామ్యం ఇప్పుడు అనేక కొత్త రంగాలకు విస్తరించిందని వివరించారు. డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, అంతరిక్ష రంగాల్లో కూడా భారత్, ఆసియాన్ దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. మారుతున్న ప్రప

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

420 హామీలు, ఆరు గ్యారంటీల అమలులో

కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

- కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రతుల బుట్టదాఖలు



వనపర్తి బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు, వివిధ డిక్లరేషన్లలో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపిస్తూ మేనిఫెస్టో ప్రతులను బుట్టదాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ ద్వారా రైతులకు భరోసా కల్పించామని, రైతుబంధు కింద 11 విడతల్లో రూ. 72,815 కోట్లు అందించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు నిధులను సకాలంలో విడుదల చేయకుండా, సాగునీరు, విద్యుత్ అందించడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో పురోగతి లేదని, భూభారతి విధానంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లకు నిధులు సరిపోవడం లేదని, ఆసరా పింఛన్ల పెంపు హామీ కూడా అమలు కాలేదన్నారు. విచారణ కమిటీలు, అధ్యయనాల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. అశోక్‌నగర్, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లి నిరుద్యోగుల సమస్యలు తెలుసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోని కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, జగదీశ్వర్ రెడ్డి, నందిమల్ల అశోక్, కరుణశ్రీ, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ ఉత్తర్వుల పంపిణీలో తీవ్ర ఉద్రిక్తత

కాంగ్రెస్ నాయకులను గంజాయి బ్యాచ్‌తో పోల్చిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- ఎమ్మెల్యే వ్యాఖ్యలపై బగ్గుమన్న కాంగ్రెస్ నాయకులు
- కాంగ్రెస్- బీఆర్ఎస్ నేతల మధ్య తోపులాట
- చేర్యాలలో పోలీసుల లాఠీ జార్జ్
- పత్రాలు తీసుకోకుండానే వెనుతిరిగిన పింఛన్ లబ్ధిదారులు
- కొత్త పింఛన్లు ఇవ్వకుండా మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది : భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి





చేర్యాల నవంబర్ 17 (జనంసాక్షి) : చేర్యాల పట్టణంలోని రేణుక గార్డెన్ లో మంగళవారం నిర్వహించిన పెన్షన్ ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కాంగ్రెస్ - బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చెలరేగి ఘర్షణకు దారితీయడంతో పరిస్థితి అదుపు తప్పింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి లు హాజరయ్యారు. కార్యక్రమం కొనసాగుతుండగా ఇరు పార్టీల నాయకులు మా నాయకుడు గొప్ప అని పోటా పోటీగా నినాదాలు చేయడంతో తీవ్ర తోపులాటకు దారితీసింది. దీంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చేర్యాల పోలీసులు రంగంలోకి దిగి ఇరు వర్గాలను సముదాయిస్తున్న క్రమంలో ఎవరూ వినకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో ఇరు పార్టీల నాయకులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘర్షణతో కొంతసేపు కార్యక్రమ ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కాలయాపన చేసింది తప్ప ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అర్హులను గుర్తించి నూతన పింఛన్లు మంజూరు చేస్తుంటే ఓర్వలేక విమర్శ చేయడం సిగ్గుచేటు అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలోనే అర్హులందరికీ అనుకున్న విధంగా సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతుండగా కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అసహనంతో పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు గంజాయి బ్యాచ్ అని తీవ్రమైన వ్యాఖ్యలు చేయడంతో ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు ఒక్కసారిగా మూగుమ్మడిగా సభా ప్రాంగణానికి చేరుకొని ఎమ్మెల్యే పల్లా క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేశారు. అనంతరం మార్కెట్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి కార్యకర్తలను అదుపు చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పల్లా ప్రజా సంక్షేమం గురించి ఆలోచించాలి తప్ప రాజకీయ పార్టీల మధ్య వైరుధ్యాలు తీసుకువస్తూ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పింఛన్ లబ్ధిదారులు కొందరు పత్రాలు తీసుకోకుండానే వెనుతిరిగి వెళ్లారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, కచ్చితంగా జరగాలి

- ఎస్ఐఆర్ రోల్ అబ్జర్వర్ హరిచందన



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 17 (జనంసాక్షి): అర్హత కలిగిన ప్రతి ఓటరు తుది జాబితాలో ఉండే విధంగా, ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్.ఐ.ఆర్ రోల్ అబ్జర్వర్ హరిచందన సంబధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్‌కు విచ్చేసిన రోల్ అబ్జర్వర్ హరిచందన, స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ తీరుతెన్నులను, అభ్యంతరాల వివరాలను బూత్ లెవల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. ఫామ్ 6, 7, 8 కొత్త దరఖాస్తులను సక్రమంగా పరిష్కరించారా లేదా అని ఆరా తీశారు. విచారణలు నిర్వహించిన తీరును, ఇంటింటి సర్వే పర్యవేక్షణ వివరాలను పరిశీలించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సేకరించిన వివరాలను, ఫీల్డ్ వెరిఫికేషన్ నివేదికలను సమీక్షించారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన లేదా రెండు చోట్ల ఓటు ఉన్న వారి పేర్లను జాబితా నుండి తొలగించేటప్పుడు నిబంధనలను కచ్చితంగా పాటించారా లేదా అని ఇఆర్ఓ/ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ని అడిగి వివరాలు సేకరించారు. సూపర్-చెకింగ్ లో భాగంగా ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు ఆమోదించిన మరియు తిరస్కరించిన దరఖాస్తులను (కొత్త ఓటర్ల చేర్పులు, తొలగింపులు, మార్పులు) రోల్ అబ్జర్వర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, ఎస్.ఐ.ఆర్ లో భాగంగా మొదటి విడతలో మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన మరియు రెండు చోట్ల ఓటు ఉన్న 51,073 మంది పేర్లు జాబితాలో ఉన్నాయని తెలిపారు. రెండో విడత నోటీసుల ప్రక్రియలో భాగంగా 962 మందిని అనర్హులుగా గుర్తించినట్లు వివరించారు. ఫామ్ 6, 7, 8 లకు సంబంధించి 5005 పెండింగ్ లో కలవని వాటిని త్వరగా ఎంక్వయిరీ చేయగలరని మరియు నోటీసుల పరిశీలన పూర్తి అయ్యిందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి విచారణకు బూత్ లెవల్ ఏజెంట్లు కూడా హాజరయ్యారని, ప్రతి బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఇప్పటి కప్పుడు పూర్తి సమాచారం మరియు జాబితాను అందిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని జాబితాలను , తహసీల్దార్ కార్యాలయాలతో పాటు జిల్లా వెబ్‌సైట్‌లో కూడా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్ అదనపు కలెక్టర్ లోకల్ (స్థానిక సంస్థలు) వైవి గణేష్ వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ ఖిలా వరంగల్లు తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



రామకృష్ణాపూర్, నవంబర్17 (జనంసాక్షి): రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ గద్దరాగడి ఎన్విఆర్ గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల లబ్ధిదారులను గుర్తించి చేయూత పెన్షన్లను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతులు, దివ్యాంగులు, గీతా కార్మికులు, చేనేత కార్మికులకు ఈ పెన్షన్లు ఆత్మ గౌరవాన్ని ఆత్మస్థైర్యాన్ని పెంచుతా యన్నారు. ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు కొన్నిచోట్ల గృహప్రవేశాలు చేయడం శుభ పరిణామం అన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో రెండవ విడతలో భాగంగా రెండు వేల మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో 800 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతు న్నాయని తెలిపారు. సీసీ రోడ్లు డ్రైనేజీలు విద్యుత్ దీపాలు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. త్రాగునీరు ఎద్దడి లేకుండా అమృత్ పథకం ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. చెన్నూరులో 100 పడకల ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధంగా ఉందని అలాగే మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే మందమర్రిలో ఆరు ఎకరాల స్థలంలో 600 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. గోదావరి పుష్కర ఘాట్ నిర్మాణానికి 70 కోట్లు నిధులు మంజూరు చేశామని అలాగే బొక్కల గుట్ట పులిమడుగు సంద్రోన్వల్లి అందుగులపేట గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పెన్షన్లను మంజూరు చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ డా.గౌడిసెల సంధ్యారాణి-రాజారమేష్, వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత-శ్రీనివాస్, కమిషనర్ మురళీకృష్ణ, పుర కౌన్సిలర్లు, మందమర్రి మండలంలోని గ్రామ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు మండలానికి మహర్దశ..!!

- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
- రూ.100 కోట్లతో రహదారులు,హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణం
- తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరుకు కృషి
- గూడూరులో 1.2 కి.మీ. ఫోర్ లైన్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్
- రాజ్యసభ సభ్యులు, వేం నరేందర్ రెడ్డి వెల్లడి



గూడూరు, నవంబర్17 (జనంసాక్షి): ఏజెన్సీ మండలమైన గూడూరు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్య తనిస్తోందని, దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతానికి మహర్దశ తీసుకొచ్చేలా భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాజ్యసభ సభ్యులు, వేం నరేందర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో స్థానిక ఎమ్మెల్యే డా.మురళీ నాయక్,ఎంపీ పోరిక బలరాం నాయక్ తో కలసి 100కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం గూడూరు మెజార్ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ అధ్యక్ష తన సమావేశం జరిగినది. ఈసమావేశానికి ముఖ్య అతిధిగా రాజ్యసభ సభ్యులు, వేం నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, రవాణా,మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపిట వేస్తూ కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు,రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో గూడూరు మండలంలోని ఎర్రకుంట తండా గ్రామంలో సుమారు 25 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి రూ.200 కోట్లతో పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు.ఈ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు ఇతర విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించనున్నట్లు పేర్కొన్నారు. సుమారు మూడు వేల మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులతో కూడిన రెసిడెన్షియల్ విద్య అందుబాటులోకి రానుందని, వచ్చే జూన్ నాటికి విద్యార్థులను కొత్త పాఠశాలకు తరలించేలా పనులు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. గూడూరు నుంచి నెక్కొండకు వెళ్లే రహదారిపై పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని రహదారిని విస్తరించి ఎందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. గూడూరు మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం ఎంతో అవసరమని స్థానిక ప్రజాప్రతినిధులు కోరిన నేపథ్యంలో ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి నెల రోజుల్లో అధికారులతో మాట్లాడి అనుమతులు తీసుకొచ్చి బస్టాండ్ సెంటర్ లోని కాంప్లెక్స్ నిర్మాణానికి,బస్టాండ్‌తో పాటు షాపింగ్ కాంప్లెక్స్, ఇతర మౌలిక సదుపాయాలు కూడా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. మురళీ నాయక్,ఎంపీ బలరాం నాయక్,మహిళ కమిషన్ మెంబర్ సునావత్ రాధ, జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్ చందర్ రెడ్డి, నెక్కొండ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి స్వామి,సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి,సొసైటీ వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్ రెడ్డి మండల అధ్యక్షులు దారవత్ బాలాజీ నాయక్,జిల్లా కార్యదర్శి వాంకు డోత్ కొమ్మాలు, ఉప సర్పంచ్ చంటి స్వామి, మండల వర్కింగ్ ప్రసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి,చిట్టే వెంకన్న, వివిధ గ్రామ సర్పంచ్ లు, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అంజన్న నిజరూప దర్శనానికి ఉపముఖ్యమంత్రికి ఆహ్వానం



మల్యాల నవంబర్ 17 (జనంసాక్షి) : తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామం లోని కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో 60 సంవత్సరాల అనంతరం నిర్వహిస్తున్న చందనోత్సవ మహా సంప్రోక్షణ కార్యక్రమానికి విచ్చేసి,శ్రీ స్వామివారి నిజరూప దర్శనం చేసుకోవలసిందిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ను మంగళవారం ఎమ్మెల్యే మరియు దేవాదాయ శాఖ అధికారులు అర్చకులు క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్,దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, దేవాదాయ శాఖ, ధార్మిక అడ్వైజర్ గోవింద హరి,ఆలయ ఈవో ఎస్. అంజనా రెడ్డి,పర్యవేక్షకులు సునీల్ కుమార్, వేదపారాయణదారులు, అర్చకులు ఉన్నారు.

విద్యా, ఉపాధి హక్కుల సాధన కోసం

యువతరం ఉద్యమించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల నరసింహ పిలుపు
- ఏఐవైఎఫ్ జోగులాంబ గద్వాల జిల్లా రెండో మహాసభలు!



జోగులాంబ గద్వాల (జనంసాక్షి) : విద్యా, ఉపాధి హక్కుల సాధన కోసం యువతరం ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల నరసింహ పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జోగులాంబ గద్వాల జిల్లా రెండో మహాసభలు గద్వాల పట్టణంలోని నల్లగుంట వాల్మీకి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మహాసభలకు ముందు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల నరసింహ యువజన సమాఖ్య జెండాను ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. అనంతరం జరిగిన మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎం. బాల నరసింహ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. నేటి సమాజంలో యువత అనేక సమస్యలను ఎదుర్కొంటు న్నారని, ముఖ్యంగా నిరుద్యోగం, నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడం, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడం వంటి సమస్యలు యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వస్తున్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. యువతలో ప్రశ్నించే తత్వం, సామాజిక బాధ్యత, ప్రజాస్వామిక విలువలు పెంపొం దించాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు దేశంలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లో యువత కీలక పాత్ర పోషించిందని, అదే స్ఫూర్తితో నేటి యువత విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు.


దేశం దాటినా తగ్గని మానవత్వం

- చిన్నారి అభినవ్‌కు అండగా ప్రణీత్ చిన్న



మంథని, నవంబర్ 17 (జనంసాక్షి) : మానవత్వానికి నిలువు టద్దంగా నిలిచిన వరంగల్‌కు చెందిన ప్రణీత్ చిన్న.. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం పరిధిలోని జీడి నగర్ గ్రామానికి చెందిన నిరుపేద లారీ డ్రైవర్ దంపతుల నాలుగేళ్ల చిన్నారి అభినవ్ వైద్య చికిత్స కోసం ప్రణీత్ చిన్న రూ.50,000 ఆర్థిక సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్నప్పటికీ, తన ఇంజనీరింగ్ మిత్రుడు జీడి నగర్ చెందిన సూర అంజి విన్నపం మేరకు ఆపదలో ఉన్న చిన్నారికి అండగా నిలిచి తన గొప్ప మనసును చాటుకోవడం అభినందనీయం. సేవ చేయడానికి ప్రాంతాలు, దేశాలు అడ్డుకావని నిరూపిస్తూ చిన్నారి కుటుంబానికి అండగా నిలిచిన ప్రణీత్ చిన్న కి జీడి నగర్ వాసుల ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. చిన్నారి అభినవ్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ప్రముఖులకు ఆహ్వానం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 (జనంసాక్షి): అంకాపూర్ గ్రామంలో డిసెంబర్ 25, 26, 27 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా కబడ్డీ అసోసియేషన్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానాలు అందించారు.ఈ సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, అంకాపూర్ సర్పంచ్ దేవేందర్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మార చంద్ర మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ తుకారాం, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గడ్డం రాజన్న, కార్యదర్శి మంగళారం బాజన్నతో పాటు వీడీసీ సభ్యులను కలిసి పోటీలకు ఆహ్వానించారు. అంకాపూర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తమవంతు సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రముఖులందరూ హామీ ఇచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. గంగాధర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో కబడ్డీ సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్, టోర్నమెంట్ కన్వీనర్, ప్రముఖ వక్త డాక్టర్ కోకిల నాగరాజు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. రాజేందర్‌తో పాటు కబడ్డీ క్రీడాకారులు మంథని శ్రీనివాస్ రెడ్డి, గోపిరెడ్డి నాగరాజు, పత్తేపూర్ భూమారెడ్డి, పడకల్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
18 నవంబర్ 2026

ఇథనాల్ పేరుతో ప్రశ్నలను అవమానించడం సమాధానం కాదు

ఇథనాల్ కలిపిన పెట్రోలుపై ప్రశ్నలు లేవనెత్తుతున్న వారిని "సైన్స్ తెలియని మూర్ఖులు" అంటూ కేంద్ర మంత్రి సురేశ్ గోపీ కొట్టిపారేయడం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదు. నిర్దేశిత 20 శాతం పరిమితిని మించి కలుపుతున్నారనే ఆరోపణలకు కావలసింది గణాంకాలు, పారదర్శకమైన తనిఖీలతో కూడిన వివరణ. వాహనాల కాలుష్యం తగ్గించడానికి ఇథనాల్ కలపడం ఒక్కటే మార్గమని ఆయన చెప్పారు. ఏఆర్ఏఐ ఆమోదంతో ఈ10 నుంచి ఈ20కి మారామని, ఇప్పటివరకు బీమా క్లెయిమ్‌లు రాలేదని వాదించారు. కానీ క్లెయిమ్‌లు రాకపోవడం వాహనాలకు నష్టం జరగలేదనడానికి రుజువు కాదు. వినియోగదారులకు ఈ విషయంలో సరైన అవగాహన, ఎంపిక చేసుకునే అవకాశం లేకపోవడమూ ఒక కారణం కావచ్చు.

ఈ పథకం మొదలైనప్పుడు ఇథనాల్ కలిపిన పెట్రోలు చౌకగా, లీటరుకు రూ.20కే వస్తుందని చెప్పారు. కేంద్ర మంత్రి గడ్కరీ చెప్పిన ఆ మాటలు సోషల్ మీడియాలో ఇప్పటికీ చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. కానీ ఇప్పుడు ధరలు ఎందుకు పెరిగాయో ప్రభుత్వం చెప్పడం లేదు. దేశంలో చక్కెర ఉత్పత్తి సరిపోతుందనుకున్న చోట, తొలిసారి చక్కెరను దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి వచ్చింది. చెరకు, ధాన్యం ఇథనాల్ తయారీకి మళ్లుతుండటం ఆహార భద్రతపై, ధరలపై ప్రభావం చూపుతోందా అనే సందేహం సహజమే. దానికి జవాబు చెప్పాల్సిన బాధ్యత పాలకులదే.

వాహనాల నుంచి వచ్చే కాలుష్యం తగ్గుతుందన్న వాదనలో కొంత నిజం ఉండవచ్చు. కానీ ఇథనాల్ తయారీ ప్రక్రియ నుంచి వెలువడే ప్రమాదకర వ్యర్థాల సంగతేమిటి? డిస్టిలరీల నుంచి వచ్చే కలుషిత జలాలు నదులను, భూగర్భ జలాలను పాడుచేస్తున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. గాలిలోకి విడుదలయ్యే వాయువులు, భూమిలో కలిసే వ్యర్థాలు కలిసి జల, వాయు, భూ కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఒకచోట కాలుష్యం తగ్గించి మరోచోట పెంచితే అది పర్యావరణ పరిష్కారం కాదు, కేవలం కాలుష్యాన్ని చోటు మార్చడమే.

ఈ పరిశ్రమల చుట్టూ రైతులు, గ్రామీణ ప్రజలు చేస్తున్న ఆందోళనలనూ ప్రభుత్వం విస్మరించలేదు. తమ భూములు, నీరు, గాలి కలుషితమవుతున్నాయని వారు చేస్తున్న నిరసనలపై కూడా మంత్రులు మాట్లాడాలి. అభివృద్ధి పేరుతో ఇబ్బంది పడేవారి గొంతు వినకుండా, ప్రశ్నించేవారిని అజ్ఞానులుగా చిత్రించడం సరికాదు. అంతేకాదు, ఈ ఇథనాల్ కంపెనీలు ఎవరి గుప్పెట్లో ఉన్నాయో, లాభాలు ఎవరి ఖాతాల్లోకి వెళు_న్నాయో జనానికి తెలుసు. ఆ విషయంలో స్పష్టత ఇవ్వకుండా ప్రశ్నించేవారిని తప్పుపడితే ప్రజల అనుమానాలు మరింత బలపడతాయి.

శాస్త్రీయ పరిశోధనల ఫలితాలను పూర్తిగా ప్రజల ముందు ఉంచాలి. ధరల పెరుగుదలకు కారణాలు చెప్పాలి. ఇథనాల్ ఉత్పత్తి కంపెనీల యాజమాన్యం, వాటికి దక్కుతున్న ప్రయోజనాలపై వివరాలు బహిరంగపరచాలి. తయారీ కాలుష్యంపై స్వతంత్ర అధ్యయనం చేయించాలి. బాధిత రైతులతో చర్చించాలి. అప్పుడే ఇథనాల్ విధానంపై ప్రజల విశ్వాసం నిలుస్తుంది. ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా అవమానాలతో సరిపెడితే అనుమానాలు పెరుగుతాయే తప్ప తగ్గవు.

ప్రస్తుత గ్రంథాలయాలలో అల్గోరిథమిక్‌పై అవగాహన(ఏఐ) ప్రాధాన్యత



సంప్రదాయక గ్రంథాలయాలు ప్రజల విజ్ఞానాన్ని పెంచి పోషించటంలో ప్రముఖ పాత్రను పోషిస్తున్న విషయం అందరికి తెలిసిందే.అయితే అత్యంత వేగంగా మారిపోతున్న కాలంతో పాటు మన గ్రంథాలయాలు కూడా అంతే వేగంగా, పటిష్టంగా మారాల్సిన అవసరం ఉంది. నేటి డిజిటల్ యుగంలో సమాచారం అత్యంత వేగంగా పరిణామం చెందుతోంది. ఈ నేపథ్యంలో సంప్రదాయ గ్రంథాలయాలు గతంలో నిర్వహించిన విధులు అంటే, కేవలం పుస్తకాలు నిల్వ చేసే ప్రదేశాలుగా, వినియోగదారులకు పుస్తకాలను అందించేవిగా మాత్రమే ఉంటే సరిపోదు. ఇప్పుడు ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాఠకులకు అత్యుత్తమ ఉత్తమ సేవలు అందించే కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ మార్పులో "అల్గోరిథమిక్ లిటరసీ" (అల్గోరిథమిక్ అక్షరాస్యత) అలాగే "కృత్రిమ మేధస్సు" (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) (ఏ.ఐ.) లు కీలక పాత్రను పోషిస్తున్నాయి. ఈ రెండూ గ్రంథాలయ వ్యవస్థలో ఎలా ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి అనేది ఇప్పుడు విస్తృతంగా చర్చించబడుతున్న అంశం.

మొదట, అల్గోరిథమిక్ అక్షరాస్యత అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. మనం ఇంటర్నెట్‌లో ఏదైనా వెతికినప్పుడు, సోషల్ మీడియాలో స్క్రోల్ చేసినప్పుడు మనకు కనిపించే సమాచారం అంతా కొన్ని కంప్యూటర్ ప్రోగ్రామ్‌ల (అల్గోరిథమ్స్) ద్వారా ఎంపిక చేయబడుతుంది. ఏ సమాచారం మనకు ముందుగా కనిపిస్తుంది, ఏది దాచబడుతుంది అనేది ఈ అల్గోరిథమ్స్ నిర్ణయిస్తాయి. అల్గోరిథమిక్ అక్షరాస్యత అంటే ఈ సాంకేతికతను అర్థం చేసుకోవడం. అంటే, తమకు కనిపిస్తున్న సమాచారం ఎలా వచ్చింది, దాని వెనుక ఉన్న లాజిక్ ఏమిటి, అందులో పక్షపాతం (బయాస్) ఉందా లేదా అని ప్రశ్నించే సామర్థ్యాన్ని పాఠకుల్లో పెంపొందించడం. నేటి కాలంలో ఫేక్ న్యూస్ (అబద్ధ వార్తలు), తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తున్నాయి. వీటిని గుర్తించి, సరైన సమాచారాన్ని ఎంపిక చేసుకోవడానికి అల్గోరిథమిక్ అక్షరాస్యత చాలా అవసరం. గ్రంథాలయాలు ఈ విషయంలో పాఠకులకు దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత ఉంది.

రెండవది, కృత్రిమ మేధస్సు (ఏ.ఐ.). గ్రంథాలయాల పనితీరును ఆధునికీకరించడంలో ఏఐ ఒక గేమ్ ఛేంజర్‌గా మారింది. గ్రంథాలయ నిర్వహణలో అనేక సవాళ్లు ఉంటాయి. ఉదాహరణకు, పుస్తకాలను వర్గీకరించడం, క్యాటలాగ్ చేయడం, పాఠకులకు కావాల్సిన పుస్తకాలను వేగంగా వెతికి ఇవ్వడం వంటివి. ఏ.ఐ. సాయంతో ఈ పనులు సులభతరం అవుతాయి. చాట్‌బాట్లు (సంభాషణ యంత్రాలు) ద్వారా 24 గంటల పాటు పాఠకుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వవచ్చు. పాఠకుల అభిరుచులకు, ఆసక్తులకు అనుగుణంగా వారికి నచ్చే తాజా పుస్తకాలను సిఫార్సు చేయవచ్చు. ఇది పాఠకుల అనుభవాన్ని మెరుగుపరుస్తుంది.

అలాగే, పరిశోధనా రంగంలో ఏఐ ఎంతో ఉపయోగకరం. భారీ డేటా (భారీ సమాచారం)ను విశ్లేషించడం, వివిధ భాషల్లో ఉన్న పరిశోధనా పత్రాలను అనువదించడం, సంక్షిప్తీకరించడం వంటి పనులను ఏఐ చేయగలదు. డిజిటల్ లైబ్రరీలలో పాత పుస్తకాలను, గ్రంథాలను స్కాన్ చేసి, వాటిని టెక్స్ట్ ఫార్మాట్‌లోకి మార్చడం ద్వారా వాటిని శాశ్వతంగా భద్రపరచవచ్చు. ఇది పూర్వ జ్ఞానాన్ని కాపాడుకోవడానికి ఎంతో దోహదపడుతుంది.

అయితే, ఇక్కడ ఒక పెద్ద ప్రశ్న ఉంది. ఏ.ఐ. అలాగే అల్గోరిథమ్స్ అంతా మనుషుల చేత ప్రోగ్రామ్ చేయబడినవే. వాటిలో కూడా మనుషుల చేసే తప్పులు, పక్షపాతాలు ప్రతిబింబించే అవకాశం కూడా ఉంది. ఉదాహరణకు, ఒక ఏ.ఐ. వ్యవస్థ ఒక నిర్దిష్ట వర్గం లేదా లింగానికి సంబంధించిన పుస్తకాలనే ఎక్కువగా సిఫార్సు చేస్తే, అది పక్షపాతంగా మారుతుంది. దీనిని "అల్గోరిథమిక్ పక్షపాతం" అంటారు. అందుకే గ్రంథాలయ నిర్వాహకులు, లైబ్రేరియన్లు ఈ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. ఏ.ఐ. ఇచ్చే సమాచారం ఎల్లప్పుడూ 100 శాతం సరైనది కాదని, దానిని పరిశీలించి ఉపయోగించుకునే వివేచన పాఠకులకు కూడా ఉండాలి. ఇక్కడే అల్గోరిథమిక్ అక్షరాస్యత, ఏ.ఐ. రెండూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఏర్పడుతుంది.

నేటి గ్రంథాలయాలు సమాజానికి జ్ఞాన కేంద్రాలు. కాబట్టి, ఇక్కడ సాంకేతికత ప్రజాస్వామ్యబద్ధంగా తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. ఏఐ వల్ల ఏర్పడే "డిజిటల్ విభజన" (అంతర్జాల విభజన)ను తగ్గించడం గ్రంథాలయాల బాధ్యత. అంటే, సాంకేతికత తెలిసిన వారు మాత్రమే ప్రయోజనం పొందకుండా, సామాన్యులు కూడా ఈ సదుపాయాలను వాడుకునేలా చూడాలి. ఇందుకోసం లైబ్రేరియన్లు స్వయంగా ఏ.ఐ. పరిజ్ఞానం పెంచుకోవాలి. వారు కేవలం పుస్తకాల కాపలాదారులుగా కాకుండా, "డేటా క్యూరేటర్లు" (సమాచార సంరక్షకులు) మరియు "టెక్నాలజీ గైడ్లు" (సాంకేతిక మార్గదర్శకులు)గా మారాలి. మరో ముఖ్యమైన అంశం డేటా గోప్యత (సమాచార గోప్యత). పాఠకులు ఏ పుస్తకాలు చదివారు, ఏ అంశాలపై ఆసక్తి చూపుతున్నారు అనే డేటా గ్రంథాలయాల వద్ద ఉంటుంది. కృత్రిమ మేధ (ఏ.ఐ.) ను ఉపయోగించేటప్పుడు ఈ డేటా సురక్షితంగా ఉండాలి. పాఠకుల విశ్వాసాన్ని కాపాడుకోవడం చాలా అవసరం.

మొత్తం మీద చూస్తే, గ్రంథాలయ వ్యవస్థలో అల్గోరిథమిక్ అక్షరాస్యత మరియు ఏ.ఐ. లు రెండు కళ్లలాంటివి. ఏ.ఐ. అనేది పనితీరును వేగవంతం చేసే ఒక శక్తివంతమైన సాధనం అయితే, అల్గోరిథమిక్ అక్షరాస్యత అనేది ఆ సాధనాన్ని సరైన దిశలో ఉపయోగించడానికి కావాల్సిన వివేకం. భవిష్యత్తులో గ్రంథాలయాలు కేవలం సమాచారాన్ని అందించే విధిని మాత్రమే నిర్వహించే విగా మిగిలి పొకుండా, సమాచారాన్ని విశ్లేషించి, సరైన జ్ఞానాన్ని అందించే "స్మార్ట్ లైబ్రరీలు" (తెలివైన గ్రంథాలయాలు)గా ఎదగాలంటే, ఈ రెండు అంశాలపై సరైన అవగాహన, సరైన శిక్షణ పొందటం ఎంతో అవసరం. సాంకేతికతను మానవీయ విలువలతో జోడించినప్పుడే గ్రంథాలయాలు నిజమైన జ్ఞానంతో సమాజానికి సమర్థవంతంగా మార్గదర్శకత్వం వహించగలవు.

డాక్టర్ బి.జగదీష్
లైబ్రేరియన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
ములుగు,ములుగు జిల్లా.



ప్రేమ శిఖరాలు

జీవితంలో నువ్వు కొని కట్టుకున్న
కొత్త వస్త్రాలకంటే
నా చదువుల అప్పుకు కట్టిన
వడ్డీ పొట్లాలే ఎక్కువ నాన్న
ఆప్పుడు ఇచ్చే అప్పుకోసం
అర్ధాకలితో కంచంలో
కడిగేసిన నీ చెయ్యి
పరుగు పెట్టిన నీ కాళ్ళకు
నే చేసే వందనం ఏ దేవుడి సాష్టాంగ
నమస్కారానికి సమానం నాన్న
ప్రక్కటెముకలు పిక్కటిల్లే
పురిటినొప్పుల సాహసం
నా తొలి అడుగు కోసం
తపించి వెదకిన
నీ కనుల చల్లని చూపు
తప్పటడుగులో తల్లడిల్లి
అన్ని వైపుల అండగా
నిలిచిన నీ అభయహస్తం
ఏ దేవత ప్రదక్షిణల నుండి
పొందగలను అమ్మ
తప్పుడడుగులో క్షమించి
సరిచేసిన షరతులు లేని మీ ప్రేమ
నా అనారోగ్యంలో
అలసిపోక ఆదరించిన మీ దయకు
భువిపై ఏ దేవీ దేవతలు
కొలువుండే శిఖరాలు సమానం
కాగలవు అమ్మా నాన్న.
నా తల్లి తండ్రులు నేపా బేబీ
సత్యనారాయణ గారికి అందరి తల్లి
తండ్రులకు ప్రేమతో.....

నేపా సంతోష్ అచ్యుత్ కుమార్
అసిస్టెంట్ ప్రొఫెసర్
కాళోజీ ప్రతిభా పురస్కార
గ్రహీత.8639442397



తెలంగాణ రైతులు ముందుచూపుతో వ్యవహరించాలి!

ఎల్‌నినో ప్రభావం.. తగ్గుతున్న జలవనరులు.. పెరుగుతున్న సాగునీటి సవాళ్లు - రబీ సాగులో పంటల ఎంపికే రైతుల భవిష్యత్తుకు కీలకం!



తెలంగాణ వ్యవసాయ రంగం ప్రస్తుతం ఒక కీలకమైన వాతావరణ, ఆర్థిక సంక్షోభ పరిస్థితిని ఎదుర్కొనే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే రబీ వ్యవసాయ సీజన్‌లో రైతాంగం సాధారణ సాగు పద్ధతులనే అనుసరించకుండా వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత, సాగునీటి వనరులు, విద్యుత్ సరఫరా, పంటల మార్కెట్ ధరలను సమగ్రంగా విశ్లేషించుకుని ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది. వ్యవసాయం అనేది కేవలం విత్తనాలు నాటడం, పంటలు పండించడం మాత్రమే కాదు. ప్రకృతిలో చోటుచేసుకునే మార్పులను అంచనా వేస్తూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన ఆర్థిక కార్యకలాపం. ముఖ్యంగా వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతు తీసుకునే ప్రతి నిర్ణయం కుటుంబ ఆర్థిక పరిస్థితిపైనే కాకుండా రాష్ట్ర ఆహార భద్రతపైనా ప్రభావం చూపుతుంది.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగానికి ఒక ప్రధాన సవాలుగా మారుతోంది. పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో చోటుచేసుకునే అసాధారణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా వర్షపాత పంపిణీ, ఉష్ణోగ్రతలు, గాలుల దిశల్లో మార్పులు సంభవిస్తాయి. భారతదేశ నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ ప్రతి ఎల్‌నినో సంవత్సరంలో ఒకే విధమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని భావించడం శాస్త్రీయంగా సరైనది కాదు. అయితే 2026 నైరుతి రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా నమోదైన వర్షపాత లోటు, రాబోయే నెలల్లో కొనసాగవచ్చని సూచిస్తున్న వాతావరణ పరిస్థితులు రైతాంగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. భారత వాతావరణ శాఖ తాజా అంచనాలు కూడా నవంబర్ నెలలో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాన్ని సూచిస్తున్నాయి. అందువల్ల రబీ సాగు నిర్ణయాలు కేవలం గత సంవత్సరాల అనుభవాల ఆధారంగా కాకుండా ప్రస్తుత వాతావరణ అంచనాలు, స్థానిక జలవనరుల పరిస్థితుల ఆధారంగా ఉండాలి.

తెలంగాణలో వ్యవసాయానికి గోదావరి, కృష్ణా నదులతో పాటు వాటి ఉపనదులు, ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, బావులు, బోరుబావులు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో రైతులు భూగర్భజలాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోతే భూగర్భజలాల పునరుద్ధరణ తగ్గుతుంది. ఇప్పటికే నిరంతర బోరుబావుల వినియోగం కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీటిమట్టాలు పడిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రబీ సీజన్‌లో అధిక నీటి అవసరమున్న పంటలను పెద్ద ఎత్తున సాగు చేయడం రైతులకు ఆర్థికంగా భారంగా మారవచ్చు. ముఖ్యంగా వరి సాగు విషయంలో రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. వరి పంటకు అవసరమైన నీటి పరిమాణం, సాగునీటి లభ్యత, పంట కాలవ్యవధి, విద్యుత్ సరఫరా పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకోవాలి. నీటి వనరులపై స్పష్టమైన భరోసా లేని ప్రాంతాల్లో కేవలం గతంలో వరి పండించామనే కారణంతో అదే పంటను తిరిగి సాగు చేయడం ప్రమాదకరమైన నిర్ణయం కావచ్చు.

రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది. పెసర, మినుము, శనగ, కంది వంటి పప్పుధాన్యాలు, వేరుశనగ, నువ్వులు, ఆవాలు వంటి నూనెగింజల పంటలు, స్థానిక నేల స్వభావానికి అనుగుణంగా జొన్న, సజ్జ, ఇతర చిరుధాన్యాలు సాగుకు అనుకూలమైన ప్రత్యామ్నాయాలుగా పరిశీలించాలి. అయితే అన్ని ప్రాంతాల్లో అన్ని పంటలు ఒకే విధంగా లాభదాయకంగా ఉండవు. నేల రకం, విత్తే సమయం, విత్తన రకం, నీటి లభ్యత, మార్కెట్ డిమాండ్ ఆధారంగా పంటను ఎంపిక చేసుకోవాలి. స్వల్పకాలిక పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు పంట నష్టాల ప్రమాదాన్ని కూడా కొంతవరకు నియంత్రించవచ్చు. కూరగాయల సాగు కూడా మంచి ఆదాయాన్ని అందించే అవకాశం కలిగి ఉన్నప్పటికీ మార్కెట్ ధరల్లో ఉండే ఒడిదుడుకులను రైతులు పరిగణనలోకి తీసుకోవాలి. రబీ వ్యవసాయంలో విద్యుత్ సరఫరా మరో కీలకమైన అంశం. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు బోరుబావుల ద్వారా ఎక్కువగా నీటిని తోడుకోవాల్సి వస్తుంది. ఒకవైపు విద్యుత్ డిమాండ్ పెరగడం, మరోవైపు సాగునీటి అవసరాలు అధికమవడం వల్ల విద్యుత్ సరఫరాపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంది. విద్యుత్ కోతలు, సరఫరాలో అంతరాయాలు, బోరుబావుల్లో నీటి మట్టాలు తగ్గడం వంటి సమస్యలు పంటల పెరుగుదలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. అందువల్ల రైతులు పంట వేయడానికి ముందే తమ బోరుబావుల నీటి సామర్థ్యాన్ని పరిశీలించుకోవాలి. ఒకటి రెండు నీటి తడులతోనే పంటను కాపాడగలమనే అంచనాలతో సాగు ప్రారంభించడం కంటే పంట మొత్తం కాలానికి అవసరమయ్యే నీటి పరిమాణాన్ని లెక్కించుకోవడం మంచిది.

వ్యవసాయంలో నీటి పొదుపు పద్ధతులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ పద్ధతులు, పొలంలో తేమను నిల్వ ఉంచే చర్యలు, మల్చింగ్, అవసరానికి అనుగుణంగా నీటి తడులు ఇవ్వడం ద్వారా నీటి వినియోగాన్ని సమర్థంగా నియంత్రించవచ్చు. వరి సాగు చేపట్టే ప్రాంతాల్లో కూడా సాధ్యమైన చోట శాస్త్రీయ నీటి నిర్వహణ పద్ధతులను పాటించాలి. పొలాల్లో అవసరానికి మించి నీటిని నిల్వ ఉంచడం వల్ల నీటి వృథాతో పాటు భూసార సమస్యలు కూడా ఏర్పడే అవకాశం ఉంది. వర్షపు నీటిని నిల్వ చేసుకునే ఫారంపాండ్లు, చెరువుల పునరుద్ధరణ, ఇంకుడు గుంతలు, భూగర్భజలాల పునరుద్ధరణ చర్యలు దీర్ఘకాలిక వ్యవసాయ భద్రతకు దోహదపడతాయి. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను అంచనా వేసి వాటి ఆధారంగా పంటల ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉంది.

ఈ విషయంలో ప్రభుత్వ వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలు, వాతావరణ నిపుణులు సమన్వయంతో పనిచేయాలి. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రబీ సాగులో తక్కువ నీరు అవసరమయ్యే పంటలను ప్రోత్సహించడం, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును విస్తరించడం, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇస్తోంది. ఈ సూచనలు కేవలం ప్రభుత్వ ప్రకటనలుగా మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలి. ప్రతి మండలంలో నీటి లభ్యత, భూగర్భజలాల పరిస్థితి, ప్రాజెక్టుల ఆయకట్టు, విద్యుత్ అవసరాలను విశ్లేషించి గ్రామాల వారీగా పంటల ప్రణాళికలు రూపొందించాలి. రైతులకు సరైన సమయంలో నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు పంటల సాగు నుంచి మార్కెటింగ్ వరకు అవసరమైన మార్గదర్శకత్వం కల్పించాలి. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర, కొనుగోలు సదుపాయాలు, మార్కెట్ అనుసంధానం కల్పించకపోతే పంటల వైవిధ్యీకరణ లక్ష్యం పూర్తిస్థాయిలో సాధ్యం కాదు. ఇక్కడ మరో ముఖ్యమైన అంశాన్ని గుర్తించాలి. రైతులు పంటను ఎంపిక చేసుకునేటప్పుడు కేవలం నీటి లభ్యతను మాత్రమే కాకుండా పెట్టుబడి వ్యయం, విత్తనాల ధర, ఎరువుల అవసరం, పురుగుమందుల ఖర్చు, కూలీల లభ్యత, కోత ఖర్చు, మార్కెట్ ధరలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఒక పంటకు అధిక దిగుబడి వచ్చినంత మాత్రాన అధిక లాభం వస్తుందని భావించ కూడదు. పెట్టుబడికి తగిన ఆదాయం లభిస్తుందా లేదా అనేది ముఖ్యమైనది. ఒకే పంటపై ఆధారపడకుండా రైతులు తమ భూమి విస్తీర్ణాన్ని బట్టి రెండు మూడు పంటలను సమతుల్యంగా సాగు చేయడం ద్వారా ఆర్థిక ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలు, స్థానిక మార్కెట్ వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా ప్రత్యామ్నాయ పంటలకు స్థిరమైన మార్కెట్ కల్పించవచ్చు.

అకాల వర్షాలు, తుఫాన్ల ప్రభావం విషయంలో కూడా రైతులు అప్రమత్తంగా ఉండాలి. అప్పుడప్పుడు కురిసే వర్షాలు భూమిలో తేమను పెంచినా అవి రబీ పంటలకు అవసరమైన మొత్తం నీటిని అందిస్తాయని భావించకూడదు. కొన్ని సందర్భాల్లో అకాల వర్షాలు పంటలకు మేలు చేయడానికి బదులుగా పంటలు దెబ్బతినడానికి, నేల కోతకు, తెగుళ్ల వ్యాప్తికి, కోతకు సిద్ధంగా ఉన్న పంటల నష్టానికి కారణమవుతాయి. కాబట్టి వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను రైతులు నిరంతరం గమనించాలి. వర్ష సూచనలు, ఉష్ణోగ్రతల మార్పులు, గాలుల తీవ్రత ఆధారంగా వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి. పంటల బీమా పథకాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు అర్హత, గడువు, నమోదు విధానాలను ముందుగానే తెలుసుకోవాలి.

తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తును కేవలం వర్షాలపై ఆధారపడి నిర్ణయించలేం. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. రైతుకు ముందుచూపు ఎంత అవసరమో ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక అంతే అవసరం. తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా మధ్య సమతుల్యత పాటిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రాధాన్యత క్రమంలో వినియోగించాలి. గ్రామస్థాయిలో నీటి బడ్జెట్ రూపొందించి ఎంత నీరు అందుబాటులో ఉంది, ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేయవచ్చు అనే విషయాలను రైతులకు వివరించాలి. ముఖ్యంగా వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి గ్రామానికి చేరుకుని రైతుల సందేహాలను నివృత్తి చేయాలి.

ప్రకృతి పరిస్థితులు మన చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ వాటిని ఎదుర్కొనే ప్రణాళిక మాత్రం మన చేతుల్లోనే ఉంటుంది. రబీ సీజన్‌లో రైతులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా వాతావరణ అంచనాలు, ప్రభుత్వ సూచనలు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలను పాటించాలి. నీటి లభ్యతను అంచనా వేయకుండా అధిక పెట్టుబడితో పంటలు సాగు చేయడం కంటే తక్కువ నీటితో పండే పంటలను ఎంపిక చేసుకోవడం వివేకవంతమైన నిర్ణయం. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం ఎంత ముఖ్యమో, పంట సాగు మధ్యలో నీటి కొరత కారణంగా నష్టపోకుండా ఉండడం కూడా అంతే ముఖ్యం. ఈ రబీ సీజన్ తెలంగాణ రైతాంగానికి ఒక పరీక్ష వంటిది. ఈ పరీక్షలో విజయం సాధించాలంటే అనుభవంతో పాటు శాస్త్రీయ ఆలోచన, ముందస్తు ప్రణాళిక, ప్రభుత్వ సూచనల పట్ల అవగాహన అవసరం. నీటిని దృష్టిలో పెట్టుకుని పంటను ఎంచుకోవాలి.. మార్కెట్‌ను అంచనా వేసుకుని పెట్టుబడి పెట్టాలి.. వాతావరణాన్ని గమనిస్తూ వ్యవసాయం చేయాలి. తెలంగాణ రైతాంగం ఈ ముందుచూపుతో వ్యవహరించినప్పుడే వ్యవసాయాన్ని నష్టాల నుంచి కాపాడుకుని స్థిరమైన ఆదాయం వైపు ముందుకు సాగగలుగుతుంది.


డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



లాలా లజపత్ రాయ్ జీవితం స్వాతంత్ర్య సమరానికి అగ్నిపాఠం

(లాలా లజపతిరాయ్ 98వ వర్ధంతి సందర్భంగా...)

భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో కొన్ని పేర్లు కేవలం వ్యక్తులుగా మిగలలేదు.. అవి విప్లవానికి ప్రతీకలయ్యాయి! అణచివేతపై ఆగ్రహానికి, బానిసత్వంపై తిరుగుబాటుకు, దేశభక్తికి నిదర్శనాలుగా నిలిచాయి. అలాంటి మహోన్నత వ్యక్తిత్వమే లాలా లజపత్ రాయ్! ఆయన జీవితం ఒక పోరాట గాథ.. ఆయన త్యాగం ఒక చరిత్ర.. ఆయన మరణం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రగిలిన అగ్నికీల!



1865 జనవరి 28న పంజాబ్‌లోని ధుడికే గ్రామంలో జన్మించిన లాలా లజపత్ రాయ్, న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించినప్పటికీ, దేశం బానిసత్వంలో మగ్గుతున్నప్పుడు వ్యక్తిగత సుఖాలకు పరిమితం కాలేదు. దేశ స్వాతంత్ర్యమే తన జీవిత లక్ష్యంగా మలుచుకున్నారు. బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్ర పాల్‌లతో కలిసి 'లాల్-బాల్-పాల్' త్రయంగా భారత జాతీయోద్యమానికి ఉరుములాంటి శక్తినిచ్చారు. మితవాద రాజకీయాల నుంచి తీవ్ర జాతీయవాద దిశగా ఉద్యమాన్ని మలిచిన నేతల్లో ఆయనది కీలక పాత్ర.

1907లో బ్రిటిష్ ప్రభుత్వం విచారణ లేకుండానే ఆయనను మాండలేకు బహిష్కరించింది. జైలు గోడలు ఆయన సంకల్పాన్ని బంధించలేకపోయాయి. అమెరికాలో భారత స్వాతంత్ర్యానికి మద్దతు కూడగట్టేందుకు 1917లో ఇండియన్ హోమ్ రూల్ లీగ్ ఆఫ్ అమెరికాను స్థాపించారు. విదేశీ గడ్డపైనా భారత స్వేచ్ఛా స్వరాన్ని వినిపించారు. 1920లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ ప్రత్యేక సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్మిక హక్కుల ఉద్యమంలోనూ ముందుండి అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు.

లాలా లజపత్ రాయ్ పోరాటం కేవలం రాజకీయ స్వాతంత్ర్యానికే పరిమితం కాలేదు. విద్య, స

అక్షర 'షాబాద్'

రాష్ట్రంలోనే తొలి మండలం ఎంపిక

వంద శాతం అక్షరాస్య మండలం తీర్చిదిద్దేందుకు కసరత్తు

■ ఐదు రోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి చేయాలి ■ జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశం ■ మండలంలోని 41 పంచాయతీలు 15,507 కుటుంబాల గుర్తింపునకు యంత్రాంగం సిద్ధం



రంగారెడ్డి, నవంబర్ 17(జనం సాక్షి):

"15 ఏళ్ల నిండిన ప్రతి నిరక్షరాస్యు డిని గుర్తించి వయోజన విద్యాశాఖ అందించే నమూనా పత్రంలో వివరాలు నమోదు చేయాలి. ముఖ్యంగా 15 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న ప్రతి ఒక్కరినీ గుర్తించి, తప్పనిసరిగా 'ఉల్లాస్' యాప్‌లో నమోదు చేయాలి."

- సి. నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్.

నిరక్షరాస్యత అనే చీకటిని తరిమికొట్టి, ప్రతి ఇంటా అక్షర జ్యోతిని వెలిగించే ందుకు రంగారెడ్డి జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. ప్రతిష్ఠాత్మక ఉల్లాస్ నవ భారత్ సాక్షరతా కార్యక్రమం కింద షాబాద్ మండలాన్ని రాష్ట్రంలోనే మొట్టమొదటి వంద శాతం అక్షరాస్య మండలంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా రానున్న ఐదు రోజుల్లోగా మండలంలోని ప్రతి ఇంటిని సందర్శించి, సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీ నారాయణ రెడ్డి క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు.

ఇంటింటికీ యంత్రాంగం..

రాష్ట్ర గణాంకాల ప్రకారం షాబాద్ మండలంలోని 41 గ్రామ పంచాయతీల ున్నాయి. వాటి పరిధిలో 15,507 కుటుంబాలున్నాయి. ఈ కుటుంబాలన్నింటినీ కలుపుకునేలా పక్కా ప్రణాళిక రూపొందించారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, సెర్ప్ గ్రామ సంఘ సహాయకులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఈ కుటుంబాలను సమానంగా విభజించి అప్పగించనున్నారు. సిబ్బంది ప్రతి ఇంటిని స్వయంగా సందర్శించి, చదువురాని వారి వివరాలను సేకరించనున్నారు.

శాఖల మధ్య సమన్వయమే కీలకం..

ఈ బృహత్తర కార్యక్రమానికి షాబాద్ ఎంపీడీవో మండల స్థాయి పూర్తిస్థాయి పర్యవేక్షకులుగా వ్యవహరించనున్నారు. తహసీల్దార్, మండల విద్యాధికారి, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, సెర్ప్, ఉపాధి హామీ సహాయ ప్రాజెక్టు అధికారులు తమ పరిధిలోని సిబ్బందిని తక్షణమే ఈ విధుల్లో నియమించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత ఐదు రోజుల గడువులోగా 100 శాతం సర్వే పూర్తయ్యేలా పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే ముగిసిన వెంటనే గ్రామాల్లో ప్రత్యేకంగా అక్షర కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. స్థానిక స్వచ్ఛంద కార్యకర్తలతో పాటు వ్యాపార, పారిశ్రామిక సంస్థల సామాజిక బాధ్యత నిధుల సహకారంతో నిరక్షరాస్యులకు చదువు చెప్పే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సర్వేకు అవసరమైన నమూనా పత్రాలు, సిబ్బందికి శిక్షణ, సాంకేతిక సహకారాన్ని జిల్లా వయోజన విద్యా ఉప సంచాలకులు కె. అనిత పర్యవేక్షణలో అందించనున్నారు.

విజేత మ్యాక్స్ సొసైటీ ఐదవ మహాజనసభ

హెచ్ఐవీ బాధితులకు ఆర్థిక భరోసా

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 జనం సాక్షి:

కాలూరు గ్రామంలో 'వార్డ్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'విజేత' పరస్పర సహాయ (మ్యాక్స్) సంఘం ఐదవ మహాజనసభ మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. సమాజంలో హెచ్ఐవీ బాధితులు ఎదుర్కొంటున్న నిందలు, వివక్షలను పక్కనపెట్టి ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసుకున్న ఈ సంఘం సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.జిల్లా సంక్షేమ అధికారిణి (డీడబ్ల్యూఓ) సౌందర్య జ్యోతి ప్రజ్వలన చేసి ఈ మహాసభను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ సౌందర్య మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా ప్రత్యేక సంరక్షణ అవసరమైన బాధితులకు ప్రభుత్వ పరంగా, స్వచ్ఛంద సంస్థల ద్వారా అందుతున్న సహాయసహకారాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎలాంటి నిరాశకు లోను కాకుండా ఆర్థిక స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని కుటుంబాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆమె సూచించారు. అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యుల సందేహాలను నివృత్తి చేస్తూ తగిన సలహాలు, మార్గదర్శకాలను అందించారు.సమావేశంలో భాగంగా 'విజేత' సంఘం అధ్యక్షులు సాయిలు మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో సంఘం సాధించిన ప్రగతి, లావాదేవీలు, పొదుపులు, సభ్యత్వం అలాగే



వాటాధనానికి సంబంధించిన సమగ్ర వివరాలను సభ్యులకు, అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా 'వార్డ్' స్వచ్ఛంద సంస్థ ద్వారా 'విజేత' మ్యాక్స్ సంఘానికి రూ. 30 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అప్పు రూపంలో అందజేశారు. ఈ నిధులను సంఘంలోని సుమారు 200 మంది సభ్యులకు స్వయం ఉపాధి రుణాల రూపంలో పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.శ్రీమహాసభ ముగింపు దశలో సంఘం భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి విచ్చేసి తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించిన డీడబ్ల్యూఓ సౌందర్యతో పాటు వివిధ శాఖల అధికారులకు విజేత సంఘం నాయకులు, సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మెట్‌పల్లిలో బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య ఘర్షణ

తోపులాటలో నాయకుల బట్టలు చిరిగిన వైనం

మెట్‌పల్లి: నవంబర్ 17 (జనంసాక్షి) : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో మంగళవారం రాజకీయ ఉద్రిక్తత చోటుచేసుకుంది. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మున్సిపల్ కార్మికులను తన ఇంటి పనుల కోసం వినియోగించుకుంటున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆరోపిస్తూ ఎమ్మెల్యే నివాసం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే నివాసం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని ముట్టడిని అడ్డుకున్నారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. క్రమంగా పరిస్థితి ఉద్రిక్తంగా మారి ఇరువర్గాల మధ్య తోపులాట, ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకుల దుస్తులు చిరిగిపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న సీఐ సురేష్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్, కథలాపూర్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఎమ్మెల్యే నివాసం వద్దకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా



పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలను అదుపు చేస్తూ రాజకీయ ఘర్షణ మరింత తీవ్రరూపం దాల్చకుండా పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈ ఘటనతో మెట్‌పల్లి పట్టణంలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఇరు పార్టీల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ ఎటువైపు దారితీస్తుందోనని పట్టణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఎమ్మెల్యే నివాసం వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి.

అధునాతన లాపరోస్కోపిక్, రోబోటిక్ మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ

జీర్ణకోశ శస్త్రచికిత్సలో సరికొత్త శకం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 జనం సాక్షి:

ఆధునిక వైద్యరంగంలో లాపరోస్కోపిక్, రోబోటిక్ మినిమల్లీ ఇన్వేసివ్ శస్త్ర చికిత్సా విధానాల్లో వస్తున్న సాంకేతిక అభివృద్ధి వైద్య చికిత్సలో సరికొత్త మార్పులకు నాంది పలుకుతోందనీ డాక్టర్ ఎం సుధీర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని యశోద కన్సల్టెన్సీ నందు ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆధునిక విధానాలు జీర్ణకోశ సంబంధిత వ్యాధుల చికిత్సలో మరింత ఖచ్చితత్వం, మెరుగైన దృశ్య స్పష్టత మరియు మెరుగైన శస్త్రచికిత్స ఫలితాలను అందించేందుకు దోహదపడుతున్నాయి.ఆహారనాళం, కడుపు, కాలేయం, పిత్తాశయం, క్లోమ గ్రంథి, చిన్నపేగు, పెద్దపేగు మరియు పురీషనాళానికి సంబంధించిన అనేక వ్యాధులకు అధునాతన లాపరోస్కోపిక్ మరియు రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా ఉపయోగించబడుతున్నాయి. హై-డెఫినిషన్ 3ఈ విజువలైజేషన్, అత్యాధునిక శస్త్రచికిత్సా పరికరాలు మరియు మెరుగైన కదలికల సామర్థ్యం కలిగిన సాంకేతికతతో, చిన్న కోతల ద్వారానే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా మరింత ఖచ్చితత్వంతో నిర్వహించడం సాధ్యమవుతోంది.

మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ వల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనాలు:

చిన్న కోతలతో శస్త్రచికిత్స,తగిన రోగుల్లో శస్త్రచికిత్స అనంతర నొప్పి తగ్గడం, కొన్ని శస్త్రచికిత్సల్లో రక్తస్రావం తగ్గడం,వేగంగా కోలుకోవడం మరియు



రోజువారీ కార్యకలాపాలకు త్వరగా తిరిగి చేరుకోవడం,తగిన సందర్భాల్లో ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గడం,

క్లిష్టమైన శస్త్రచికిత్సల్లో మరింత ఖచ్చితత్వం

నేటి ఆధునిక శస్త్రచికిత్స అంటే కేవలం చిన్న కోతలకే పరిమితం కాదు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన సర్జన్ల నైపుణ్యం మరియు రోగి సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ మెరుగైన వైద్య ఫలితాలను సాధించడమే దీని ప్రధాన లక్ష్యం. యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్‌లో అధునాతన లాపరోస్కోపిక్ మరియు రోబోటిక్ శస్త్రచికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకువస్తూ, క్లిష్టమైన జీర్ణకోశ సంబంధిత వ్యాధులకు ఆధునిక, సురక్షితమైన మరియు సమర్థవంతమైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీరామ్ సురేష్ తదితరుల పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థినులు

జిల్లాస్థాయి ఎంపికల్లో ప్రతిభ వరంగల్‌లో ఈ నెల 20 నుంచి పోటీలు



సిరికొండ, నవంబర్ 17 (జనంసాక్షి): తూంపల్లి పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికై సత్తా చాటారు. అండర్-17 ఎస్జీఎఫ్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. విద్యార్థినులు అఖిల, పల్లవి, రూపిక, అఖిల, చికిత, శ్రవంతి, రక్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నగేష్ తెలిపారు. ఈ పోటీలు వరంగల్ జిల్లాలో నవంబర్ 20,21,22 తేదీల్లో జరగనున్నాయి. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థినులు క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులను మండల విద్యాశాఖ అధికారి పి. రాములు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎ. మనోహర్, ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ రాజేందర్, ఉపసర్పంచ్ శ్రీకాంత్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీ ల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, నిజామాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

వేసవిలో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌కు ముందస్తు చర్యలు

■ డీటీఆర్‌లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు పనులు వేగవంతం



కరీంనగర్ టౌన్, నవంబర్ 17, (జనం సాక్షి) :

ఎల్‌నినో ప్రభావంతో రానున్న వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, పెరగనున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ. విజయేందర్ రెడ్డి తెలిపారు. వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పంపిణీ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అధిక విద్యుత్ లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇప్పటివరకు 36 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు 64 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచినట్లు తెలిపారు. అలాగే ఆరు కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా, మరో మూడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఆరు నూతన సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మిగిలిన ప్రాంతాల్లో అవసరమైన డీటీఆర్‌లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈ తెలిపారు. పట్టణాలు, గ్రామీణ, పారిశ్రామిక ప్రాంతాల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల సామర్థ్యం పెంపు పనులను ప్రణాళికాబద్ధం గా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వేసవి ప్రారంభానికి ముందే అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఏ. విజయేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని నష్టపోతున్న రైతులు

గంగాధర నవంబర్ 17(జనంసాక్షి):



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన తూకం వేయడం ప్రారంభం కాకపోవడంతో ధాన్యాన్ని దళా రులకు అమ్ముకొని రైతులు నష్టపోతున్నారని టిఆర్ఎస్ చొప్పదండి నియోజ కవర్గం బాధ్యుడు మ్యాక వినోద్ ఆందోళన వ్యక్తం చేశారు.మంగళవారం మండలంలోని కురిక్యాల డిసిఎంఎస్ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడుతూ కేంద్రం ప్రారంభించి పదిహేను రోజులు అవుతున్నప్పటికీ తూకం ప్రారంభం కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని రైతులు నష్టపోతున్నారని అన్నారు సన్న వడ్లకు ఐదువందలు బోనస్ ఇస్తామని చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు సన్నవడ్లు పండించిన రైతులను పట్టించుకోవడం లేదని అన్నారు వెంటనే కొనుగోలు కేంద్రాలలో తూకం వేయడం ప్రారంభించి ఎటువంటి కండీషన్లు లేకుండా ఐదువందల రూపాయల బోనస్ రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆయన వెంట టిఆర్ఎస్ నాయకులు మల్యాల నర్సయ్య,సుంకేపాక రమేష్, మ్యాక విజయ్,సురేష్ తదితరులు ఉన్నారు

రాజన్న ఆలయ గర్భగుడి శిఖరం ఎందుకు తొలగిస్తున్నారు

బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గోపి

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 17 (జనంసాక్షి) :

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పేరిట అధికార పార్టీ విధ్వంసం సృష్టిస్తుందని, గర్భగుడి శిఖరం ఎందుకు తొలగిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయం ఏ ఒక్కరి సొత్తు కాదని, పేదల దేవుడు రాజన్న అన్నారు. దేవాలయ అభివృద్ధి పేరిట ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేస్తున్నారని దేవాలయ అభివృద్ధిలో గర్భగుడిని ముట్టుకోమని చెప్పిన దేవాలయ శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే మాట తప్పరన్నారు. శృంగేరి స్వామి వారి పేరును బదనాం చేస్తున్నారని, భక్తులకు రాజన్న దర్శనం ఎప్పుడు కల్పిస్తారో చెప్పాలన్నారు. ఆలయంలో జరిగే అభివృద్ధిని ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజు వివిధ పార్టీల నాయకులను ఆలయంలోకి అనుమతించి అభివృద్ధిని ప్రత్యక్షంగా చూపించాలన్నారు.

శృంగేరి పీఠాధిపతుల ఆదేశాల మేరకే నిర్వహిస్తున్నాం



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు పూర్తిగా శృంగేరి శారదా పీఠాధిపతుల సూచనలు, సలహాలు, ఆశీస్సుల మేరకే శాస్త్రోక్తంగా కొనసాగుతు న్నాయని ఆలయ అర్చకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భాలయ పునాదులు, నిర్మాణ పటిష్టతను సాంకేతిక నిపుణులు క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని విధాలా అనుకూలంగా ఉందని నిర్ధారించిన తర్వాతే పనులను ప్రారంభించారని, ఆలయ అభివృద్ధి పనుల విషయంలో భక్తులు, ప్రజలు ఎటువంటి అపోహలకు, వదంతులకు తావివ్వకుండా సంయమనంతో సహకరించాలన్నారు.



మార్కెట్‌కు నిధులు మంజూరు చేయించిన విప్ కు ధన్యవాదాలు

రుద్రంగి, నవంబర్ 17 (జనం సాక్షి) :

రుద్రంగి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) అభివృద్ధి కోసం రూ.60 లక్షల నిధులను మంజూరు చేయించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంగళవారం ప్రత్యేక ధన్యవాదములు తెలిపే కార్యక్రమం నిర్వహించారు.మార్కెట్ యార్డులో రెండు ప్లాట్ ఫారాలు, సీసీ రోడ్డు నిర్మాణానికి గాను రూ.60 లక్షల నిధులను మంజూరు చేయించినందుకు ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, డైరెక్టర్లు, రైతులు విప్ ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ తిరుపతి మాట్లాడుతూ... రుద్రంగి మార్కెట్ యార్డు అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారని, తమ విజ్ఞప్తి మేరకు రూ.60 లక్షల నిధులను మంజూరు చేయించడం పట్ల రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో యార్డులో రెండు నూతన ప్లాట్ ఫారాలు, సీసీ రోడ్డు నిర్మాణంతో మౌలిక వసతులు, రైతులకు అవసరమైన సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు తమ పంటలను అరబెట్టుకోవడానికి, నిల్వ చేసుకోవడానికి ఇక ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.ఈ కార్యక్రమంలో రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఇప్పటి నుంచే కృషి చేయాలి

మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాగ్ మోహన్ సింగ్ పిలుపు



కామారెడ్డి, నవంబర్ 17 (జనం సాక్షి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేయాలని మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాగ్ మోహన్ సింగ్ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. మంగళవారం కామారెడ్డిలో నిర్వహించిన బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు పాల్గొన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రజల్లో విశ్వాసం తగ్గుతోందని, రాష్ట్రంలో రాజకీయ మార్పును ప్రజలు కోరుకుంటున్నారని వారు వ్యాఖ్యానించారు. మైనార్టీ మోర్చా నాయకులు సమావేశాలకే పరిమితం కాకుండా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని, బీజేపీ సిద్ధాంతాలు, విధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. యువ నాయకులు చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రాంతంలో సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రాజీనీస్, హరిప్రతాప్ సింగ్, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు వసీం అక్రమ్, మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నేహాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాసింగ్, ఉపాధ్యక్షులు నహీముద్దీన్, యూసుఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వడ్లు ఆరబెడితే కఠిన చర్యలు

రహదారి భద్రతకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదు: పోలీసులు హెచ్చరిక

భిక్కనూరు నవంబర్ 17 (జనంసాక్షి): భిక్కనూరు మండల పరిధిలోని జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా వడ్లను పోసి ఆరబెట్టడం, నిల్వచేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని భిక్కనూరు పోలీసులు హెచ్చరించారు. రైతులు జాతీయ రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని హైవేలపై వడ్లు పోయకుండా ప్రత్యామ్నాయ ప్రదేశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో మంగళవారం భిక్కనూర్ మండల పరిధిలోని జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా పోసిన వడ్లను పోలీసులు తొలగించి,స్వాధీనం చేసుకుని రహదారిపై రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై వడ్లు పోసి ఆరబెట్టడం వల్ల వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని పోలీసులు పేర్కొన్నారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో వడ్లు స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు,ఇతర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రైతులు తమ పంటను ఆరబెట్టుకునేందుకు జాతీయ ప్రధాన రహదారులను ఉపయోగించకుండా సురక్షితమైన ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఎంచుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించేలా రహదారులపై వడ్లు పోసి రాకపోకలకు అంతరాయం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.





రాజన్న ఆలయం ముందు ఉద్రిక్తత

విమాన గోపురం కూల్చివేతపై భాజపా నాయకులు ధర్నా

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 17 (జనంసాక్షి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ముందు మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రధాన ఆలయ విమాన గోపురం కూల్చి వేస్తున్నారని సమాచారం తెలవడంతో భాజపా నాయకులు అక్కడికి తరలి వచ్చి నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు ధర్నాకు దిగారు.ముందుగా శాంతియుతంగా ప్రారంభమైన ధర్నా ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ఆలయానికి రక్షణగా ఏర్పాటుచేసిన రేకుల షెడ్డును పగలగొట్టేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులపై బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపడుతున్న ప్రధాన ఆలయ విమాన గోపురం నిర్మాణాన్ని హిందువుల మనోభావాలకు విరుద్ధంగా ప్రభుత్వం ఆలయ నిర్మాణ పనులు చేపడుతోందని ఆరోపించారు. పురాతన రాతి కట్టడాల శైలిలో ఆలయాన్ని నిర్మించాల్సి ఉండగా, కాంక్రీట్ నిర్మాణాలతో ఆలయ రూపురేఖలను మార్చుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భాజపా పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ఓ,బిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, కౌన్సిలర్లు వంగల శ్రీనివాస్, కొండ్లెపు చి

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
18 నవంబర్ 2026

ప్రత్యామ్నాయ సాగుతో రైతుకు అధిక ఆదాయం

- వరి సాగు తగ్గించి ఆరుతడి పంటల వైపు మళ్లాలి
- మహిళా సంఘాలకు ఆధునిక సాగుతో స్వయం ఉపాధి
- పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు,మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వద్దు
- జిల్లాకలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

కల్వకుర్తి, నవంబరు 17 (జనంసాక్షి) : ప్రత్యామ్నాయ పంటల సాగుతో తక్కువ నీటితో అధిక ఆదాయం పొందాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ రైతులకు సూచించారు.వరి సాగును తగ్గించి ఆరుతడి పంటలు, పందిరి కూరగాయలు సాగు చేయాలని,పంటల మార్పిడితో భూసారం, ఆదాయం మెరుగుపడతాయని పేర్కొన్నారు. మంగళవారం ముకురాల,పంజాగుల గ్రామాల్లో పర్యటించి వ్యవసాయం, ఉపాధి పనులు, పాఠశాలను పరిశీలించారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

ముకురాల గ్రామంలో రైతు రాజేందర్‌రెడ్డి ఆరు ఎకరాల్లో సాగు



చేస్తున్న పందిరి కూరగాయలు, చిక్కుడు, బొప్పాయి పంటలను కలెక్టర్ పరిశీలించారు.పెట్టుబడి, దిగుబడులు,నీటి వినియోగం, ఆదాయ వివరాలు తెలుసుకున్నారు. కూరగాయలు, నూనెగింజలు, చిరుధాన్యాలు సాగు చేస్తూ మార్కెట్ డిమాండ్కు అనుగుణంగా పంటల ప్రణాళికరూపొందించుకోవాలన్నారు.ఎద్దు గానుగ ద్వారా తయారు చేస్తున్న నూనె ఉత్పత్తులను పరిశీలించి,నాణ్యత, విక్రయాల వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి విక్రయించాలని సూచించారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు

పంజాగులలో ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న వ్యవసాయ నీటి కుంట పనులను పరిశీలించారు. కూలీలకు ఉపాధితో పాటు గ్రామాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు.అనంతరం దాసరి లక్ష్మమ్మ మహిళా సంఘం ఆధ్వర్యంలో 400 చదరపు మీటర్లలో ఏర్పాటు చేసిన నీడవల సాగు కేంద్రాన్ని పరిశీలించారు. రూ.1.46 లక్షల వ్యయంతో ఏర్పాటైన ఈ కేంద్రానికి 50 శాతం సబ్సిడీగా రూ.73 వేలు అందినట్లు తెలుసుకున్నారు. ఆకుకూరలు,కీరదోస,రంగు మిరప, తీగ టమాట సాగు, విక్రయాలు,ఆదాయంపై ఆరా తీశారు. ఆధునిక సాగు పద్ధతులు,ప్రభుత్వ రాయితీలను వినియోగించుకొని మహిళా సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం,డివిజన్ ఉద్యాన శాఖ అధికారి జగన్,తహసీల్దార్ ఇబ్రహీం,ఎంపీడీవో యాదయ్య, మండల విద్యాధికారిశంకర్ నాయక్,సర్పంచి పర్వతాలు, వివిధ శాఖల అధికారులు, రైతులు,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళా మత్స్యకారుల ఆర్థిక స్వావలంబనకు కృషి

- సొసైటీ అధ్యక్షురాలు గిరమోని పార్వతమ్మ



జడ్చర్ల, నవంబర్ 17 (జనంసాక్షి) : మహిళా మత్స్యకారుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు, సహకార రంగ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటామని మత్స్యకారుల మార్కెటింగ్ మహిళా కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షురాలు గిరమోని పార్వతమ్మ అన్నారు. మంగళవారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట మత్స్యకారుల మార్కెటింగ్ మహిళా కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు జిల్లా కో-ఆపరేటివ్ కార్యాలయ అధికారి ఓ. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఏకగ్రీవంగా జరిగాయి. మొత్తం 9 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం అధ్యక్షురాలిగా గిరమోని పార్వతమ్మ, కార్యదర్శిగా గోనెల కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలిగా ఎన్. శివలీల, కోశాధికారిగా జి. మంజుల, డైరెక్టర్లుగా శివలీల, సుమలత, అమృత, భాగ్య, నాగలక్ష్మి ఎన్నికయ్యారు. మత్స్య ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సంఘాన్ని బలోపేతం చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది. పలువురు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

డిసెంబర్ నెలాఖరులోపు అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి



గోపాలపేట, నవంబర్ 17 (జనంసాక్షి) : వనపర్తి జిల్లా గోపాల్పేట మండలం పొలికపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి డిసెంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా తరగతి గదులను రూపొందించాలని సూచించారు. నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో పాఠశాల సిబ్బంది, గ్రామ సర్పంచ్ బంగారయ్య, పీఆర్ ఏఈ భాస్కర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు

- పథకంపై పెద్ద ఎత్తున ప్రచారం అవసరం
- 19వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు
- రేషన్ షాపుల వారీగా లబ్ధిదారుల గుర్తింపు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నడిగడ్డ, నవంబర్ 17 (జనం సాక్షి) : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక శిబిరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇతర అధికారులతో పథకం అమలు సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ వెబ్ ఎక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ నుంచి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నందున



జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు ప్రారంభం కానున్నందున అధికారులు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. రేషన్ కార్డుదారుల డేటాను ప్రతి మండలానికి పంపించడం జరుగుతుందని దీని ఆధారంగా ఆయా రేషన్ దుకాణాల పరిధిలోని లబ్ధిదారులందరి చేత బీమా పథకానికి దరఖాస్తు చేయించేలా ప్రణాళికతో అధికారులు ముందుకెళ్లాలన్నారు. పథకం పకడ్బందీ అమలుకు ఈనెల 18న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు, రేషన్ డీలర్లు, తదితరులతో ఆయా మండలాల ఉన్నతాధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించి తగు సూచనలు చేయాలన్నారు.

దరఖాస్తులను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

రేషన్ కార్డుల ఆధారంగా లబ్ధిదారుల వివరాలతో ముందస్తుగా నింపిన దరఖాస్తులను రేషన్ షాపుల వారీగా సిద్ధం చేసి సంబంధిత అధికారులకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. రేషన్ కార్డులు లేని కుటుంబాలకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, అటువంటి వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు. లబ్ధిదారుల పూర్తి వివరాలతో, సంతకంతో పూరించిన దరఖాస్తులను పోగొట్టడం, ఎక్కడపడితే అక్కడ పడేయడం వంటి దుర్వినియోగానికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వడ్లు కొనుగోలు చేయాలంటూ రైతుల ధర్నా

- నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం
- కాంటాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతుల ఆవేదన
- వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్



పుల్కల్, నవంబర్ 17 (జనం సాక్షి) : సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సబ్ స్టేషన్ ముందర ధర్నా నిర్వహించారు.కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కాంటాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోయి నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంట సాగు కోసం చేసిన అప్పులు, పెట్టుబడుల భారం తమపై ఉందని, ధాన్యం విక్రయించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశం

నాగకర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 17 (జనం సాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వైద్యాధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలను బలోపేతం చేసి, అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మంగళవారం నాగర్కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశ మందిరంలో జిల్లా ఆసుపత్రి వైద్యులు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్లు, వివిధ వైద్య విభాగాల అధిపతులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్ని వైద్య విభాగాల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, యంత్ర పరికరాలు, సిబ్బంది వివరాలను సమీక్షించి, ఎక్కడెక్కడ మౌలిక వసతుల కొరత ఉందో గుర్తించాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్), ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) నిర్వహణ, వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలపై అధికారులతో చర్చించారు.ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న కొన్ని వైద్య విభాగాలను ఉయ్యాలవాడలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణానికి తరలించే అంశాన్ని సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ, డాక్టర్ రఘు, వైద్యులు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్లు, వివిధ వైద్య విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- లబ్ధిదారులకు చేయూత పింఛన్లు..
- సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



శంకర్‌పల్లి, నవంబర్ 17 (జనం సాక్షి) : ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు.శంకర్ పల్లి మండలం, మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు మంగళవారం మండలంలోని మనీ గార్డెన్లో చేయూత పింఛన్లు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల, మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 577 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్లు అందజేశారు.అలాగే అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను అందించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్లు, బొల్లారం వెంకటరెడ్డి, గంద్ర సత్యం, తాసిల్దార్ సురేందర్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్ ఆనంద్, సర్పంచులు శేఖర్, బీరయ్య, బల్వంత్ రెడ్డి, నివేదిత ఇంద్రసేనారెడ్డి, సురేందర్ గౌడ్, స్వాతి కాంతి రెడ్డి, మాచన్నగారి రాఘవేంద్ర రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ ,కౌన్సిలర్స్, మాజీ సర్పంచులు, వార్డ్ మెంబర్లు లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

వికలాంగులకు కమ్యూనిటీ భవనం నిర్మించాలి



చేర్యాల, నవంబర్ 17 (జనంసాక్షి) : సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ప్రజావాణి జరగగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్.పి.ఆర్.డి చేర్యాల డివిజన్ కమిటీ సంఘం నాయకులు కలిసి చేర్యాల పరిధిలోని వికలాంగుల వివరాలు కావాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్, చేర్యాలలో కమ్యూనిటీ భవనం కావాలని కోరుతూ తహశీల్దార్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేర్యాల పరిధిలోని వికలాంగులు ప్రభుత్వ పథకాలలో కానీ ఇతరత్రా విషయాలలో కానీ వారి హక్కులు వారు తెలుసుకోవడంలోను చాలా వెనుకబడి ఉన్నారని,అందుకు చేర్యాల పట్టణంలో ఉన్నటువంటి వికలాంగుల వివరాలు మొత్తం సంఘానికి అందిస్తే వారి అభివృద్ధిలో వారిదిగా ఉంటామని అన్నారు.అలాగే దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం ప్రతి మండలంలో వికలాంగులకు కమ్యూనిటీ భవనం అనేది వికలాంగుల హక్కు అని వికలాంగుల ఎదుగుదలకు కమ్యూనిటీ భవనం అనేది తప్పనిసరి కావడంతో కాస్తంత స్థలాన్ని వికలాంగుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తే ఏ విధంగానైనా భవనాన్ని సమకూర్చుకుంటామని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తాండ్ర సత్తయ్య, కార్యదర్శి కర్రే రవి, సభ్యుడు నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం చూపే ఉద్యోగులను తొలగించాలి

- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- హాజరు నమోదు చేయని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు
- రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి
- వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- ఆసుపత్రి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నడిగడ్డ, నవంబర్ 17 (జనం సాక్షి) : విధుల్లో అలసత్వం చూపే ఉద్యోగులను తొలగించాలని, హాజరు సక్రమంగా నమోదు చేయని ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ప్రసూతి, శిశు సంరక్షణ విభాగాలు, ఇన్పేషెంట్ వార్డులు, మందుల లభ్యత, పారిశుద్ధ్యం, వైద్య సిబ్బంది హాజరు, తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రసూతి, డెలివరీ విభాగాల్లో అనవసరమైన రద్దీ లేకుండా చూడాలని, ప్రసవం అనంతరం తల్లులు, శిశువులను నిర్దేశించిన వార్డులకు తరలించాలని సూచించారు. నవజాత శిశువుల గుర్తింపు కోసం తల్లి, తండ్రి వివరాలు, ప్రత్యేక ఐడీతో కూడిన ట్యాగింగ్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నియోనాటల్ స్పెషలిస్ట్ సేవల అవసరాన్ని పరిశీలించాలని సూచించారు. మాతా సంరక్షణ విభాగంలో బెడ్ షీట్ల కొరతపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు రూ.50 లక్షల నిధులు మంజూరు

వైద్య సిబ్బంది హాజరుపై ప్రత్యేక పర్యవేక్షణ

వైద్యులు, ప్రొఫెసర్లు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరుకావాలని, బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. పర్యవేక్షకుల ఛాంబర్ లో కలెక్టర్ ఉద్యోగుల, ఇతర సిబ్బంది హాజరు రిజిస్టర్ లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గత 45 రోజుల హాజరు వివరాలను పరిశీలించి, మాన్యువల్ రిజిస్టర్, ఆన్లైన్, బయోమెట్రిక్ హాజరు వివరాలను సరిపోల్చి



సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. అవుట్సోర్సింగ్ సిబ్బంది హాజరు, పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, దీర్ఘకాలంగా విధులకు హాజరుకాని వారి స్థానంలో ఆమోదిత మెరిట్ జాబితా ప్రకారం తదుపరి అర్హులైన అభ్యర్థులను నియమించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెరిట్ జాబితాలో ఎలాంటి మార్పులు చేయడానికి ఏజెన్సీలకు అధికారం లేదని స్పష్టం చేశారు.

మూడు షిఫ్టుల్లో వైద్య సేవలు అందించాలి

ఆసుపత్రిలో వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించాలని సూచించారు. ఈ పర్యటనలో ఆసుపత్రి పర్యవేక్షకురాలు ఝాన్సీ లక్ష్మి, ఇతర వైద్యాధికారులు, తదితరులున్నారు.



పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను

త్వరగా పూర్తి చేయాలి

- వంగరలోని పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

హనుమకొండ ప్రతినిధి/ భీమదేవరపల్లి, నవంబర్ 17 (జనం సాక్షి) : పీవీ విజ్ఞాన కేంద్రంలో ఆర్ట్ గ్యాలరీకి సంబంధించిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరిట నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.విజ్ఞాన కేంద్రంలోని ఫోటో గ్యాలరీ, మ్యూజియం, కాన్ఫరెన్స్ హాలు, ప్రాంగణంలో నాటిన మొక్కలను, పరిసరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి పనుల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పీవీ విజ్ఞాన కేంద్రంలో అభివృద్ధి పనులు దాదాపుగా పూర్తయ్యాయని, ఆర్ట్ గ్యాలరీ లో పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆర్ట్ గ్యాలరీకి సంబంధించిన పనులను ఆర్కిటెక్చర్ పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలిపారు. ఆర్ట్ గ్యాలరీలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటు, సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాలు, తదితర పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రాంగణంలో నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. పనులు పూర్తి చేసి వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ సృజన, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈ ఈఈ భీమ్ రావు, తహసీల్దార్ రాజేష్, డీఈలు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

- సంక్షేమ పథకాల అమలులో మహిళలకు పెద్దపీట
- అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే లక్ష్యం..
- భూపాలపల్లి నియోజకవర్గంలో 6 వేల మందికి కొత్త పింఛన్లు..
- వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు..
- కొత్త పింఛన్ల మంజూరులో లంచం తీసుకుంటే కఠిన చర్యలు.. ఎమ్మెల్యే గండ్ర హెచ్చరిక



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమంతోపాటు మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ మంజూరు పత్రాలను అందజేశారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రత్యేక ప్రాధాన్యం: ఎంపీ కావ్య..

గతంలో రాజకీయ సమావేశాలకు మహిళల హాజరు పరిమితంగా ఉండేదని, నేడు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడం సంతోషంగా ఉందని ఎంపీ కడియం కావ్య అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, గృహజ్యోతి వంటి పథకాల ద్వారా మహిళలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తోందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గతంలో సుమారు 40 లక్షల మందికి పింఛన్లు అందుతుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా నాలుగున్నర లక్షల పింఛన్లు మంజూరు చేసిందని వివరించారు. ఈ పథకం అమలుకు ఏడాదికి సుమారు రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలను కేవలం చిన్నచిన్న వ్యాపారాలకే పరిమితం చేయకుండా ఆర్టీసీ బస్సులు, సౌర విద్యుత్ కేంద్రాలు, మీ సేవ కేంద్రాలు, పెట్రోల్ బంకులు, గోదాముల వంటి రంగాల్లోనూ యజమానులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. రెండు విడతల్లో సుమారు ఎనిమిది లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఇందుకోసం రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భూపాలపల్లి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎంపీ తెలిపారు. భూపాలపల్లి రైల్వే లైన్ కోసం ప్రతిపాదనలు సమర్పించామని, మార్గం, అలైన్‌మెంట్ ఖరారుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీ టెండర్లు పూర్తయ్యాయని వెల్లడించారు. సింగరేణి వంటి సంస్థల సహకారంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిజాయితీగా కృషి చేస్తున్నారని ఆమె ప్రశంసించారు.

6 వేల మందికి కొత్త పింఛన్లు: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..

భూపాలపల్లి నియోజకవర్గంలో 6 వేల మందికి కొత్త పింఛన్లు అందజేయడం జరిగిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గత ఎనిమిదేళ్లుగా పింఛన్లు అందక ఇబ్బందులు పడుతున్న అర్హులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేస్తోందన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో సుమారు 1,200 నుంచి 1,250 మందికి, నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు 6 వేల మందికి కొత్త పింఛన్లు అందించనున్నట్లు వెల్లడించారు. వీటి కోసం ప్రతి ఏడాది సుమారు రూ.3.75 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. వి భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటికే రూ.73 కోట్ల నిధులు తీసుకొచ్చామని, మరో రూ.100 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. అంబేద్కర్ జంక్షన్, కృష్ణా కాలనీ, రాజీవ్‌నగర్, హనుమాన్‌నగర్, జయశంకర్ జంక్షన్, ఇంక్లైన్, మంజూరునగర్ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. అంబేద్కర్ సమావేశ మందిరం ప్రాంగణంలో సుమారు రూ.5 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో కూడిన అంబేద్కర్ కళాక్షేత్రం, సామాజిక భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. భూపాలపల్లి నుంచి గుడెప్పాడు వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి రూ.664 కోట్లు సాధించామని, బైపాస్ రహదారి పనులను కూడా తన పదవీకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. భూపాలపల్లిలో విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గాంధీనగర్ గుట్టపై సుమారు రూ.200 కోట్లతో సమీకృత అంతర్జాతీయ పాఠశాల నిర్మాణం చేపడుతున్నామని, వచ్చే జూన్ నాటికి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ఈ పాఠశాల లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డీఆర్ డీఓ బాలకృష్ణ, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజకు గిట్టుబాటు ధర లభించేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి రూరల్ మండల పరిధిలోని మొరంచపల్లి, నేరేడుపల్లి, ఎస్ఎం కొత్తపల్లి, గొర్రెవీడు, వజినపల్లి, గూడాడుపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ప్రతి కేంద్రంలో రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తూకంలో పారదర్శకత పాటించాలని, తేమ శాతం పేరుతో రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు అండగా నిలుస్తూ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షుడు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్మియర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్



మహబూబాబాద్ బ్యూరో, మంగళవారం 17(జనం సాక్షి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ అధ్యక్షతన, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రామీల సమక్షంలో జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లకు మలేరియా రక్తపు స్మియర్ పరీక్షలు, మైక్రోస్కోప్ ద్వారా పరాన్నజీవుల గుర్తింపు, పరీక్షా ఫలితాల నమోదు మరియు నివేదికల తయారీపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రవి రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో మలేరియా వ్యాధి నియంత్రణకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపు స్మియర్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని, అనుమానిత మలేరియా కేసుల నుంచి రక్త నమూనాలను సేకరించి మైక్రోస్కోప్ ద్వారా పరీక్షించాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే పరీక్షలు, వాటి వివరాలు మరియు ఫలితాలను సక్రమంగా నమోదు చేసి రోజువారీ, నెలవారీ నివేదికలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రామీల మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనుమానిత మలేరియా కేసుల నుంచి పాసివ్ బ్లడ్ స్మియర్లను సేకరించి పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. మలేరియా మరియు డెంగ్యూ వ్యాధుల కేసులను తగ్గించేందుకు వ్యాధి నిఘా, ముందస్తు గుర్తింపు, నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి నెల 4వ తేదీన ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించి, పరీక్షల పురోగతి, నివేదికలు, మైక్రోస్కోపుల పనితీరు మరియు అవసరమైన ల్యాబ్ సామగ్రిపై సమీక్షించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో రాజకుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వి శ్రీనివాస్, అక్బర్, లావణ్య, అనిల్ ఈ కార్యక్రమంలో జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నల్లబెల్లి, నవంబర్ 17 (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మంగళవారం నల్లబెల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పింఛన్లు అర్హులైన వారికి ఎంతో ఆసరాగా నిలుస్తాయని, ఆర్థిక ఇబ్బందులను కొంతమేర తగ్గించి ఆత్మగౌరవంతో జీవించేందుకు తోడ్పడతాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, తహసీల్దార్ ముప్పు కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్, పిఏసిఎస్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు, సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రకాష్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతి నిధులు, మండల నాయకులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఫోటోకాల్‌ను విస్మరించారని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా



పాలకుర్తి, నవంబరు 17(జనంసాక్షి) : ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఫ్రోటోకాల్ ను విస్మరించారని మంగళవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ మండల కమిటి అధ్వర్యంలో సర్పంచులు ధర్నా చేశారు. పాలకుర్తి, స్టేషన్ఘన్పూర్ ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు బైఠాయించి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సం దర్భంగా ఆపార్టీ మాజీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ మాట్లాడుతూ పెన్షన్ల మంజూరి పత్రాల పంపిణీ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులను అధికారులు ఆహ్వానిస్తే వెళ్లామని తెలిపారు. అయితే మంజూరి పత్రాలు ఆయా గ్రామాల సర్పంచుల చేతులమీదుగా ఎందుకు ఇప్పించలేదని సమావేశంలో అధికారులను ప్రశ్నించామని తెలిపారు. ఎమ్మెల్యే సమక్షం లో కాంగ్రెస్ శ్రేణులు సర్పంచు అని చూడకుండా బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ బానోత్ మహేందర్ పై దాడి చేయడం అనాగరిక చర్య అని అభివర్ణించారు. అందుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో ఆ పార్టీ సర్పంచులు, నాయకులు దర్నా చేపట్టగా, పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని అందోళన కారులను విరమించాలని కోరారు. అందుకు ససేమిరా అంటు బీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మద్య కొద్ది సేపు తోపులాట జరిగింది. ఒకానొక క్రమంలో ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడికి కూడా టిఆర్ఎస్ నాయకులు యత్నించడంతో ఆందోళన కారులను ఎస్సై ఊర సృజన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్టేషన్ కు తరలించారు. అంతకు ముందు సర్పంచు మహేందర్ పై దాడి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేయాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు గాంధీ నాయక్ బొబ్బాల అశోక్ రెడ్డి, ఎర్రబెల్లి వినయ్ రావు, పాము శ్రీనివాస్, జరుపుల బాలు నాయక్. సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గడ్డం కిరణ్ కుమార్, బానోతు మహేందర్, పసులాది యాకస్వామి, పోశాల వెంకన్న, సురేష్ నాయక్, నాగరాజు నాయక్, వెంకట్ నాయక్, దొంతమల్ల గణేష్. త.దితరులు పాల్గొన్నారు.



ప్రజలకు మెరుగైన పోలీస్

సేవలు అందించాలి

- వరంగల్ సిపి శ్వేత ఐపిఎస్
- మామునూరు పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

వరంగల్ ఈస్ట్, నవంబర్ 17 (జనం సాక్షి) : వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ గారు మంగళవారం నాడు మామునూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను, పెండింగ్ కేసుల వివరాలను, కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణను సమీక్షించి పలు సూచనలు చేశారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నాణ్యమైన దర్యాప్తుతో కేసులను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు.డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, అనుమానితులపై నిరంతరం నిఘా ఉంచుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పోలీస్ సిబ్బందికి సీపీ సూచించారు.ఈ తనిఖీలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, పర్వతగిరి సీఐ ఆర్.సంతోష్ కుమార్, మామునూరు ఇన్‌స్పెక్టర్ ఈ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పివిటిజి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కె.హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17(జనంసాక్షి): జిల్లాలోని ఆదిమ తెగలైన కొలాం, థోటి (పి.వి.టి.జి.) గ్రామాలలో మౌలిక వసతుల కల్పన, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సాధించడం జరిగిందని, ప్రధానమంత్రి జన్ మన్, ప్రధానమంత్రి జుగా పథకాల ద్వారా ప్రతి గ్రామంలో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి పి.వి.టి.జి. తెగల పటేళ్లు, ఆదివాసి సంఘాల ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 3 సంవత్సరాల క్రితం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్ మన్, ప్రధానమంత్రి జుగా కార్యక్రమాల క్రింద పి.వి.టి.జి. గ్రామాలలో మౌలిక వసతుల కల్పన, పి.వి.టి.జి. కుటుంబాలకు జీవన ప్రమాణాల పెంపొందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా పి.వి.టి.జి. సంఘాలు సహకరించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. 9 మంత్రిత్వ శాఖల ద్వారా పి.వి.టి.జి. గ్రామాలలో బహుళ ప్రయోజన కేంద్రాలు, అంగన్వాడి భవనాల నిర్మాణాలు, మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా వైద్య పరీక్షలు, ప్రధానమంత్రి జన్ మన్ క్రింద పి.వి.టి.జి. లకు ఇండ్ల నిర్మాణాలు, పి.వి.టి.జి. గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు, పి.వి.టి.జి. గ్రామాలకు సెల్ ఫోన్ సిగ్నల్ సేవలు, వి డి వి కె కేంద్రాల ఏర్పాటు, యువతకు నైపుణ్య శిక్షణ, త్రాగునీరు, పాఠశాలలు, వసతి గృహాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొబైల్ వాహనాల ద్వారా పి.వి.టి.జి. లకు రక్తపోటు, మధుమేహం, దంత, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇవ్వడం జరుగుతుందని, ప్రధానమంత్రి జన్ మన్ లో భాగంగా గత సంవత్సరం 2 వేల 128 మంది లబ్ధిదారులకు ఇండ్లు, ఈ సంవత్సరం 970 మంది పి.వి.టి.జి. కుటుంబాల వారికి ఇండ్ల మంజూరుకు ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందని తెలిపారు. పి.వి.టి.జి. గ్రామాలలో రహదారులు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అటవీ శాఖ సమన్వయంతో మారుమూల గ్రామాలకు రహదారుల అనుసంధానం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆదివాసి యువత నైపుణ్య శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు పొందాలని తెలిపారు. ఈనెల 19వ తేదీ నుండి ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, కుటుంబ పెద్ద మరణిస్తే 5 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. పి.వి.టి.జి. సంఘ ప్రతినిధులు ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు. అంతకుముందు వివిధ సంఘాల ప్రతినిధులు పి.వి.టి.జి. గ్రామాలలో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్, ఐ టి డి ఓ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, ఎ పి ఓ కోలం భాస్కర్, రాజ్ గోండ్ సేవా సమితి జాతీయ ప్రతినిధి సిదం అర్జు, కోలం సంఘ ప్రతినిధులు భీమ్రావు, మాన్కు, తిరుపతి, తుడుందెబ్బ ప్రతినిధులు కోవ విజయ్, సంతోష్, శంకర్, వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
18 నవంబర్ 2026

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు ఏర్పాట్లు చేయాలి



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 17 (జనం సాక్షి) : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు ఖమ్మం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. టి. శ్రీజతో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి అర్హులైన కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, కుటుంబంలోని సంపాదించే సభ్యునికి జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నదని తెలిపారు. నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ పథకాన్ని జిల్లాలో ప్రతి కుటుంబానికి వర్తింపజేసే లక్ష్యంతో అధికారులు పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు.

నెల రోజుల పాటు ప్రత్యేక క్యాంపుల నిర్వహణ

నవంబర్ 19న పథకాన్ని ప్రారంభించిన అనంతరం నెల రోజుల పాటు జిల్లాలోని ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వార్డులో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ ఏ. శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

లాభాపేక్ష లేకుండా మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ నిర్వహణ

- మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 17 (జనం సాక్షి) : మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కర్మాగారంలో 2026–27 చెరకు గానుగ సీజన్ ఘనంగా ప్రారంభమైంది. ఆ సంస్థ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తన సతీమణి చిన్నమ్మతో కలిసి ఉదయం చెరకు గడలను గానుగలో వేసి సీజన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్మాగారంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన గానుగ సీజన్ విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం కర్మాగారం జోన్ పరిధిలోని చెరకు రైతులు, వివిధ రైతు సంఘాల నాయకులతో నామ మాట్లాడుతూ రైతులతో కర్మాగారానికి ఉన్న అనుబంధాన్ని, చెరకు సాగులో వారు ఎదుర్కొంటున్న పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో చక్కెర పరిశ్రమ తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నదని పేర్కొన్నారు. అనేక ఆర్థిక, నిర్వహణపరమైన సవాళ్లు పరిశ్రమల మనుగడకు ఇబ్బందిగా మారుతున్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు కర్మాగారానికి సహకరించాలని కోరారు. రైతులు, పరిశ్రమ పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే ఇరువర్గాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. మధుకాన్ కర్మాగారం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఎదుర్కొన్న ఆర్థిక పరిస్థితులను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. మొత్తం 26 సంవత్సరాల నిర్వహణలో కోజనరేషన్ విద్యుత్ ఉత్పత్తి విభాగంలో రెండేళ్లు, చక్కెర ఉత్పత్తి విభాగంలో మరో రెండేళ్లు మాత్రమే లాభాలు వచ్చాయని, మిగిలిన 22 సంవత్సరాలు నష్టాలను ఎదుర్కొంటూనే కర్మాగారాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ రైతులకు అండగా నిలవాలనే సంకల్పంతో పరిశ్రమను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అనేక చక్కెర కర్మాగారాలు నష్టాలను భరించలేక మూతపడిన విషయాన్ని గుర్తుచేశారు. చక్కెర పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో రైతులకు అందుబాటులో ఉండి, వారికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో మధుకాన్ను కొనసాగిస్తున్నట్లు వివరించారు. తన తండ్రి స్వర్గీయ ముత్తయ్య కూడా రైతేనని, తాను సైతం రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని నామ తెలియజేశారు. రైతుల కష్టాలు, వారి జీవన పరిస్థితులు తనకు తెలుసని, రైతుల కోసం ఏదో ఒకటి చేయాలనే తపనతోనే ఈ కర్మాగారాన్ని నిర్వహిస్తున్నానని చెప్పారు. కర్మాగారాన్ని నిర్వహించడం వెనుక ఎలాంటి లాభాపేక్ష లేదని, రైతులకు మేలు జరగాలనే ప్రధాన ఉద్దేశంతోనే ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. చెరకు రైతులకు కర్మాగారంతో ఉన్న అనుబంధం ఎంతో కీలకమని, రైతుల సహకారం, సిబ్బంది అంకితభావం పరిశ్రమ అభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. హోమం ముగిసిన అనంతరం పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నామ కుటుంబ సభ్యులు, సంస్థ ఏవిపి కోటయ్య, శ్రేయోభిలాషులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, చెరకు రైతులు, కర్మాగార అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సిరిపురం ఇక్కత్ చేనేత క్లస్టర్‌ను సందర్శించిన కలెక్టర్



రామన్నపేట, నవంబర్ 17 (జనంసాక్షి) : రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో నాబార్డ్ సహకారంతో అభివృద్ధి చేసిన ఇక్కత్ చేనేత క్లస్టర్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. ఈ సందర్భంగా నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన 20 స్టాండ్ మగ్గాలు, మూడు వార్పింగ్ యంత్రాలు, మూడు ఆసు యంత్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అలాగే తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా తొమ్మిది మంది చేనేత కార్మికులకు రూ.12 లక్షల సంస్థాగత రుణ సదుపాయం కల్పించినట్లు అధికారులు వివరించారు. చేనేత ఉత్పత్తుల ప్రామాణికత, నేత కార్మికుల గుర్తింపు, మార్కెట్లో ఉత్పత్తుల ప్రాచుర్యాన్ని పెంపొందించేందుకు కోశ ఏఐ సహకారంతో రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆధారిత ' వీవ్ సెన్స్' డిజిటల్ ట్రేసబిలిటీ వ్యవస్థ గురించి కలెక్టర్కు వివరించారు.నాబార్డ్ గ్రామ్య వికాస్ నిధి కింద మంజూరు చేసిన రూ.26 లక్షల గ్రాంట్ సహాయంతో అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టు ద్వారా సిరిపురం, బోగారం, వెల్లంకి గ్రామాలకు చెందిన 20 చేనేత కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని అధికారులు తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి నాబార్డ్ చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ అభినందించారు. చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు మధ్యవర్తులపై ఆధారపడటాన్ని తగ్గించి, కార్మికులకు మెరుగైన ధర లభించేలా ఈ-కామర్స్ వేదికలు, డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ కాసర్ల ఝాన్సీ రాణి మాట్లాడుతూ.. చేనేత క్లస్టర్ను ఈ-కామర్స్ వేదికలతో అనుసంధానం చేయడం ద్వారా ప్రత్యక్ష మార్కెటింగ్ అవకాశాలను విస్తరించి, నేత కార్మికుల ఆదాయాన్ని, జీవనోపాధిని మెరుగుపరచవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, చేనేత శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, షార్ప్ సీఈఓ కూరెళ్ళ నరసింహా చారి, ప్రోగ్రామ్ మేనేజర్ పిఎన్ చారి, క్లస్టర్ ఫెసిలిటేటర్ అంకం నాగరాజు, క్లస్టర్ సభ్యులు, సర్పంచ్ అంబటి ఉపేంద్ర, చేనేత సహకార అధ్యక్షులు రాపోలు షణ్ముఖ, కోడి పండునాథ్, ఏలే వెంకట్నర్సు, లలిత, అమరేందర్, మిరియాల భారతమ్మ, బడుగు శ్యామల, స్వామి, శ్రవణ్ ప్రతినిధులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

అశ్వాపురం మండల కేంద్రంలో మరుగుదొడ్లు కరువు

- మహిళలు, వృద్ధుల అవస్థలు
- 651 మంది లబ్ధిదారులతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం..
- కనీస సౌకర్యాలు లేక ప్రజల ఇబ్బందులు



అశ్వాపురం, నవంబర్ 17 (జనంసాక్షి) : మండల కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా సుమారు 651 మంది లబ్ధిదారులతో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు, గ్రామ ప్రజలు హాజరుకావడంతో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా బయటపడింది. గంటల తరబడి కార్యక్రమం కొనసాగడంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో తదితర ప్రభుత్వ కార్యాలయాల వద్దకు నిత్యం వివిధ పనులపై ప్రజలు వస్తుంటారు. అయినప్పటికీ అక్కడ కనీసం ప్రజా మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా రైతు వేదిక పక్కన మరుగుదొడ్లు ఉన్నప్పటికీ అవి నిరుపయోగంగా ఉండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇకనైనా అధికారులు స్పందించాలి

మండల కేంద్రంలో మహిళలు, వృద్ధులు, చిన్నారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలతో కూడిన ప్రజా మరుగుదొడ్లను నిర్మించాలని, నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని పింఛన్ల కార్యక్రమానికి హాజరైన మహిళలు, లబ్ధిదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



చేర్యాల, నవంబర్ 17 (జనంసాక్షి) : చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్గా ప్రకటించాలని చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ వకలాభరణం నర్సయ్య పంతులు డిమాండ్ చేశారు. మంగళవారం చేర్యాలలో జరిగిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్ నరసయ్య, సీపీఐ(ఎం) పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బూరుగు సురేష్ గౌడ్, టీడీపీ టౌన్ అధ్యక్షులు మిట్టపల్లి నారాయణరెడ్డి తదితర పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నర్సయ్య పంతులు మాట్లాడుతూ.. 2023 ఎన్నికల సందర్భంగా జనగామ ఎన్నికల బహిరంగ సభలో పీసీసీ అధ్యక్షుని హోదాలో తాము గెలిస్తే చేర్యాలను రెవెన్యూ డివిజన్గా ప్రకటిస్తామని హామీ ఇచ్చి గెలిచి నేటికీ మూడు సంవత్సరాలు అవుతుందని, కానీ ఇంతవరకు హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు.మూడు సంవత్సరాల తర్వాత నవంబర్ 19న ముఖ్యమంత్రి హోదాలో సిద్దిపేటకు వస్తున్నారని, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం చేర్యాల రెవెన్యూ డివిజన్ను ముఖ్యమంత్రి హోదాలో ప్రకటించాలని జేఏసీ విజ్ఞప్తి చేస్తుందన్నారు.గతంలో జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ముట్టడి, రాజీవ్ రహదారి ముట్టడి, అసెంబ్లీ ముట్టడి చేశామని, అయినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. సిద్దిపేట బహిరంగ సభలో చేర్యాలను రెవెన్యూ డివిజన్గా ప్రకటించకపోతే ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులను ఈ ప్రాంతంలో తిరగనీయమని హెచ్చరించారు. ఈ సమావేశంలో ముస్త్యాల నాగేశ్వరరావు, మంచాల కొండయ్య, పోతుగంటి రాందాసు, సర్పంచ్ పాండు పటేల్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, అరుణ్ కుమార్, మాజీ సర్పంచ్ రవీందర్, గర్నెపెల్లి రాము, బంగారిగల్ల కిరణ్, సిద్ధి లింగం, ఇన్నారెడ్డి, సుదర్శన్ గౌడ్, తేలు ఇస్తారి, శ్రీహరి రాజు, మైసయ్య, మాజీ సర్పంచ్ అంజయ్య, ఆవుచెర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ చేసి పంట పొలాలకు నీటి మళ్లింపు

- గుక్కెడు నీటి కోసం వీటి నగర్ ప్రజలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని సంబంధిత అధికారులు
- తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



గుర్రంపోడు, నవంబర్ 17 (జనంసాక్షి) : ప్రజల దాహార్తిని తీర్చాల్సిన మిషన్ భగీరథ తాగునీరు కొందరు వ్యక్తుల స్వార్థం వల్ల పంట పొలాలకు మళ్లుతోంది. మక్కపల్లి, పార్లపల్లి, వీటి నగర్ గ్రామాలకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ ప్రధాన పైప్లైన్ను కొందరు రైతులు మధ్యలోనే ఉద్దేశపూర్వకంగా లీక్ చేసి, ఆ నీటిని తమ వ్యవసాయ పొలాలకు మళ్లించుకుంటున్నారని స్థానిక గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రధాన పైప్లైన్ను ధ్వంసం చేసి నీటిని ఇలా అక్రమంగా తోడేస్తుండటంతో, చివరి గ్రామము వీటి నగర్ ప్రాంతాలకు తాగునీరు సరిగ్గా అందడం లేదు. ఫలితంగా గ్రామస్తులు గుక్కెడు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు తాగడానికి నీళ్లు లేక ప్రజలు అల్లాడుతుంటే, మరోవైపు ప్రధాన పైప్లైన్ లీక్ చేసి తాగునీటిని వ్యవసాయానికి వాడుకోవడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.పైప్లైన్ను లీక్ చేసి నీటిని మళ్లిస్తున్న విషయాన్ని ఇప్పటికే పలుమార్లు సంబంధిత మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, లీకేజీలకు మరియు నీటి మళ్లింపుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని తమ గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాగార్జునసాగర్ నీటిని తరలించే పథకాన్ని నిలిపివేయాలి

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



హాలియా, నవంబర్ 17 (జనం సాక్షి) : నాగార్జునసాగర్ జలాశయం నుంచి ఆంధ్రప్రదేశ్కు నీటిని తరలించేందుకు భారీ టన్నెల్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాజీ ఎమ్మెల్యే భగత్ ఆరోపిస్తూ త్రీవంగా వ్యతిరేకించారు బీఆర్ఎస్ నేతలు రైతులతో కలిసి. మంగళవారం నాగార్జునసాగర్ కొత్త వంతెన వద్ద పైపులు కార్యకర్తలధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరజీవి జలపథకం పేరుతో నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలించేందుకు సుమారు రూ. 1,200 కోట్లతో భారీ టన్నెల్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ నీటిని తరలించుకుపోతున్న పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చుందా అంటూ నేతలు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి తెలంగాణ ప్రయోజనాలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులకు సిద్ధమవుతుండగా, తెలంగాణ ప్రభుత్వం మరియు బీజేపీ నాయకులు ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. వెంటనే కేంద్ర జలసంరక్షణ మండలి (కేఆర్ఎంబీ) జోక్యం చేసుకొని టన్నెల్ నిర్మాణ ప్రయత్నాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నేను యెడల బి ఆర్ఎస్ పార్టీ రైతులతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రైకా చైర్మన్ రాంచందర్ నాయక్, కడారి అంజయ్య యాదవ్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాద బాధిత రైతులకు అండగా ఎమ్మెల్యే బత్తుల

- తన వాహనంలోనే ఆసుపత్రికి తరలింపు
- రోడ్డు ప్రమాదాన్ని చూసి చలించిన ఎమ్మెల్యే..
- క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందేలా చొరవ



మిర్యాలగూడ, నవంబర్ 17 (జనంసాక్షి) : ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని నిరూపించారు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి. రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతులను చూసి చలించిపోయిన ఆయన, ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన సొంత వాహనంలోనే వారిని ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. మిర్యాలగూడ మండలం క్రిస్టాపురం గ్రామ సమీపంలోని బైపాస్ రహదారిపై బొల్లిగుట్ట తండాకు చెందిన రైతులు ధాన్యంతో ట్రాక్టర్పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడటంతో పలువురు రైతులు గాయపడ్డారు. అదే మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించడమే లక్ష్యంగా తన సొంత వాహనంలో వారిని మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులను సంప్రదించి, గాయపడిన రైతులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అంతేకాకుండా ప్రమాదానికి కారణమైన టిప్పర్ లారీపై కేసు నమోదు చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను గుర్తించి, ప్రమాద సమయంలో క్షణం ఆలస్యం చేయకుండా స్పందించి బాధిత రైతులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పదవులు, హోదాలకంటే ఆపదలో ఉన్నవారికి సాయం చేయడమే గొప్ప మానవత్వమని ఆయన మరోసారి చాటిచెప్పారని పలువురు అభినందించారు.

ఖమ్మం రైల్వే స్టేషన్ పార్కింగ్ కోసం ప్రభుత్వ భూమి కేటాయింపు

- ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి



ఖమ్మం, కార్పొరేషన్, నవంబర్ 17 (జనం సాక్షి) : ప్రజల చిరకాల ఆకాంక్ష భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైల్వే స్టేషన్ ప్రక్కన భద్రాచలం వెళ్ళే రోడ్డు విస్తరణకు మార్గం సుగమం చేశామని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలోని భూమి అప్పగింత కార్యక్రమంలో పాల్గొని కలెక్టరేట్ లో మీడియా ప్రతినిధులతో ఈ అంశంపై ఎంపీ వివరించారు. ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూలి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైల్వే స్టేషన్ ప్రక్కన భద్రాచలంకు వెళ్లే రహదారి కేవలం 15 నుంచి 16 అడుగుల వెడల్పు మాత్రమే ఉందని, గత 20 ఏళ్లుగా ఆ రహదారిని విస్తరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారని తెలిపారు. ఆ రహదారి విస్తరణకు, ఖమ్మం రైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన భూముల బదలాయింపు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చేందుకు రైల్వే శాఖతో చర్చలు జరిపి భూమి సమస్య పరిష్కారానికి కృషి చేశామని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రక్కన భద్రాచలం వెళ్ళే రహదారి విస్తరణకు అవసరమైన భూమిని రైల్వే శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించేలా ప్రతిపాదనలు రూపొందించామని ఎంపీ తెలిపారు.

షాపులకు నష్టం కలగకుండా చర్యలు

ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే శాఖకు అప్పగించే రాష్ట్ర ప్రభుత్వ భూమి విషయంలో అక్కడ ఉన్న షాపులకు ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, భూమి బదలాయింపు ప్రక్రియలో ప్రత్యేక చొరవ చూపిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కు ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద రహదారి విస్తరణ కోసం రైల్వే భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు సహకరించిన దక్షిణ మధ్య రైల్వే అధికారులకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్కు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.
ప్రజల చిరకాల సమస్యల పరిష్కారం,ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రైల్వే అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కోడి దొంగతనం కేసుతో మనస్తాపం

- అంబేద్కర్ విగ్రహంపైకి ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం
- పురుగుల మందు తాగడంతో ఆసుపత్రికి తరలింపు



భద్రాచలం, నవంబర్ 17 (జనంసాక్షి) : తనపై కోడి దొంగతనం కేసు నమోదు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. పెట్రోల్ బాటిల్, పురుగుల మందు డబ్బాతో అంబేద్కర్ విగ్రహంపైకి ఎక్కి ఆందోళనకు దిగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చర్ల మండలం తేగడ గ్రామానికి చెందిన నరేష్పై కోడి దొంగతనం కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో తనపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ, తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం భద్రాచలం అంబేద్కర్ సెంటర్కు చేరుకున్నాడు. విగ్రహంపైకి ఎక్కి చేతిలో పురుగుల మందు, పెట్రోల్ బాటిల్ పట్టుకుని ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానని బెదిరించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన స్థానికులు చాకచక్యంగా వ్యవహరించి యువకుడి దృష్టి మరల్చి వెనుక నుంచి వెళ్లి అతడి చేతిలోని పెట్రోల్ బాటిల్ను లాక్కున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. అయితే అప్పటికే నరేష్ పురుగుల మందు తాగినట్లు గుర్తించి వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ అతడికి చికిత్స అందిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
18.11.2026

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఉమ్మడి మేడిపల్లి,నవంబర్ 17 (జనంసాక్షి):
జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి, భీమవరం మండలల్లో చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, సమాజంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.మేడిపల్లి మండల కేంద్రంలో ,భీమారం మండలం మన్నెగూడెం గ్రామంలో చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.. అనంతరం కొండాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోధకాలు బాధితులు, డయాలసిస్, ఎయిడ్స్ బాధితులు ఇలా వివిధ వర్గాలకు చెందిన పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.జిల్లాలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని, ప్రస్తుతం 25 మండలాల పరిధిలో 2,13,448 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా ప్రభుత్వం పెన్షన్లు అందిస్తోందని వివరించారు. సుదీర్ఘకాలంగా కొత్త పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ఊరటనిస్తూ జిల్లాలో కొత్తగా 13,958 పెన్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతి నెలా రూ.49 కోట్లకు పైగా పెన్షన్ సొమ్మును లబ్ధిదారులకు అందిస్తూ వారి జీవనానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు వెల్లడించారు.చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సుమారు 13 గ్రామాల్లో 281 మంది చేనేత కార్మికులకు పెన్షన్లు అందించే కార్యక్రమం కొనసాగుతోందని, ప్రతి నెలా సుమారు రూ.51 లక్షల మేర పెన్షన్ సొమ్ము పంపిణీ అవుతోందని పేర్కొన్నారు. మడికొండ ప్రాంతంలో కూడా సుమారు 1,100 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నట్లు వివరించారు. చేనేత వృత్తిలో నిజంగా పనిచేస్తూ, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్న అర్హులైన కార్మికులందరికీ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాంబే, భీవండి, సిరిసిల్ల వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన చేనేత కార్మికులు కూడా అర్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే పెన్షన్ పొందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు రూ.20 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన పావలా వడ్డీ, వడ్డీలేని రుణాల విధానాలను తిరిగి అమల్లోకి తీసుకువస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా శ్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు సుమారు రూ.67 వేల కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని తెలిపారు.
ప్రతి ఒక్కరికి బీమా రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీమా సౌకర్యం లేని రైతు కుటుంబాలకు కూడా రైతు మరణించిన సందర్భంలో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తోందని వెల్లడించారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు.. ఆర్థిక భరోసా

రాష్ట్రంలోని అర్హులైన పేద కుటుంబాలకు రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాలు, నిరుపేద కుటుంబాలు గౌరవప్రదమైన జీవితం గడిపేలా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు.ఒకవైపు పేదలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తూనే, మరోవైపు మహిళా సాధికారత, రైతు సంక్షేమం, చేనేత కార్మికుల అభ్యున్నతి, నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే ఇందిరమ్మ రాజ్య లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

‘ఇందిరమ్మ టవర్స్’కు విశేష స్పందన

అర్హత కలిగిన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి:కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనంసాక్షి:
నిజామాబాద్ నగరంలోని నాగారం ప్రాం తం ఆర్‌జీకే కాలనీలో తెలంగాణ హౌ సింగ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ లో ఫ్లాట్ల కేటాయింపు కోసం ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు.నిజామా బాద్ నగర పాలక సంస్థ పరిధిలో నివసిస్తున్న అర్హులైన నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో సొంత ఇంటిని కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని గుర్తు చేశారు. నిజామాబాద్ నగరంలోని ఆర్‌జీకే కాలనీలో 480 ఫ్లాట్ల కేటాయింపునకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి ఫ్లాట్ రిజిస్ట్రేషన్ విస్తీర్ణం 512 చదరపు అడుగులు కాగా, ఒక్కో ఫ్లాట్‌పై ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ మినహాయించి లబ్ధిదారుడి వాటాగా తాత్కాలికంగా రూ.3.50 లక్షలు నిర్ణయించబడిందని, ఫ్లాట్ల నిర్మాణానికి అవసరమైన స్థలం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు.అర్హత కలిగిన దరఖాస్తుదారులను ముందుగా ఐడీ వెరిఫికేషన్ ద్వారా గుర్తించి, అనంతరం లాటరీ విధానంలో ఫ్లాట్ల కేటాయింపు చేపడతామని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సొంత ఇల్లు లేదా ప్లాట్ లేని వారు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలకు మించని వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొ న్నారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన నిజామాబాద్ నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. డిసెంబర్ 5వ తేదీ లోపు మీ సేవా కేంద్రాల ద్వారా లేదా అధికారిక మీ సేవా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.



రామగుండం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో సంక్లిష్ట శస్త్రచికిత్సలు

ఇద్దరు అధిక ప్రమాద గర్భిణులకు విజయవంతంగా ప్రసవాలు.. తల్లులు, శిశువులు క్షేమం

గోదావరిఖని, జనంసాక్షి:ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, రామగుండం, అధిక ప్రమాద గర్భిణులకు సకాలంలో, ప్రత్యేకమైన వైద్య సేవలను అందిస్తూనే ఉంది.ఒక కేసులో, ఉత్తరప్రదేశ్‌కు చెందిన, ప్రస్తుతం మంచిర్యాలలో నివసిస్తున్న అమీనా, మంచిర్యాలలోని ఎం సి హెచ్ లో గర్భిణీ పరీక్షలు చేయించుకుంటున్నారు. గర్భం దాదాపు 7 నెలల దశలో ఉన్నప్పుడు, తీవ్రమైన రక్తస్రావానికి దారితీసే అధిక ప్రమాద స్థితి అయిన మేజర్ డిగ్రీ ప్లాసెంటా ప్రీవియా ఉన్నట్లు ఆమెకు నిర్ధారణ అయింది. తదుపరి చికిత్స కోసం ఆమెను హనుమకొండలోని జిఎంహెచ్ కు రిఫర్ చేశారు. అయితే, వరంగల్‌లో చికిత్స పొందడానికి రోగి, ఆమె కుటుంబ సభ్యులు సుముఖంగా లేకపోవడంతో, రక్తస్రావం ఫిర్యాదుతో వారు రామగుండం జి జి హెచ్ లోని అత్యవసర విభాగాన్ని ఆశ్రయించారు.రోగిని వెంటనే ఆసుపత్రిలో చేర్చుకుని, రక్తమార్పిడులు అందించి, మధ్యాహ్నం 2.30 గంటలకు ఆసుపత్రికి చెందిన ప్రసూతి, స్త్రీ వైద్య (ఓబి జి వై) బృందం అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించింది. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.అదేవిధంగా, ఈ రోజు మధ్యాహ్నం సుమారు 3:00 గంటలకు, మరో అధిక ప్రమాద గర్భిణి అఖిల రామగుండం జిజిహెచ్ లో చేరగా, వైద్య బృందం ఆమెకు విజయవం తంగా శస్త్రచికిత్స నిర్వహించింది.ప్రస్తుతం, మరో ఇద్దరు అధిక ప్రమాద గర్భిణులు రామగుండం జి జి హెచ్ లోని యాంటెనేటల్ వార్డులో చేరి, అవసరమైన వైద్య సేవలు పొందుతూ నిరంతర పర్యవేక్షణలో ఉన్నారు. ఈ విజయవంతమైన చికిత్సలు అత్యవసర ప్రసూతి సేవల లభ్యతను, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, రామగుండంలోని వైద్యులు, నర్సింగ్ అధికారులు, సహాయక సిబ్బంది అంకితభావంతో చేసిన కృషిని ప్రతిబింబిస్తున్నాయి.గర్భిణులకు నాణ్యమైన ప్రసూతి ఆరోగ్య సంరక్షణను, సకాలంలో అత్యవసర సేవలను అందించడానికి ఈ సంస్థ కట్టుబడి ఉంది.

ప్రజల జీవితాలకు భరోసా ‘ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా’

రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి..

గోదావరిఖని, జనంసాక్షి :ప్రజల జీవితాలకు భరోసా కల్పించే పథకం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పై మంగళ వారం ఎన్ టి పి సి మిలీనియం హాల్ లో ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో బీమా చేసిన వ్యక్తి మరణించిన సందర్భంలో కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా రూ 5.00 లక్షల తక్షణ ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. రాష్ట్రం లోని ప్రతి కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించడానికి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే ధ్యేయనీగా ఈ పథకం ప్రవేశ పెట్టడం జరుగుతుందని అన్నారు. ఈ పథకం లో చేరడానికి చెల్లించే ప్రీమియం మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయం తీసుకోవడం దేశ చరిత్రలో ప్రప్రధమమని అన్నారు. ఒక కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా నిలబడటమే నిజమైన సంక్షేమమని అన్నారు. ముఖ్యమంత్రి , ఉప ముఖ్య మంత్రి కలిసి గొప్ప సంకల్పంతో తీసుకొచ్చిన ఈ పథకం ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి చేరేలా కార్పొరేటర్లు బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఎవరూ అవగాహన లేకుండా ఈ పథకాన్ని కోల్పోకూడదని నమోదు సమయంలో ఆధార్, కుటుంబ వివరాలు, నామినీ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రతి ఒక్కరు విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో వెయ్యి కోట్లతో రామగుండం నగరంలో జరుగుతున్న అభివృద్ధిని కూడా



వాడ వాడలా వివరించాలని అన్నారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ ప్రతిష్టాత్మక సామాజిక భద్రతా పథకంలో ఏ ఒక్కరు కూడా నష్ట పోకుండా వివరాలు నమోదు చేయాలని అన్నారు. డేటా సరిగా నమోదు చేయకపోతే అర్హులు నష్ట పోవడంతో పాటు ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు). రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ పథకం విధి విధానాలు వివరించారు. పద్దెనిమిది నుండి యాభయ్ తొమ్మిది సంవత్సరాల లోపు వయస్సు ఉన్న కుటుంబం లో సంపాదించే వ్యక్తి ఈ బీమా పథకానికి అర్హులని అన్నారు. ఆధార్ కార్డ్ లోఉన్న జనన తేదీని ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రేషన్ కార్డు లేకున్నా ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఇటీవల సేకరించిన జన గణన 2026 డేటా సిద్ధంగా ఉన్న నేపధ్యంలో అవసరమైన మరికొన్ని వివరాలు నగర పాలక సంస్థ సిబ్బంది సేకరించి ఆన్ లైన్ నమోదు చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తూ పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొలని కవిత , పలువురు కార్పొరేటర్లు రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి , ఇన్ చార్జ్ ఎ సి పి నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , నగర పాలక సంస్థ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట..!

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష కీలక ఉత్తర్వులు



మంథని, నవంబర్ 17, (జనం సాక్షి) :
గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న అక్రమ, అనధికార, నకిలీ ఇళ్ల, ప్లాట్ల రిజిస్ట్రేషన్లను అరికట్టేందుకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ (పంచాయతీ వింగ్) కీలక సర్యు లర్ జారీ చేశారు. ఈ సర్యులర్‌లో పం చాయతీ కార్యదర్శులు, సబ్-రిజిస్ట్రార్లకు కఠిన ఆదేశాలు ఇచ్చారు. “రిజిస్ట్రేషన్‌కు ముందు కార్యదర్శి స్వయంగా క్షేత్ర పరిశీలన చేయాలి. యజమాని, కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ఇరుగు-పొరుగు వారికి ముందస్తు నోటీసు ఇవ్వాలని తెలిపారు. ఆస్తి హద్దులను రాతపూర్వకంగా నిర్ణయించి, స్పష్టంగా గుర్తులు (పెగ్గింగ్) వేయాలి.ఆస్తి విస్తీర్ణం, ప్లింథ్ ఏరియాను ప్రత్యక్షంగా కొలిచి ధృవీకరించాలి. ఆస్తి పన్ను బకాయి లేదని (నో డ్యూ సర్టిఫికెట్) ఇవ్వాలి.నాలుగు వైపులా ఉన్న పొరుగు వారి పేర్లు, లేఅవుట్ ప్లాట్ / ఇంటి నంబర్లు, వారి సంతకాలు తప్పనిసరిగా నమోదు చేయాలి.పొరుగు వారి నుంచి ఎలాంటి అభ్యంతరాలు, యాజమాన్య వివాదాలు, లేఅవుట్ ఉల్లంఘనలు లేకపోతేనే నో డ్యూ / నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలి.నో డ్యూ సర్టిఫికెట్ జారీ చేసిన తేదీ నుంచి కేవలం 30 రోజులు మాత్రమే చెల్లుతుంది. 30 రోజులు దాటితే మళ్లీ కొత్త వెరిఫికేషన్ చేయాలి. టైటిల్ డాక్యుమెంట్లు, ఇంటి నంబర్, ట్యాక్స్ అసెస్‌మెంట్ నంబర్లను పంచాయతీ రిజిస్టర్లతో క్షుణ్ణంగా సరిచూసిన తర్వాతే రిజిస్ట్రేషన్ చేయాలి.ఉమ్మడి / పూర్వీకుల ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ఫ్యామిలీ మెంబర్ / లీగల్ హెయిర్ సర్టిఫికెట్ తప్పనిసరి.నో డ్యూ సర్టిఫికెట్ గడువు 30 రోజులు దాటితే తిరస్కరించాలి.ఆదేశాలు పాటించని వారిపై సిసిఏ రూల్స్ 1991 ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎంపీవో లు, డీపీవో లు ఈ ఆదేశాల అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు.

పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో విషాదం

విద్యార్థి ఆత్మహత్య



నల్లగొండ ప్రతినిధి (జనంసాక్షి):
హాస్టల్ గదిలోనే ఉరివేసుకుని బలవన్మరణం రెండో సంవత్సరం చదువుతున్న గండికోట జగదీష్ మృతి.పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి హాస్టల్ గదిలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. విద్యార్థి మృతితో తోటి విద్యార్థులు, కళాశాల వర్గాల్లో విషాదం నెలకొంది.వివరాల్లోకి వెళితే. గండికోట జగదీష్ అనే విద్యార్థి పాలిటెక్నిక్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇతడు రంగారెడ్డి జిల్లా మాడుగుల గ్రామానికి చెందినవాడిగా సమాచారం. కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న జగదీష్, హాస్టల్ గదిలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.ఈ ఘటనను గుర్తించిన హాస్టల్ సిబ్బంది, ఇతర విద్యార్థులు వెంటనే స్పందించి అధికారులకు సమాచారం అందించారు. అనంతరం విద్యార్థి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే జగదీష్ ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై శివప్రసాద్ ఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. హాస్టల్‌లో ఏం జరిగింది? ఆత్మహత్యకు ముందు విద్యార్థి ఎవరితోనైనా మాట్లాడాడా? అనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాల్సిన వయసులో విద్యార్థి జీవితం అర్ధాంతరంగా ముగియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.పోలీసుల విచారణ పూర్తయితేనే విద్యార్థి ఆత్మహత్యకు గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థుల ప్రవర్తనపై కళాశాల యాజమాన్యం పర్యవేక్షణ ఉండాలి: ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల బ్యూరో(జనంసాక్షి):ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ వేదికలను అధికంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ వైద్యులుగా ఎదగాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు .మంగళవారం జిల్లా పరిధిలోని మెడికల్ కాలేజ్ వైద్య విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులతో కలిసి గంజాయి, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారం నిజమని నమ్మవద్దని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు, మెసేజ్‌లు, అనుమానాస్పద లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, కుటుంబ సమాచారం, ఓ టీపీలు, బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు.సైబర్ నేరగాళ్లు విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని నకిలీ ఉద్యోగ ప్రకటనలు, బహుమతుల ఆశలు, ఫేక్ సోషల్ మీడియా అకౌంట్లు, ఆన్‌లైన్ గేమింగ్ , డిజిటల్ అరెస్ట్, తదితర మార్గాల్లో మోసా లకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు.ర్యాగింగ్ మరియు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని,వాటి జోలికి వెళ్లకూడదని తెలిపారు.పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కలశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కలశాల అధ్యాపకులు, సైబర్ ఆర్.ఎస్.ఐ జునైద్, సైబర్ సిబ్బంది గంగారెడ్డి, మహేష్, కిట్టు , అభిషేక్, విజేయ్ , వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

హామీల అమలేది?

- మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో రామగుండానికి ఒరిగిందేమిటి?
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌ను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్..



గోదావరిఖని, జనంసాక్షి:కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, అనేక హామీలతో అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో ప్రస్తుత పాలకులు చేస్తున్న అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌ను ప్రశ్నించారు. మహిళలకు ఇచ్చిన హామీలు, విద్యార్థినులకు స్కూటీలు, నిరుద్యోగ భృతి, వృద్ధులు, వికలాంగులకు పెంచుతామని ప్రకటించిన పింఛన్ల గురించి పాలకులు సమాధానం చెప్పడం లేదన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో కళ్యాణలక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి చెక్కులు అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం కళ్యాణలక్ష్మి కింద లక్షా 116 రూపాయల ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం హామీ అమలు కావడం లేదని విమర్శించారు.

కేసీఆర్ హయాంలోనే మౌలిక వసతుల కల్పన

రామగుండం ప్రాంతంలో ప్రతి ఇంటికి తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక వాహనాలు, ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం వంటి మౌలిక వసతులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని చందర్ పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎం ప్లాన్ గ్రాంట్ కింద సుమారు రూ.200 కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో కూరగాయల మార్కెట్లు, మాంసం మార్కెట్లు, పార్కింగ్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్ థియేటర్, చౌరస్తాల సుందరీకరణ వంటి పనులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. రామగుండం పట్టణ అభివృద్ధిలో భాగంగా అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా వచ్చి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారని గుర్తుచేశారు. అయితే గతంలో అభివృద్ధి పనులకు గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను కూల్చివేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను కొనసాగించాల్సింది పోయి, వాటికి ఆటంకాలు కలిగించడం ఏమిటని ప్రశ్నించారు. లక్ష్మీనగర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంతంలో పార్కింగ్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్ థియేటర్ నిర్మాణం కోసం రూ.8 కోట్లు కేటాయించామని, టెండర్ ప్రక్రియ పూర్తయి సుమారు రూ.2 కోట్ల మేర పనులు కూడా జరిగాయని తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేయడంపై ప్రస్తుత పాలకులు దృష్టి సారించడం లేదని ఆరోపించారు. ఈ అంశంపై తమ ఫ్లోర్ లీడర్ సమ్మయ్య యాదవ్ ప్రశ్నిస్తే మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా మైకులు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విట్టల్‌నగర్ ప్రాంతంలో నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం కోసం రెండో విడత సీఎం ప్లాన్ గ్రాంట్ నిధులతో పనులు చేపట్టామని, చిన్నచిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని చందర్ తెలిపారు. రమేష్‌నగర్ చౌరస్తా సుందరీకరణతో పాటు అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటు పనులు చేపట్టామని, మూడేళ్లు గడిచినా విగ్రహాన్ని ప్రారంభించలేని పరిస్థితి ఉందని అన్నారు. తిలక్‌మార్ సెంటర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు కూడా పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రాలేదని విమర్శించారు. కూల్చివేతలకు చూపుతున్న శ్రద్ధ అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. లక్ష్మీనగర్ వ్యాపార సముదాయంలోని చిరు వ్యాపారులను రోడ్డుపైకి నెట్టివేశారని చందర్ ఆరోపించారు. స్థానికంగా వ్యాపారం చేసుకునే వారికి ఇబ్బందులు కలగడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో వ్యాపారుల ఉపాధికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. మూడేళ్ల పాలనలో ఇచ్చిన హామీల అమలు, నిలిచిపోయిన అభివృద్ధి పనులపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌తో పాటు అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కౌశిక హరి, వాళ్ల హరీష్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్, మహిళా నాయకురాలు మూల విజయరెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పట్టణ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
18 నవంబర్ 2026

సమస్యలు పరిష్కరించాలంటూ మెడికల్ కార్మికుల ధర్నా

- ఆరో రోజు కొనసాగుతున్న నిరసన దీక్షలు
- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ
- వేతనాలు, పీఎఫ్, సెలవులు మంజూరు చేయాలని డిమాండ్
- సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే ధన్‌పాల్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17 (జనం సాక్షి):
మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం నిజామాబాద్‌లో ఆందోళన నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి. జిల్లా కేంద్ర ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ రైల్వే బ్రిడ్జి, నాందేవ్‌వాడ, హమాల్వాడి, సుభాష్‌నగర్ మీదుగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ క్యాంపు కార్యాలయానికి చేరుకుంది. అక్కడ ధర్నా నిర్వహించి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామన్న ప్రభుత్వ హామీ అమలు కావడం లేదని విమర్శించారు. జిల్లా కేంద్ర ఆసుపత్రికి ఇతర జిల్లాలు, మహారాష్ట్ర నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిని 750 పడకలకు విస్తరిస్తూ రెండేళ్ల క్రితం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, తగిన బడ్జెట్ కేటాయింపులు, సిబ్బంది నియామకాలు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం 615 పడకలకు సరిపడా సిబ్బందితోనే 750 పడకలకు సేవలందిస్తుండటంతో కార్మికులపై పనిభారం పెరుగుతోందని పేర్కొన్నారు. 750 పడకలకు అవసరమైన బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని, శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల కార్మికులకు వేతనాలకు అనుగుణంగా పీఎఫ్ జమ చేయాలని, పండగ, జాతీయ, ఆర్జిత సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు.
కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సావధానంగా విని సానుకూలంగా స్పందించారు. సిబ్బంది కొరత, బడ్జెట్ కేటాయింపులు, వేతన సమస్యలను ఆరోగ్యశాఖ మంత్రి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, స్వయంగా మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు డి. చక్రపాణి, కార్యదర్శి గోవర్ధన్, కోశాధికారి ఫెరోజ్ అలీ, యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, కవిత, స్వరూప, భారతి, సాయి సుధ, పవిత్ర, సాయి రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

- రూ.5 లక్షల జీవిత బీమాతో నిరుపేద కుటుంబాలకు భరోసా
- కథలాపూర్‌లో 554 మందికి చేయూత పింఛన్లు.. 32 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కథలాపూర్, నవంబర్ 17 (జనం సాక్షి): పేదల సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గరీబీ హఠావో, కూడు, గూడు, గుడ్డ నినాదాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. మంగళవారం కథలాపూర్ మండల కేంద్రంలో 554 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు, 32 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తోందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంపై భారీ అప్పుల భారం పడిందని, అయినప్పటికీ సంక్షేమ పథకాలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని వివరించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.
రేషన్ కార్డులు కలిగిన అర్హులైన పేద కుటుంబాలకు కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల బీమా అందించేలా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతోందని తెలిపారు. ఈ నెల 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భూమిలేని నిరుపేద కుటుంబాలకూ బీమా భరోసా కల్పించాలన్నదే దీని ఉద్దేశమన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి కుటుంబ పెద్దల వివరాలు సేకరించి అర్హుల పేర్లు నమోదు చేయాలని సూచించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లతో కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రహదారులు, వంతెనలు, సాగునీటి వసతులు, పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో, ఆర్డీవో, తహసీల్దార్, ఆర్ఐ, మండలంలోని 19 గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలులో వైఫల్యంపై బీఆర్ఎస్ నిరసన

తెలంగాణ చౌక్‌లో మేనిఫెస్టో ప్రతులు చింపి ఆందోళన



కరీంనగర్ టౌన్, నవంబర్ 17, (జనంసాక్షి) :
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపిస్తూ కరీంనగర్ నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గంగుల కమలాకర్ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను చింపి చెత్తబుట్టలో వేసి నిరసన తెలిపారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా హామీలను అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కొత్తపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, కార్పొరేటర్ షేక్ యూసుఫ్, బీఆర్ఎస్ నాయకులు సుంకిశాల సంపత్ రావు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ దెబ్బకు అంగన్‌వాడీ వంటలు బంద్!

- రెండు వారాలుగా నిలిచిన గ్యాస్ సరఫరా
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందని వేడివేడి భోజనం
- మంథనిలో 196 కేంద్రాల్లోనూ తప్పని ఇబ్బందులు
- సొంతంగా గ్యాస్ తెచ్చుకోవాలంటూ సిబ్బందికి అనధికారిక ఆదేశాలు



మంథని, నవంబర్ 17 (జనంసాక్షి):పంటగ్యాస్ ఈ-కేవైసీ నిబంధనలు అంగన్‌వాడీ కేంద్రాల వంటలకు ఆటంకంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా గత రెండు వారాలుగా వేలాది కేంద్రాలకు గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు వేడివేడి పోషకాహారం అందడం లేదు. రాష్ట్రంలో 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, గ్యాస్ కొరతతో మధ్యాహ్న భోజనం వండలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని కేంద్రాల్లో పిల్లలను భోజనానికి ఇళ్లకు పంపిస్తుండగా, మరికొన్ని చోట్ల తల్లిదండ్రులే క్యారియర్ల లో భోజనం పంపుతున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని శిశు అభివృద్ధి ప్రాజెక్టు పరిధిలో 196 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, అన్నింటికీ గ్యాస్ అనుసంధానాలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ-కేవైసీ సమస్యతో గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కేంద్రాల పేరిట ప్రత్యేక సంస్థాగత గ్యాస్ కనెక్షన్లు మంజూరు కాకపోవడంతో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత పేర్లతోనే కనెక్షన్లు తీసుకున్నారు. ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్లకు ఈ-కేవైసీ తప్పనిసరి చేయడంతో సమస్య మొదలైంది. ఒక వినియోగదారు గుర్తింపు సంఖ్యపై ఒక కనెక్షన్‌కే ఈ-కేవైసీ అవకాశం ఉండటంతో ఉపాధ్యాయులు తమ ఇంటి గ్యాస్ కనెక్షన్లకు ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల కనెక్షన్లకు ఈ-కేవైసీ పూర్తికాక ఏజెన్సీలు సరఫరా నిలిపివేసినట్లు తెలుస్తోంది. గ్యాస్ కొరతతో అంగన్‌వాడీల్లో నిర్దిష్ట మెనూ అమలు కావడం లేదు. చిన్నారులకు అందించాల్సిన అన్నం, పప్పు, ఆకుకూరలు, సాంబారు, ఉడికించిన కోడిగు డ్లు, 200 మిల్లీలీటర్ల పాలు సకాలంలో అందించలేని పరిస్థితి ఏర్పడింది. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించలేద ని సమాచారం. సమస్య పరిష్కారమయ్యే వరకు ఉపాధ్యాయులే సొంతంగా గ్యాస్ ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు అనధికారికంగా సూచించిన ట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకం అమలులో సాంకేతిక నిబంధనల కారణంగా చిన్నారులకు పోషకాహారం దూరమవుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక సంస్థాగత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసి సరఫరాను పునరుద్ధరించాలని సిబ్బంది కోరుతున్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ఆర్మూర్,నవంబర్ 17(జనంసాక్షి) :
ఆర్మూర్ పటణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలుర జూనియర్ కళాశాల హాస్టల్‌ను ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతులు,ఆహార నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం స్వయంగా భోజనం చేసి రుచి,నాణ్యతను పరిశీలించారు. అలాగే భోజన బిల్లులు, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి వారికి నాణ్యమైన విద్యాబోధన,మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత స్థాయి,వారి భవిష్యత్తుకు నాణ్యమైన విద్య,వసతులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం హాస్టల్ పక్కనే నిర్మాణంలో ఉన్న ఏటీసీ భవన పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో బిజెపి కిషన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్,పట్టణ అధ్యక్షుడు మందుల బాలు,బిజెపి నాయకులు గంగాధర్,వివేక్,ఉదయ్, అరుణ్ పాల్గొన్నారు.

ప్రాణాపాయంలోనూ పైసల వేట

ప్రభుత్వ అంబులెన్స్‌లోనూ రూ.3 వేల వసూళ్లు

- ఉస్మానియాకు,గాంధీకి తరలించాలంటే డబ్బులు కట్టాల్సిందేనా?
- ఫోన్‌పే చెల్లింపు ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు





నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 17 (జనంసాక్షి) :
ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిన బాధ్యత అధికారులది. అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడాల్సిన ప్రభుత్వ అంబులెన్స్ సిబ్బంది డబ్బుల వసూళ్లకు పాల్పడితే పరిస్థితి ఏమిటి? ప్రాణాపాయంలో ఉన్న రోగిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ఏకంగా రూ.3,000 వసూలు చేసిన ఘటన నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై సామాజిక, మానవ హక్కుల కార్యకర్త ఎం.డి. సాదిక్ పాషా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రూ.3,000 ఫోన్‌పే ద్వారా చెల్లించిన ఆధారాలను సైతం ఫిర్యాదుకు జతచేశారు. అలాగే జనం సాక్షి ప్రతినిధికి ఆధారాలు ఇచ్చారు.

ప్రాణం కాపాడాలంటే రూ.3 వేలు కట్టాల్సిందేనా?
హాలియాకు చెందిన ఎం.డి. ఖ్రుద్దీన్ ఈ నెల 5న నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ అంబులెన్స్ కోసం సంప్రదించగా.. రూ.3,000 చెల్లిస్తేనే అంబులెన్స్ వస్తుందని డ్రైవర్ స్పష్టం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రోగి ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో చేసేదేమీ లేక డ్రైవర్ సూచించిన ఫోన్‌పే నంబర్‌కు రూ.3,000 చెల్లించారు. అనంతరం అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించగా, మరుసటి రోజు ఉదయం రోగి మృతి చెందారు.

ఫోన్‌పే ఆధారాలతో బట్టబయలు:
ఈ వ్యవహారానికి సంబంధించి డబ్బులు చెల్లించిన ఫోన్‌పే లావాదేవీల ఆధారాలను ఫిర్యాదుదారు సమర్పించారు. ప్రభుత్వ అంబులెన్స్ సేవలకు డబ్బులు వసూలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. సంబంధిత డ్రైవర్, సిబ్బంది వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అంబులెన్స్ సేవలు ఉచితంగా అందించాలి కానీ నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంత తతంగం జరుగుతున్న డాక్టర్లకు తెలియడం లేదా తెలిసిన పట్టించుకోకుండా ఉండటం వెనుక అంతర్యం ఏంటి అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వారి మీద విచారణ చేస్తా : డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్.నగేష్
జనం సాక్షి ప్రతినిధి వివరణ కోరగా ప్రభుత్వ అంబులెన్స్ వారు ఎవరైనా డబ్బులు తీసుకుంటే చర్యలు తప్పవని తెలిపారు అలాగే విచారణ చేస్తానని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ఎవరు లంచం అడిగిన తీసుకున్న వారి మీద చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్య, సంక్షేమానికి పెద్దపీట.. గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం

- చిగురుమామిడిలో రూ.33.50 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం
- 550 మందికి కొత్త చేయూత పింఛన్ల పంపిణీ.. ఈ నెల 19 నుంచి ఖాతాల్లో నగదు జమ
- త్వరలో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ బీమా
- విద్యార్థులకు క్రీడా వసతులు కల్పించాలని అధికారులకు మంత్రి పొన్నం ఆదేశం





చిగురుమామిడి, నవంబర్ 17 (జనంసాక్షి):
గ్రామీణ ప్రాంతాల్లో విద్య, క్రీడల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు 550 మంది లబ్ధిదారులకు కొత్త చేయూత పింఛన్లను పంపిణీ చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.28.50 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను, రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు కష్టపడి చదివి వార్షిక పరీక్షల్లో 400కు పైగా మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలూ అవసరమని, విద్యార్థుల శారీరక దృఢత్వం కోసం కళాశాల ఆవరణలో వెంటనే వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.
అనంతరం మహిళాశక్తి గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 4.68 లక్షల కొత్త చేయూత పింఛన్లు మంజూరు చేశామని తెలిపారు. చిగురుమామిడిలో 550 మందికి పింఛన్లు అందిస్తున్నామని, ఈ నెల 19 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని వెల్లడించారు. ఆధారాల కొరతతో దరఖాస్తులు తిరస్కరణకు గురైన అర్హులు నిరాశ చెందవద్దని, మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కొత్తగా ఏడు రకాల పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు.
మహిళా సంఘాలకు రూ.79 వేల కోట్ల నిధులు సమకూర్చడంతో పాటు వడ్డీలేని రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా 18 ఏళ్ల నిండిన మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలతో మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, తాజాగా మరో 2,000 ఇళ్లు మంజూరయ్యాయని వెల్లడించారు.
త్వరలో భూమితో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. గౌరవెల్లి ప్రాజెక్టు, ఎంఎంఆర్-3 పనులను వేగవంతం చేస్తున్నామని, రైతులు ఆయిల్‌పామ్ సాగు, ఇంకుడు గుంతల నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ నెల 21న మండలంలో దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ చిత్రా మిశ్రా, డీపీవో జగదీశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్, సర్పంచ్ ఆకవరం భవానీ శివప్రసాద్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రామ్మోహన్ చారి, మండల విద్యాధికారి జయప్రద, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అందె సురేష్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'సమ్మాన్ సమారోహ్'లో సురక్షిత్ జిల్లాగా రాజన్న సిరిసిల్ల

- హెచ్ఐవీ 95-95-95 లక్ష్యాల సాధనలో జిల్లాకు గుర్తింపు
- జిల్లా కలెక్టర్ ను కలిసిన నాకో రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం



రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 17(జనం సాక్షి);
నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) నిర్దేశించిన హెచ్ ఐ వీ నియంత్రణ 95-95-95 లక్ష్యాల సాధనలో జిల్లా మెరుగైన ప్రగతి సాధించి "సురక్షిత్" జిల్లాగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా నాకో రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం జిల్లాను మంగళవారం సందర్శించి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ సిబ్బందితో మర్యాదపూర్వకంగా కలిశారు.నాకో ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మాన్ సమారోహ్ కార్యక్రమంలో హెచ్ ఐ వీ నియంత్రణకు సంబంధించి జిల్లాలు సాధిస్తున్న ప్రగతి ఆధారంగా (సురక్షిత్, సక్షమ్, సంఘర్ష్‌శీల్) కేటగిరీలుగా వర్గీకరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 జిల్లాలు సురక్షిత్, 12 జిల్లాలు సక్షమ్, ఒక జిల్లా సంఘర్ష్‌శీల్ స్థాయిలో ఉండగా, సురక్షిత్ హోదా సాధించిన 20 జిల్లాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కూడా చోటు సంపాదించింది.హెచ్ ఐ వీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మంది తమ హెచ్ ఐ వీ స్థితిని తెలుసుకోవడం, నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మంది యాంటీ రెట్రోవైరల్ థెరపీ పొందడం, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మంది వైరల్ సప్రెషన్ సాధించడం 95-95-95 కార్యక్రమ ప్రధాన లక్ష్యాలని అధికారులు వివరించారు.జిల్లాలో హెచ్ ఐ వీ పరీక్షలు, బాధితులను సకాలంలో గుర్తించడం, చికిత్సకు అనుసంధానం చేయడం, ఏ ఆర్ టీ సేవలు, నిరంతర ఫాలోఅప్, వైరల్ లోడ్ మానిటరింగ్ తదితర సేవలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ఈ పురోగతి సాధ్యమైందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తో రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ సమావేశమై జిల్లాలో హెచ్ ఐ వీ/ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల అమలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతి, సురక్షిత్ హోదా సాధనకు దోహదపడిన కార్యక్రమాలపై వివరించారు.
సాధించిన పురోగతిని కొనసాగిస్తూ హెచ్ ఐ వీ నివారణ, పరీక్షలు, చికిత్స, ఫాలోఅప్ సేవలను మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు.జిల్లా సురక్షిత్ హోదా సాధించడంలో జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ అధికారులు, ఐ సీ టీ సీ/ ఏ ఆర్ టీ సంబంధిత సేవల సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో చేసిన కృషి కీలకమని పేర్కొన్నారు.నాకో తాజా నేషనల్ స్కోర్‌కార్డులో జాతీయ స్థాయిలో రాష్ట్రం 2వ స్థానాన్ని సాధించినట్లు సమ్మాన్ సమారోహ్ ప్రెస్ నోట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు సురక్షిత్ స్థాయిని సాధించే దిశగా కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఏంజెల్ ఆల్ఫ్రెడ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాంరెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17 (జనంసాక్షి): డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై నేరాల నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో ఎన్ఎస్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ సంకల్ప' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ దుష్పరిణామాలు, ఆన్‌లైన్ మోసాలు, మహిళల భద్రత, రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఏడాదిలో రోడ్డు ప్రమాదాల్లో 340 మంది మృతి చెందగా, 60 శాతం ప్రమాదాలు గ్రామీణ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల మధ్య ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మైనర్ డ్రైవింగ్‌పై ప్రతి వారం ప్రత్యేక తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాసంస్థల వద్ద అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. మహిళల రక్షణ, షీ టీమ్స్ సేవలపై ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఎన్. శుభం ప్రకాష్, తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ పి. రామ్మోహన్ రెడ్డి, ఎన్ఎస్‌సీ జనరల్ సెక్రటరీ డాక్టర్ కవితా రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీలు ప్రకాష్, మస్తాన్ అలీ, జాయింట్ సెక్రటరీలు సీహెచ్. రజనీకాంత్, కె. సిరీష్, వి. దుశాంత్, ఉష, శ్రీ శ్

పార్టీలకతీతంగా పేదలకు చేయూత

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- నందిగామ మండలంలో 562 మందికి కొత్తగా ఆసరా.. నెలకు రూ.13 లక్షల మేర లబ్ధి



నందిగామ, నవంబర్ 17 (జనం సాక్షి) : అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హత ఆధారంగా నూతన చేయూత పెన్షన్లను మంజూరు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. నందిగామ మండలంలో కొత్తగా మంజూరైన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో అరుంధతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ నందిగామ మండల పరిధిలో పెన్షన్ల కోసం మొత్తం 575 మంది దరఖాస్తు చేసుకోగా, అర్హత కలిగిన 562 మందికి ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేసిందని,వీరికి ప్రతినెలా సుమారు రూ. 13 లక్షల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరనుందని అన్నారు . మిగిలిన దరఖాస్తులను సైతం పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దివ్యాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసా అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఏ ఒక్కరికి రేషన్ కార్డులు కానీ, పింఛన్లు కానీ ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలందరికీ రేషన్ కార్డులు పెన్షన్లు అందజేస్తుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు ఏ పార్టీ వారైనా సరే తప్పకుండా లబ్ధి చేకూర్చే బాధ్యత తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ పిఎసిఎస్ చైర్మన్లు చంద్రపాల్ రెడ్డి ప్రభాకర్,బుచ్చయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమార్ గౌడ్ పలు గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, లబ్ధిదారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అర్హులైన వారందరికీ పెన్షన్లు

- దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు



తాండూరు, నవంబర్ 17 (జనంసాక్షి) : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో అర్హులైన వారందరికీ పెన్షన్లు అందేలా కృషి చేస్తున్నామని దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు పేర్కొన్నారు. మంగళవారం యాలాల్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తున్నామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎవరూ ఇబ్బంది పడకుండా పెన్షన్లను సకాలంలో అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు ఆధ్వర్యంలో గ్రామ లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు.అనంతరం సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన వారందరికీ పెన్షన్లు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో మంజూరు పత్రాలు అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


మెడికల్ కాలేజీ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 17 (జనం సాక్షి) : నారాయణపేట మెడిక ల్ కాలేజీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధికారు లను ఆదేశించారు. మంగళ వారం నారాయణపేట మెడికల్ కాలేజీని జిల్లా కలెక్టర్ ప్రియాంక పనుల ను పరిశీలించారు. అలాగే ఎం సి హెచ్ మదర్ చైల్డ్ హాస్పిటల్ పనులను కూడా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్, డయాలసిస్, ఇఎన్టి అన్ని విభాగాలపై ఆరా తీసి పలు పనులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. నర్సింగ్ కాలేజీ పనులను పరిశీలించి త్వరగా హార్డ్ వర్క్ చేయాలని ఆదేశించా రు. నర్సింగ్ కాలేజీలో ఎంతమంది ఉన్నారని కలెక్టర్ ఆరా తీశారు. స్పోర్ట్స్ కొరకు లోపల బ్యాడ్మింటన్ పెట్టాలని బయట పికిల్ బాల్, షటిల్ గ్రౌండ్ వేసేలా చర్యలు చర్యలు తీసుకోవాలని డివైస్ ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ జి వేణుగోపాల్, ఏఈ సాయి మురారి, మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ సంపత్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తోళ్ల కార్ఖానా భూమి ప్రభుత్వానిదే..



అల్వాల్, నవంబరు 17 (జనంసాక్షి) : అల్వాల్ మండల పరిధిలోని తోళ్ల కార్ఖానా స్థలం ప్రభుత్వ భూమి అని స్పష్టం చేస్తూ రెవెన్యూ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అల్వాల్ తహసీల్దార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ బోర్డులపై 'తెలంగాణ ప్రభుత్వం – – రెవెన్యూ శాఖ' అని పేర్కొంటూ, ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని, ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా అధికారులు చేపట్టిన ఈ చర్యపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విలువైన ఈ స్థలాన్ని కాపాడటంతోపాటు ప్రజా అవసరాలకు వినియోగించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక వక్రభాష్యాలు

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి
- దోపిడి, కబ్జాదారులకు తావులేదు
- పేదల అభివృద్ధికి ఎంతదూరమైనా వెళ్తాం
- లబ్ధిదారులకు చేయూత పింఛన్లు పంపిణీ
- ప్రతి గడపకూ పథకాలు చేర్చే బాధ్యత అధికారులదే ..



రంగారెడ్డి నవంబర్ 17 (జనంసాక్షి) : పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతుంటే ఓర్వలేక కొందరు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు తీరు మార్చుకోకపోతే ఇబ్రహీంపట్నం నడిరోడ్డుపై నిలబెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని ఇబ్రహీంపట్నంలోని శాస్తా గార్డెన్స్లో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాలకు సంబంధించిన చేయూత పింఛన్ల లబ్ధిదారులకు మంజూరీ పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారత, పేదల సంక్షేమమే ప్రజాప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీ పథకాన్ని పేదల గడపకు చేర్చే బాధ్యత అధికారులేదనని చెప్పారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందని పక్షంలో నేరుగా తనను సంప్రదించవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ పింఛన్లు వచ్చాయని అన్నారు. రెండు విడతల్లోనూ అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినట్లు చెప్పారు. మిగిలిన వారికి సైతం విడతల వారీగా ఇస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీలత, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసమే పోలీసుల బలం

- ధారూర్ పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



ధారూర్, నవంబర్ 17 (జనంసాక్షి) : ప్రజల విశ్వాసమే పోలీసులకు బలమని, పోలీసుల పనితీరుతో ప్రజల్లో మరింత నమ్మకం, భరోసా కల్పించాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. మంగళవారం నాడు ధారూర్ పోలీస్ స్టేషన్ను సందర్శించి స్టేషన్ పరిసరాలు, నిర్వహణ, రికార్డులు, పోలీస్ సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణలోని పరిశుభ్రత, రిసెప్షన్ నిర్వహణ, వివిధ రికార్డులు, రిజిస్టర్లు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించి సిఐ రఘురాంను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధారూర్ సీఐ రఘురాం,ఎస్ఐ.సురేష్,పోలీస్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్వ శ్రీశైలం గౌడ్ సేవలు మరువలేనివి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు



మహేశ్వరం, నవంబర్ 17 (జనం సాక్షి) : అమీర్పేట్ మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు.సోమవారం రాత్రి మహేశ్వరం మండలం అమీర్ పేట్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదిష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ... బస్వ శ్రీశైలం గౌడ్ బీజేపీ పార్టీ బలోపేతం కోసం కృషి చేశారన్నారు.అమీర్ పేట్ గ్రామ అభివృద్ధికి కృషి చేశారన్నారు. శ్రీశైలం గౌడ్ మృతి అమీర్ పేట్ గ్రామ ప్రజలకు తీరని లోటు అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, నాయకులు ఆచారి, రాజ్ భూపాల్ గౌడ్,అందెల శ్రీరాములు యాదవ్,బొక్క నర్సింహ రెడ్డి, బస్వ పాపయ్య గౌడ్,కడారి జంగయ్య యాదవ్,మిద్దె సుదర్శన్ రెడ్డి,అసంతయ్య గౌడ్,అశోక్ గౌడ్,దేశ్యా నాయక్,యాదయ్య గౌడ్, కాసాని వెంకటేష్ గౌడ్, వనంపల్లి శ్రావణ్ కుమార్,ఉపేందర్,పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయ్ మిల్క్ డైరీ కూల్చివేతదారులపై కఠిన చర్యలు తీసుకోండి

- మాదాపూర్ పోలీసులకు బాధితుడు మొర



శేరిలింగంపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి) : సిఎంసి బినామి స్టిక్కర్ ను హిటాచి వాహనానికి అంటించి దౌర్జన్యంగా విజయ్ మిల్క్ డైరీ భవనాన్ని కూల్చివేయడంతోపాటు ప్రశ్నించిన తనపై దాడులకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్లాల రాజు యాదవ్ అనే వ్యక్తి మంగళవారం మాదాపూర్ పోలీసులకు కలిసి అందజేసిన ఫిర్యాదులో మొరపెట్టుకున్నాడు. మాదాపూర్ పోలీసులు మరియు బాధితుల కథనం ప్రకారం... మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి గుట్టల బేగంపేట్ ప్రాంతానికి చెందిన మల్లాల రాజు యాదవ్ వ్యాపారాన్ని కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మాదాపూర్ పరిధి మెట్రో పిల్లర్ నెంబర్ సి-1744 సమీపంలోని విజయ్ మిల్క్ డైరీ ని నిర్వహిస్తున్నాడు. అయితే ఈ నెల 11న రాత్రి ఓ ప్రైవేటు హిటాచి వాహనానికి సిఎంసి స్టిక్కర్ను అంటించి వచ్చి హఠాత్తుగా భవనాన్ని కూల్చివేస్తున్న సమాచారం తనకు తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకోగా 'ది క్యూబ్ బై ఫ్యూచర్ ట్రెండ్స్' అనే ప్రైవేట్ సంస్థకు సంబంధించిన కొందరు వ్యక్తులు విజయ్ మిల్క్ డైరీపై ప్రత్యక్ష దాడితో కూల్చివేతలకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. కాగా కూల్చివేతల సమయంలో ఎం. శ్రవణ్ కుమార్ యాదవ్, గోపాల్ ముదిరాజ్, ఎం. మహేష్ యాదవ్, పరమేష్ యాదవ్ ఘటనా స్థలంలో ఉండడంతో జరుగుతున్న దారుణానికి సంబంధించి వారి వివరణ కోరగా అసభ్యకరమైన పదజాలంతో తీవ్రంగా దూషించడంతోపాటు పరిస్థితులు దారుణంగా ఉంటాయని హెచ్చరించి దాడి చేయడంతో తనకు జరిగిన అన్యాయంపై మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, దీనికి సంబంధించి కేసు నమోదు కావడంతో పాటు దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు అందజేస్తాం

- మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ



సదాశివపేట, నవంబర్ 17 (జనంసాక్షి) : అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు అందించి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి లు అన్నారు. మంగళవారం సదాశివపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ అధ్యక్షతన చేయూత పింఛన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ చేయుట ఆసరా పింఛన్ల పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులకు, నిరుపేదలు, వితంతువులకు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు వారి జీవనానికి అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పింఛన్ల ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభిస్తుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని మెరుగైన జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజుగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు,సిబ్బంది ,మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- 12 ఏళ్ల కల తీర్చింది ప్రజా ప్రభుత్వం
- పెన్షన్ మంజూరు పత్రాల కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



బంట్వారం, నవంబర్ 17 (జనం సాక్షి) : బంట్వారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీలి కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. బంట్వారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన సిద్దిపేటలో ముఖ్యమంత్రి ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమాలి అందించే గొప్ప పథకం ఇది అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం, సంక్షేమ పథకాలను అమలు చేయడం కోసం ప్రతిరోజూ 18 గంటల పాటు నిర్విరామంగా కష్టపడుతున్నారు అలాంటి నాయకుడి నాయకత్వంలో తెలంగాణ ముందుకు వెళ్తోంది. పెన్షన్ రావడం అనేది లబ్ధిదారులకు 12 ఏళ్ల కల నెరవేరింది అన్నారు ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఆఫీసర్ మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు అనధికారులు పెన్షన్స్ పొందుకున్న లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్ మున్సిఫ్ కోర్టు పనులను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

- త్వరలో కోర్టు ప్రారంభోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు



తూప్రాన్, నవంబర్ 17 (జనం సాక్షి) : తూప్రాన్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మున్సిఫ్ కోర్టు ప్రారంభానికి సర్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ కోర్టు భవనాన్ని సందర్శించి నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలు, ప్రారంభోత్సవ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. కోర్టు భవనంలో పెండింగ్లో ఉన్న చిన్నచిన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బోరుబావిని, నీటి సరఫరా ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు హాలులోని ఫర్నిచర్ను పరిశీలించి, వాటిని అవసరానికి అనుగుణంగా క్రమపద్ధతిలో ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా భవనం వెనుక భాగంలో వాహనాల పార్కింగ్ కోసం టిన్షెడ్ నిర్మించాలని, కోర్టు ప్రాంగణం చుట్టూ పచ్చని మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. జడ్జి విశ్రాంతి గది, స్టెనో గది, సర్వర్ గది, సిబ్బంది గది, న్యాయవాదుల బార్రూమ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గదులను పరిశీలించారు. కోర్టు ప్రధాన గేటుపై నామఫలకం ఏర్పాటు చేయడంతోపాటు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. కోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించనున్న సమావేశానికి సంబంధించి సమీకృత మండల కార్యాలయాల ఎదుట ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసే ముఖ్య అతిథుల విడిది, విశ్రాంతి ఏర్పాట్ల కోసం ప్రభుత్వ అతిథి గృహాన్ని కూడా సందర్శించి పరిశీలించారు. తూప్రాన్లో మున్సిఫ్ కోర్టు ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభోత్సవ తేదీని ఖరారు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమతో పాటు సూపరింటెండెంట్ మొయినుద్దీన్, డీఎస్పీ నరేందర్ గౌడ్, ఆర్డీవో భవయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, ఎస్ఐ గంగరాజు, న్యాయవాదులు బొడ్డు శ్రీనివాస్, ఎం. అశోక్, వేణుగోపాల్ చారి తోపాటు పోలీస్, మున్సిపల్, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
18 నవంబర్ 2026

3.5 లక్షల మెదళ్లతో ట్రాఫిక్‌కు చెక్

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి విద్యార్థుల వినూత్న ఆలోచనలకు అవకాశం

- సైబరాబాద్ మూవ్స్-2026పై 400కు పైగా విద్యాసంస్థల్లో అవగాహన
- నవంబర్ 26 నుంచి 28 వరకు ఇన్నోవేషన్ ఛాలెంజ్







శేరిలింగంపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి) : సురక్షితమైన, రద్దీ రహిత రవాణా వ్యవస్థ నిర్మాణంలో విద్యార్థులను భాగస్వాములను చేసే లక్ష్యంతో సైబరాబాద్ పోలీస్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా వర్చువల్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. సైబరాబాద్ మూవ్స్-2026లో భాగంగా మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా 400కు పైగా పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 3.5 లక్షల మంది విద్యార్థులతో అనుసంధానమయ్యారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజన విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల ప్రతినిధులతో వర్చువల్‌గా మాట్లాడారు. జూమ్‌తో పాటు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కూడా పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నవీద్ ఖాన్, డబ్ల్యూఆర్ఐ ప్రతినిధి శ్రీనివాస్ అల్లవల్లి సైబరాబాద్ మూవ్స్-2026 లక్ష్యాలను వివరించారు. పట్టణ రవాణా సమస్యల పరిష్కారానికి విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, సూచనలు అందించాలని కోరారు. ఇన్నోవేషన్ ఛాలెంజ్ ద్వారా ఉత్తమ ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు తమ ఇళ్లు, పాఠశాలలు, నిత్యం ప్రయాణించే మార్గాలను పటాలపై గుర్తిస్తూ రవాణా సమస్యలను అధ్యయనం చేయవచ్చని కమిషనర్లు తెలిపారు. రహదారిని సురక్షితంగా దాటడం, కాలిబాటలను వినియోగించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవచ్చన్నారు. పోలీసు సిబ్బంది, పట్టణ ప్రణాళిక నిపుణులు, ఇంజనీర్లు, మెట్రో, బస్సు రవాణా విభాగాల ప్రతినిధులతో మాట్లాడి భవిష్యత్ అవకాశాలను తెలుసుకోవచ్చని వివరించారు. విద్యార్థులు కేవలం ప్రయాణికులుగా కాకుండా నగర రవాణా వ్యవస్థలో మార్పులకు బాధ్యతాయుతమైన భాగస్వాములుగా ఎదగాలని పిలుపునిచ్చారు. సురక్షిత రహదారులు, మెరుగైన రోడ్డు క్రమశిక్షణ, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం కోసం సమిష్టి భాగస్వామ్యం అవసరమన్నారు. నవంబర్ 26 నుంచి 28 వరకు ఇన్నోవేషన్ ఛాలెంజ్ ప్రతిపాదనల స్వీకరణ ఉంటుందని, టి-హబ్‌లో నిర్వహించే సైబరాబాద్ మూవ్స్-2026 కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు www\.cyberabadmoves\.in ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం డీసీపీ రవికుమార్, అదనపు డీసీపీ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



ఎండిన వరి పంటలకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

మెదక్ జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- నర్సాపూర్‌లో రైతు, ప్రజాసంఘాల కరువు అధ్యయన యాత్ర డిమాండ్

నర్సాపూర్ నవంబర్ 17 (జనం సాక్షి) : ఎండిపోయిన వరి పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని రైతు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మెతుకుసీమ కరువు అధ్యయన యాత్ర మంగళవారం నర్సాపూర్ మండలంలోని చిప్పలతుర్తి, జక్కపల్లి, నాగులపల్లి, మూసాపేట, రుస్తుంపేట గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎండిపోయిన వరి పంటలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాత్ర బృందం నాయకులు మాట్లాడుతూ.. గత వారం రోజులుగా మెదక్ జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటిస్తుండగా, అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. పంట నష్టంపై కనీసం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే కూడా నిర్వహించలేదని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఒకవైపు కరువుతో రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం కేవలం మనోహరాబాద్ మండలాన్నే కరువు ప్రాంతంగా ప్రకటించడం సిగ్గుచేటని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా కరువు పరిస్థితులను గుర్తించి మెదక్ జిల్లాను మొత్తం కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంటలు పూర్తిగా ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.ఈ పర్యటనలో మెదక్ సిటిజన్ ఫోరం నాయకులు బి. కొండల్ రెడ్డి, పి.డి. ఆనందం, భుజంగరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం, బట్టి అజయ్, బొందుగుల నాగరాజు, అపర్ణ, కడారి నాగరాజు, ప్రేమ్ తదితర నాయకులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



వయస్సు చిన్న.. ప్రతిభలో మిన్న

ప్రపంచ రికార్డులే సొంతం!

- కూచిపూడి నృత్యంలో 19 ప్రపంచ రికార్డులు
- ఫ్యాషన్ రంగంలోనూ పలు టైటిళ్లు సాధించిన పదేళ్ల చిన్నారి కొంకటి ఇతిక్ష

మావల నవంబర్18 (జనంసాక్షి): ఆదిలాబాద్‌కు చెందిన పదేళ్ల చిన్నారి కొంకటి ఇతిక్ష తన అసాధారణ ప్రతిభతో నృత్య, ఫ్యాషన్ రంగాల్లో విశేష గుర్తింపు పొందుతోంది. చిన్న వయస్సులోనే అద్భుత ప్రతిభను కనబరుస్తూ పలు ప్రపంచ రికార్డులు, ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకుంటూ జిల్లాకు గర్వకారణంగా నిలుస్తోంది. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న ఇతిక్ష కూచిపూడి నృత్యంలో ఏకంగా 19 ప్రపంచ రికార్డులు సాధించింది. అంతేకాకుండా 'నారి పురస్కార్', 'నాట్య మయూరి' వంటి పలు పురస్కారాలను అందుకుంది. నృత్యరంగంతో పాటు ఫ్యాషన్ రంగంలోనూ తనదైన ముద్ర వేస్తూ 'సబ్ జూనియర్ మిస్ తెలంగాణ', 'లిటిల్ మిస్ ఇంటెలిజెంట్ సౌత్ ఇండియా-2025' వంటి ప్రతిష్టాత్మక టైటిళ్లను కైవసం చేసుకుంది. చిన్న వయస్సులోనే రెండు విభిన్న రంగాల్లో అసాధారణ ప్రతిభను చాటుతున్న ఇతిక్షను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో చిన్నారిని సత్కరించి, ఆమె సాధించిన విజయాలను ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి తల్లిదండ్రులు సృజన, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

తేజశ్రీకి న్యాయం చేయాలని తల్లి నిరాహార దీక్ష



రాజేంద్రనగర్, నవంబర్17 (జనం సాక్షి) : ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు తేజశ్రీకి న్యాయం చేయాలని కోరుతూ ఆమె తల్లి లక్ష్మీ మంగళ వారం ముషరాం బాగ్‌లోని తన నివాసంలో నిరాహార దీక్ష చేపట్టారు. లైంగిక వేధింపుల ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్యను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న విశ్వవి ద్యాలయ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అక్కడికి చేరుకుని దీక్షకు సంఘీభావం తెలిపారు. తేజశ్రీకి, ఫిర్యాదుదారులకు, సాక్షులకు రక్షణ కల్పించి నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. వైస్‌ఛాన్సలర్‌పై 24 గంటల్లో చర్యలు తీసుకోకపోతే విశ్వవిద్యాలయంలో పెద్ద ఎత్తున శాంతియుత నిరసనలు, నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. తన కుమార్తెకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని తల్లి స్పష్టం చేశారు.

ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణానికి కీలక ముందడుగు

765 కేవీ విద్యుత్ లైన్ మళ్లింపునకు పవర్‌గ్రిడ్-జిల్లా కలెక్టర్ మధ్య ఎంఓయూ



మావల నవంబర్ 18 (జనం సాక్షి): ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణానికి ఆటంకంగా ఉన్న 765 కేవీ విద్యుత్ ప్రసార లైన్ మళ్లింపునకు పవర్‌గ్రిడ్ సంస్థ, జిల్లా కలెక్టర్ మధ్య ఎంఓయూ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు పవర్‌గ్రిడ్ ఉన్నతాధికారులు మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను క్యాంపు కార్యాలయంలో కలిసి, లైన్ మళ్లింపు ప్రక్రియపై వివరించారు. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ ఒప్పందం కీలకంగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, పవర్‌గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజర్ పి.ఆర్.ఎస్. యాదవ్, డీజీఎం చి. వెంకన్న, చీఫ్ ఇంజినీర్ పరిమళ, సీనియర్ డీజీఎం భిక్షపతి, సిఈ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు ఆంజనేయ స్వామి చందనోత్సవం, మహాసంప్రోక్షణకు గవర్నర్‌కు ఆహ్వానం

గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేసిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు



హైదరాబాద్, నవంబర్ 17(జనంసాక్షి) : జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న 60 ఏళ్లకోసారి జరిగే చందనోత్సవం, మహాసంప్రోక్షణ, నిజరూప దర్శన మహోత్సవాలకు హాజరుకావాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఆహ్వానించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రెవెన్యూ, దేవాదాయ శాఖల ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు తదితరులు మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కొండగట్టు క్షేత్ర పురాణం, ఆలయ ఆవిర్భావం, స్థలపురాణం, ఆధ్యాత్మిక విశిష్టత, చారిత్రక ప్రాశస్త్యాన్ని గవర్నర్‌కు వారు వివరించారు. 60 ఏళ్లకోసారి నిర్వహించే ఈ విశిష్ట ఆధ్యాత్మిక ఉత్సవాల ప్రాధాన్యతను తెలియజేస్తూ, మహోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా గవర్నర్‌ను ఆహ్వానించారు. అంతకుముందు మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ సౌమ్య మిశ్రా గవర్నర్‌ను లోక్‌భవన్‌లో కలిశారు. రాష్ట్రంలో మహిళల భద్రత కు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

ఆరోగ్యశాఖలో ఇక నిర్లక్ష్యానికి తావులేదు

- పీహెచ్‌సిల పనితీరుపై రోజువారీ సమీక్ష
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట (జనంసాక్షి): ఆరోగ్యశాఖలో పనితీరు మెరుగుపర్చేందుకు అధికారులు సమష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు.ఇకపై వ్యక్తులపై ఆధారపడకుండా వ్యవస్థాగత మార్పులతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్ లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శాఖలో ప్రతి అధికారి తన బాధ్యతలను గుర్తించి, ప్రాధాన్యతా అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.నవంబర్ 30 వరకు ప్రతిరోజు పీహెచ్‌సి లతో పది నిమిషాల పాటు సమీక్ష నిర్వహిస్తానని ప్రకటించారు.ప్రతి అధికారి తన పరిధిలోని కార్యక్రమాలు, బాధ్యతలు, పర్యవేక్షించాల్సిన అంశాలను జాబితా చేసుకోవాలని సూచించారు.వాటిలో అత్యంత కీలకమైన ఐదు అంశాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాలన్నారు.మొత్తం పనుల్లో 80 శాతం పురోగతి సాధించేందుకు ఈ ఐదు అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పెండింగ్ పనులు, అత్యవసర అంశాలు, పూర్తి చేసిన కార్యక్రమాల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. నవంబర్ 30 వరకు ప్రతిరోజూ పీహెచ్‌సిల వారీగా సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రతి అధికారి తన పనుల పురోగతిని ఒక పేజీలో రాసుకొని సమావేశానికి రావాలని ఆదేశించారు. ఏ పని పూర్తయింది, ఏది పెండింగ్‌లో ఉంది, ఎంత శాతం పురోగతి సాధించారనే వివరాలు స్పష్టంగా తెలియజే యాలన్నారు. సమీక్షకు హాజరుకాకపోవడాన్ని సహించేది లేదని తేల్చిచెప్పారు.డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫైళ్ల సర్క్యులేషన్, అడ్మినిస్ట్రేటివ్ ప్రొసీజర్స్ పక్కాగా ఉండాలని ఆదేశించారు.ఫైళ్లు నిబంధనల ప్రకారం సక్రమంగా రావాలని, ఆఫీస్ ప్రొసీజర్స్, క్యాడర్ మేనేజ్‌మెంట్‌లో లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.పాత కారణాలు చెబుతూ పనులు ఆలస్యం చేయడాన్ని ఇకపై అంగీకరించ బోమన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇమ్యూనైజేషన్, లేబర్ రూముల ఆధునీకరణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రుల వైపు మళ్లించేలా సేవల్లో గణనీయమైన మార్పు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.వెక్టర్ బార్న్ వ్యాధుల నియంత్రణ వంటి అంశాల్లో ఆరోగ్యశాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమస్య ఏ స్థాయిలో ఉంటే అదే స్థాయిలో పరిష్కరించుకోవాలని, ప్రతి చిన్న విషయాన్ని జిల్లా కలెక్టర్ లేదా డీఎంహెచ్‌వో స్థాయికి తీసుకురావడం సరైన విధానం కాదన్నారు. ఆఫీసులో ఉన్నంతసేపు ఇతర విషయాలు పక్కనపెట్టి విధులపైనే దృష్టి పెట్టాలని హెచ్చరించారు. సానుకూల దృక్పథంతో పనిచేస్తూ ఆరోగ్యశాఖలో మార్పుకు అధికారులు ముందుండాలన్నారు. పనితీరు మెరుగుపర్చుకోని వారిని మారుమూల ప్రాంతాలకు, అవసరమైతే శాఖ వెలుపలికి పంపించే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు.పాత విషయాలను తవ్వకుండా, నేటి నుంచి పద్ధతి ప్రకారం పనిచేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ కోటిరత్నం, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రామగిరి ఖిల్లాను సందర్శించిన సినీనటుడు నాగచైతన్య

చిత్రీకరణ స్థల పరిశీలన కోసమే ఖిల్లాను సందర్శించినట్లు సమాచారం



రామగిరి, నవంబర్ 17 (జనం సాక్షి) : పెద్దపల్లి జిల్లా రామగిరి ఖిల్లాను సినీ నటుడు నాగ చైతన్య మంగళవారం సందర్శించారు. చిత్రీకరణ స్థల పరిశీలన కోసమే ఖిల్లాను సందర్శించినట్లు సమాచారం. ఖిల్లా పరిసరాలు, కొండపై నుంచి కనిపించే ప్రకృతి దృశ్యాలు, పురాతన కట్టడాలను నాగచైతన్య పరిశీలించారు. చిత్రీకరణకు అనువు గా ఉండే ప్రదేశాల గురించి సహచరులతో చర్చించారు. నాగ చైతన్య రాకతో ఖిల్లా వద్ద అభిమా నులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370